ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం 13.07.2025 | సంపుటి : 11 సంచిక : 355 | పేజీలు : 12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370

సామాన్యుని స్వరం
జనంసాక్షి tv
JANAMSAKSHI TV

తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

# అధిక వడ్డీలతో అభివృద్ధి కుంటుపడుతోంది

## మౌళిక సదుపాయాలను కల్పించడంలో ముందున్నాం


ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి ఛైర్మన్ ఎస్.మహేంద్రదేవ్‌కు శాలువా కప్పి సన్మానం చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. చిత్రంలో రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరస్పరం గౌరవించుకున్నప్పుడే అభివృద్ధి సాధ్యం
- 'యువతకు ఉపాధి కల్పించడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నాం
- పారిశ్రామిక రంగంతోపాటు సేవల రంగం అభివృద్ధి కోసం ప్రణాళికలు
- ఉద్యోగులకు సముచితమైన అవకాశాలు కల్పిస్తేనే రాష్టానికి కంపెనీలు వస్తాయి
- ఆర్ఆర్ఆర్, ఓఆర్ఆర్‌ను అనుసంధానిస్తూ రేడియల్ రోడ్లు నిర్మిస్తున్నాం
- ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి ఛైర్మన్ ఎస్.మహేంద్రదేవ్ సీఎం రేవంత్ భేటి

**హైదరాబాద్(జనంసాక్షి):** సమాఖ్య విధానంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరస్పరం గౌరవించుకున్నప్పుడే.. అభివృద్ధి సాధ్యమని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి ఛైర్మన్ ఎస్. మహేంద్రదేవ్ శనివారం ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణను అభివృద్ధి పథంలో తీసుకెళ్లే అంశాలపై చర్చించారు. హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి సారించినట్లు సీఎం వివరించారు."యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నాం. రాష్ట్రంలో పారిశ్రామిక రంగంతోపాటు సేవల రంగం అభివృద్ధి కోసం ప్రణాళికలు రూపొందిస్తున్నాం. ఉద్యోగులకు సముచితమైన అవకాశాలు కల్పిస్తేనే రాష్టానికి కంపెనీలు వస్తాయి. హైదరాబాద్ చుట్టూ రీజినల్ రింగ్ రోడ్, ఆర్ఆర్ఆర్‌ను ఔటర్‌తో అనుసంధానిస్తూ రేడియల్ రోడ్లు నిర్మిస్తున్నాం" అని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. అధిక వడ్డీలకు తీసుకున్న రుణాలపై సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. అధిక వడ్డీల వల్ల రాష్ట్రాభివృద్ధి కుంటుపడుతోందని.. తిరిగి చెల్లింపులు కష్టమవుతున్నా యన్నారు. వడ్డీలు చెల్లించడానికే రాష్ట్ర ఆదాయం ఖర్చు చేయాల్సి వస్తోందని చెప్పారు.

మిగతా 2లో..

### నేడు ఉజ్జయిని మహంకాళి బోనాలు

ఏర్పాట్లు చేసిన అధికారులు

పట్టువస్త్రాలు సమర్పించనున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

వార్త 12లో



హైదరాబాద్‌లోని నల్సార్ లా యూనివర్సిటీ-లో 22వ స్నాతకోత్సవం సందర్భంగా 'రబ్రీస్ ఆఫ్ కాంట్రాక్ట్' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జస్టిస్ బీఆర్ గవాయ్, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ పీఎస్ నరసింహ, హైకోర్టు సీజే జస్టిస్ సుజయ్‌పాల్ తదితరులు

# దశాబ్దాల కాలంపాటు కేసుల విచారణ దురదృష్టకరం

## ఏఐ వల్ల అనుకూల,ప్రతికూల ఫలితాలు
## న్యాయవాద వృత్తి సవాళ్లతో కూడుకున్నది

- చేసే వృత్తిని, చేసే పనిని ప్రేమించగలగాలి
- కోర్టు తీర్పులపై సమగ్ర అవగాహన కలిగి ఉండాలి
- నల్సార్ వర్సిటీ స్నాతకోత్సవంలో సుప్రీం చీఫ్ జస్టిస్ గవాయ్ వెల్లడి



**హైదరాబాద్(జనంసాక్షి):** న్యాయవాద వృత్తి ఎన్నో సవాళ్లతో కూడుకున్నదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ అన్నారు. వృత్తిని, చేసే పనిని ప్రేమించాలి. అప్పుడే సరైన ఫలితాలు పొందగలుగుతాం. ప్రస్తుతం న్యాయ వ్యవస్థలో ఎన్నో సవాళ్లు ఉన్నాయి. కొన్ని కేసుల విచారణ దశాబ్దాల పాటు సాగటం ఆందోళనకరం అని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని నల్సార్ లా యూనివర్సిటీ-లో 22వ స్నాతకోత్సవం శనివారం ఘనంగా జరిగింది. హైదరాబాద్ న ల్సార్ యూనివర్సిటీ స్నాతకోత్సవ కార్యక్రమా నికి జస్టిస్ బీఆర్ గవాయ్, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ పీఎస్ నరసింహ, హైకోర్టు సీజే జస్టిస్ సుజయ్‌పాల్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జస్టిస్ గవాయ్ మాట్లాడుతూ..న్యాయవాదులు నిరంతరం తమను తాము నిరూపించుకోవాల్సి ఉందన్నారు. కోర్టు తీర్పులకు సంబంధించి సమగ్ర అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రస్తుతం న్యాయవాద విద్యలో ప్రవేశించే వారి సంఖ్య పెరుగుతోంది. ఏఐ, డేటా ప్రైవసీ

మిగతా 2లో..

# ఇంధన స్విచ్‌లు ఆగిపోవడం వల్లే దుర్ఘటన

ప్రమాదం వెనక ఎలాంటి కుట్రకోణం లేదు

పక్షి ఢీకొన్న ఆనవాళ్లు కూడా లేవు

ఎయిరిండియా ప్రమాదంపై ప్రాథమిక నివేదిక

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** అహ్మదాబాద్‌లో ఎయిర్ ఇండియా విమాన ప్రమాదం పై ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో ప్రాథమిక నివేదిక విడుదల చేసింది. మొత్తం 15 పేజీలతో ప్రాథమిక నివేదికలో కీలక విషయాలు వెల్లడించింది. విమానం టేకాఫ్ అయ్యాక ఇంధన కంట్రోలర్ స్విచ్‌లు

మిగతా 9లో..



# ఆర్డినెన్స్‌పై పెదవి విరిచిన విపక్షాలు

తప్పు చేస్తుంటే కూడా ప్రభుత్వానికి సహకరించాలా?: శ్రీనివాస్‌గౌడ్

కాంగ్రెస్ ఎప్పుడూ ఇచ్చిన మాట మీద నిలబడలేదు: పాయల్ శంకర్



**హైదరాబాద్(జనంసాక్షి):** బీసీ రిజర్వేషన్ల ఆర్డినెన్స్ వ్యవహారంలో భారత రాష్ట్ర సమితి నేతలకు అవగాహన లేదంటున్న కాంగ్రెస్ నేతలు.. విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్ల కోసం ఆర్డినెన్సు ఎందుకు ఇవ్వడం లేదని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ప్రశ్నించారు. ఎలాంటి చిక్కులు లేకుండా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని భారత రాష్ట్ర సమితి మొదటినుంచీ డిమాండ్ చేస్తోందన్నారు. ప్రభుత్వ సలహాదారు కేశవరావు ఏం మాట్లాడారో ఎవరికీ అర్థం కాలేదని, కాంగ్రెస్‌లోకి వెళ్లాకే అలా అయ్యారని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ నేతలను ఏమీ అనలేక.. కేశవరావు భారత రాష్ట్ర సమితి నేతలను అంటున్నట్లు ఉందని ఎద్దేవా చేశారు. ప్రభుత్వానికి సహకరించాలని అంటున్నారని.. తప్పు

మిగతా 2లో..

# సహకరిస్తామంటూ సన్నాయి నొక్కులెందుకు?

బీసీ రిజర్వేషన్లు తెచ్చిన ఘనత కాంగ్రెస్‌ది

బీఆర్ఎస్ ఎంత తక్కువగా మాట్లాడితే అంతమంచిది: మంత్రి కోమటిరెడ్డి



**నల్లగొండ(జనంసాక్షి):** బీసీ రిజర్వేషన్లు ఇచ్చిన ఘనత తమదేనని, పేదల సంక్షేమం కోసమే రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. ఇంత కాలం మాటలు చెప్పిన బిఆర్ఎస్ బిసి రిజర్వేషన్లు ఎందుకు తేలేదని అన్నారు. ఈ రిజర్వేషన్లలోనే స్థానిక ఎన్నికలు నిర్వహిస్తు న్నామని అన్నారు. ఇప్పటికైనా బిఆర్ఎస్ వారు మాటలు చెప్పడం మానాలని అన్నారు. నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు, సన్నబియ్యం ఇస్తున్నామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ కు అండగా ఉండాలని కోరారు. నల్లగొండ జిల్లా దండంపల్లి లో రూ. 8 కోట్ల వ్యయంతో ఆటోమేటెడ్ టెస్టింగ్

మిగతా 2లో..

# ప్రాజెక్టులు వేగవంతంగా పూర్తి చేయండి

## త్వరితగతిన భూసేకరణ చేయండి

పునరావాస పనుల్లో వేగం పెంచండి

అధికారులకు మంత్రి ఉత్తమ్ ఆదేశాలు


ప్రాజెక్టుల పురోగతిపై అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి

**హైదరాబాద్(జనంసాక్షి):** రాష్ట్రంలో పెండింగ్ ప్రాజెక్టుల పూర్తికి అవసరమైన భూసేకరణ ను వేగవంతం చేయాలని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు.అదేవిధంగా పునరావాస పనులను త్వరితగతిన పూర్తి చేయలని ఆయన సూచించారు.శనివారం రోజున డాక్టర్ బి. ఆర్.అంబెడ్కర్ సచివాలయంలో ఆయన నీటి పారుదల శాఖాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా మంత్రి ఉత్త మ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ జిల్లా కలెక్ట ర్లతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుని చట్టపరమైన, పాలనా పరమైన అంశాలను తక్షణమే పరిష్కరించే విదంగా నిర్ణయాలు తీసుకోవాలన్నారు.ఇటు భూసేకరణ

మిగతా 2లో..

### సీతారామ ప్రాజెక్టుకు నీటి విడుదల

మోటర్‌కు స్విచ్‌ఆన్ చేసి ప్రారంభించిన మంత్రి ఉత్తమ్

వార్త 2లో






# కవితమ్మా..నీది ఏ పార్టీ?

టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ప్రశ్న

- ఆమె ఇప్పుడు ఏ పార్టీలో ఉన్నారో ఆమెకైనా స్పష్టత ఉందా?
- ఆమె మాటలు విని తెలంగాణ సమాజం నవ్వుకుంటోంది
- బీసీలకు రిజర్వేషన్లు.. కాంగ్రెస్ హయాంలో విప్లవాత్మక నిర్ణయం
- దీన్ని అభినందించేందుకు కూడా కేసీఆర్‌కు మనసు రావడం లేదు
- కడుపునిండా విషం పెట్టుకొని కౌగిలించుకొన్నట్లుగా విపక్షాల ధోరణి
- గతంలో బీఆర్ఎస్ బీజేపీకి అన్ని బిల్లులకు మద్దతిచ్చిందని వెల్లడి

**హైదరాబాద్(జనంసాక్షి):** కుల సర్వే, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు.. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో తీసుకున్న విప్లవాత్మక నిర్ణయాలని తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. కీలకమైన ఈ నిర్ణయాలను అభినందించేందుకు కూడా భారత రాష్ట్ర సమితి అధినేత కేసీఆర్‌కు మనసు రావడం లేదని విమర్శించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా

మిగతా 2లో..

### ప్రజాసేవకంటే ప్రచారానికే ఆరాటం

ప్రభుత్వంపై ఎమ్మెల్సీ కవిత విమర్శలు

2లో

# గోదారికి వరదొచ్చే..


ధవళేశ్వరం వద్ద...

*భద్రాచలం వద్ద గోదావరి ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. శనివారం ఉదయానికి నీటిమట్టం 40.5 అడుగులకు చేరింది. ఎగువ నుంచి వస్తున్న వరదతో పాటు శబరి నది ఉద్ధృతి వల్ల గోదావరిలో నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. రెండు రోజుల క్రితం 23 అడుగులు ఉన్న గోదావరి ప్రవాహం.. శనివారం 40.5 అడుగులకు చేరింది. దీంతో స్నానఘట్టాల ప్రాంతంలోని చాలా మెట్లు- వరదనీటిలో మునిగిపోయాయి. దుమ్ముగూడెం మండలం పర్ణశాల వద్ద వరద ఉద్ధృతి కొనసాగుతోంది. సీత వాగు వద్ద నార చీరల ప్రాంతం, సీతమ్మ వారి విగ్రహం వరద నీటిలో మునిగిపోయింది. గోదావరిలో నీటిమట్టం 43 అడుగులకు చేరితే అధికారులు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేయనున్నారు.*


భద్రాద్రి వద్ద క్రమంగా పెరుగుతున్న నీటిమట్టం

# కాళేశ్వరంను బద్నాం చెయ్యొద్దు

ప్రాజెక్టుపై కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారు :హరీశ్‌రావు



**సిద్దిపేట(జనంసాక్షి):** కేసీఆర్‌కు మంచి పేరు వస్తుందనే కాళేశ్వరం నుంచి నీళ్లు ఆపుతున్నారని భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించారు. కాళేశ్వరం కూలి పోయిందని ఊరికే బద్నాం చేస్తున్నారని మండిపడ్డారు. సిద్దిపే టలో 167 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడారు. "వర్షాలకు గోదావరిలో 8 లక్షల క్యూసెక్కులు వృథాగా పోతున్నాయి. మోటార్లు ఆన్ చేయకుండా రాజకీయాలు చేస్తున్నారు. మోటార్లు ఆన్ చేస్తే వారం రోజుల్లో రంగనాయకసాగర్ నిండిపోతుంది. మేడిగడ్డ కూలితే మోటార్లు, లారీలు ఎలా నడుస్తున్నాయి? రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్‌లు కాళేశ్వరంలో భాగం కావా? ఇవేమీ చూడకుండా కాళేశ్వరం కూలిపోయిందని అసత్య ప్రచారం చేస్తున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై అసెంబ్లీలో చర్చపెడితే.. మీరేం చేశారో.. మేమేం చేశామో మాట్లాడుకుందాం.

మిగతా 2లో..

# మళ్లీ సుంకాల మోత..

ఆగస్టు 1 నుంచి మెక్సికోతోపాటు ఈయూ పై 30% సుంకాలు :ట్రంప్

వీసా వచ్చినా.. నిబంధనలు పాటించకపోతే 'బహిష్కరణముప్పు' తప్పదని హెచ్చరిక

2లో

# కల్తీపై కదిలిన యంత్రాంగం

హైదరాబాద్‌లోని పలు కల్లు కాంపౌండ్లలో అధికారుల ఆకస్మిక తనిఖీలు



2లో

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
13.07.2025

# ఆర్డినెన్స్‌పై పెదవి విరిచిన విపక్షాలు

చేస్తుంటే కూడా సహకరించాలా? అని ప్రశ్నించారు.బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వం హడావుడి చూస్తుంటే బీసీలను మోసం చేస్తున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని భాజపా ఎమ్మెల్యే పాయల్ శంకర్ పేర్కొన్నారు. ఆర్డినెన్సు తీసుకురాకుండానే బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేసినట్లు కాంగ్రెస్ నేతలు మాట్లాడుతున్నారని వ్యాఖ్యానించారు. భాజపా రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు."కాంగ్రెస్ ఎప్పుడూ ఇచ్చిన మాట మీద నిలబడలేదు. బీసీ రిజర్వేషన్లకు మతపరమైన అంశాన్ని జోడించారు. మతపరమైన రిజర్వేషన్లను రాజ్యాంగం, సుప్రీం కోర్టు అంగీకరించవు. శాసనసభ సమావేశాలు ఏర్పాటు చేసి.. బీసీ రిజర్వేషన్ ఏ విధంగా అమలుచేస్తారో చర్చించాలి. ఈ వ్యవహారంలో న్యాయపరమైన ఇబ్బందులు రాకుండా.. బీసీలకు అన్యాయం జరగకుండా.. ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండాలి" అని పాయల్ శంకర్ డిమాండ్ చేశారు.

# సహకరిస్తామంటూ సన్నాయి నొక్కులెందుకు?

స్టేషన్ భవన నిర్మాణానికి మంత్రులు పొన్నం ప్రభాకర్,కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన.. రవాణా శాఖ నుంచి ఏ అవసరమున్న నల్గొండ జిల్లాకు అధిక నిధులు ఇవ్వాలన్నారు..బస్సుల్లో ప్రయాణికుల రద్దీ పెరిగిందన్నారు. ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి 200 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణం చేశారని చెప్పారు. రూ.6 వేల కోట్లు- ఆర్టీసీకి ప్రభుత్వం చెల్లించిందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ లకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయడంలో పొన్నం ప్రభాకర్ కేబినెట్ లో కొట్లాడరని చెప్పారు. బీసీ రిజర్వేషన్ కాంగ్రెస్ చారిత్రాత్మక నిర్ణయమని చెప్పారు.

**చర్చకు రాకుండా సీఎంను ఎందుకు దూషిస్తున్నారు?: ఎంపీ చామల**

మిగులు రాష్ట్రంగా ఉన్న తెలంగాణను అప్పుల రాష్ట్రంగా ఎందుకు మార్చారో భారత రాష్ట్ర సమితి నేతలు చెప్పాలని ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. చర్చకు రాకుండా సీఎం రేవంత్‌రెడ్డిని ఎందుకు దూషిస్తున్నారని ప్రశ్నించారు. అసెంబ్లీలో అర్థవంతమైన చర్చ జరగాలని ప్రజలు ఆశిస్తున్నారని తెలిపారు. నీటిపారుదల శాఖ గురించి తాము మాట్లాడుతుంటే అసత్యాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు

# సీతారామ ప్రాజెక్టుకు నీటి విడుదల

### మోటర్ స్విచ్ ఆన్ చేసి ప్రారంభించిన మంత్రి ఉత్తమ్

**ఖమ్మం(జనంసాక్షి):**గోదావరి జలాలను ఖమ్మం జిల్లాలోని సాగర్ ఆయకట్టుకు తరలించేందుకు శనివారం సీతారామ ప్రాజెక్టులో భాగంగా అశ్వాపురం మండలం కొత్తూరు వద్ద ఏర్పాటు-చేసిన ఎత్తిపోతల నుంచి ఒక మోటారు ఆన్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెంటపడి సాగర్ ఆయకట్టుకు గోదావరి జలాలను తరలించే పనులను పూర్తిచేశారు. ప్రస్తుతం గోదావరికి వరద ఉద్ధృతంగా వస్తోంది. మరో వైపు పాలేరు వద్ద అండర్ టన్నెల్ గత ఏడాది కూలిపోయింది.. దీంతో సాగర్ జలాలు ఖమ్మం జిల్లాలోని పంటపొలాలకు విడుదల చేయలేని పరిస్థితి నెలకొంది. మరో పదిరోజులు వరకు నీరు రాని పరిస్థితి. దీనివల్ల తల్లాడ, కల్లూరు మేజర్ల కింద పొలాలు ఎండిపోతున్నాయి.. దీనిని దృష్టిలో పెట్టుకొని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చొరవతో ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సీతారామ ప్రాజెక్టు కింద కొత్తూరు వద్ద ఏర్పాటు- చేసిన మోటార్లలో ఒక దానిని శనివారం ఆన్ చేశారు. దీనివల్ల గోదావరి జలాలు ఏన్కూరు వద్ద సాగర్ కాలువలో ప్రవేశించి తల్లాడ, కల్లూరు మేజర్ల కింద ఉన్న సుమారు 30వేల ఎకరాల్లో ఉన్న వరిపంటను రక్షించేందుకు అవకాశం ఉంది. సీతారామ ప్రాజెక్టు పూర్తి స్థాయిలో అందుబాటులోకి రాకపోయినప్పటికీ అవకాశం ఉన్న మేరకు మోటార్లు బిగించి ఖమ్మం జిల్లా రైతును ఆదుకోవడంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కృషి అభినందనీయమని రైతులు తెలిపారు.

### దశాబ్దాల కాలంపాటు కేసుల విచారణ

# దురదృష్టకరం



విషయంలో అనుకూల, ప్రతికూల ప్రయోజనాలు ఉన్నాయి. సరైన మార్గదర్శకత్వం ఉంటేనే.. నైపుణ్యం సాధించగలమన్నారు.మెంటార్‌షిప్‌ను ఒక బాధ్యతగా భావించాలన్నారు. జస్టిస్ గవాయ్ తన ప్రసంగంలో యువ న్యాయవాదులకు, న్యాయ రంగ ప్రవేశిస్తున్న విద్యార్థులకు పలు కీలక సూచనలు చేశారు. నేటి ప్రపంచంలో న్యాయవ్యవస్థ ముందున్న సవాళ్లను గుర్తు చేసిన ఆయన, మన దేశం వివిధ లీగల్ ఛాలెంజెస్‌ను ఎదుర్కొంటోంది. ఇలాంటి సమయంలో, న్యాయవాదులు, న్యాయ సేవలో ఉన్న వారు 'ఎవరేం చెబుతున్నారు' అనే విషయాన్ని క్షుణ్ణంగా వినడం చాలా ముఖ్యం అన్నారు. న్యాయవ్యవస్థలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను ఉపయోగించే సమయం ఆసన్నమైంది. సరైన పద్ధతిలో దాన్ని వినియోగించుకుంటే, ఇది తీర్పులను వేగంగా ఇవ్వడంలో దోహదపడుతుందని సీజేఐ పేర్కొన్నారు. విద్యార్థులు, వారి కుటుంబాలు విదేశీ డిగ్రీల కోసం ఆర్థికంగా భారమవ్వకూడదని హెచ్చరించిన ఆయన, మన దేశంలోనే నాణ్యమైన న్యాయ విద్య ఉంది. విదేశీ డిగ్రీల వల్ల మన టాలెంట్ పెరుగుతుందనుకోవడం తప్పు. మన టాలెంట్ మన పనితనంతో నిరూపించుకోవాలి. ఫారిన్ డిగ్రీల కోసమే కుటుంబాలను అప్పుల పాలుచేయడం అవసరం లేదని చెప్పారు. మనం ఏ పని చేస్తున్నా, అది ఎంత మనసు పెట్టి చేస్తున్నాం అనేది ముఖ్యం. న్యాయ రంగంలో విశ్వాసం, నిబద్ధత, , ప్రజల సేవకే ముఖ్య ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన యువ న్యాయవాదులకు సందేశమిచ్చారు. ఈ స్నాతకోత్సవం సందర్భంగా డిగ్రీలు అందుకున్న విద్యార్థులు, వారి కుటుంబాల్లో ఉత్సాహం కనిపించింది. ముఖ్య అతిథుల ప్రసంగాలు యువతలో ఆశాభావాన్ని పెంపొందించాయి. నల్సార్ యూనివర్సిటీ- తన స్థాయిని నిరూపించుకుంటూ న్యాయవిద్యా రంగంలో దేశానికి ప్రతిభావంతులైన న్యాయవాదులను అందించడంలో ముందుండుతుందని చీఫ్ జస్టిస్ సుజయ్ పాల్ పేర్కొన్నారు.

# కవితమ్మ నీది ఏ పార్టీ?

సమావేశంలో మాట్లాడిన మహేశ్ కుమార్ గౌడ్.. విపక్షాల తీరుపై విమర్శలు గుప్పించారు. గతంలో ఎన్నో బిల్లుల విషయంలో భారత రాష్ట్ర సమితి.. భారతీయ జనతా పార్టీకి మద్దతు ఇచ్చింది. బీసీలకు మేలు జరిగే నిర్ణయంపై మాత్రం కేసీఆర్ నోరు విప్పడం లేదు. కడుపునిండా విషం పెట్టుకొని కౌగిలించుకొన్నట్లుగా విపక్షాల ధోరణి ఉంది. పదేళ్లు అధికారంలో ఉన్న భారత రాష్ట్ర సమితి బీసీలకు రిజర్వేషన్ల పెంపు అంశంపై ఏనాడూ దృష్టి పెట్టలేదు. మేం సాధించిన రిజర్వేషన్ల పెంపును.. కవిత తన విజయంగా చెప్పడం హాస్యాస్పదంగా ఉంది. బీసీ రిజర్వేషన్ల పెంపు ప్రక్రియను మేము చేపట్టినప్పుడు కవిత జైలులో ఉన్నారు. తిహాడ్ జైలులో ఉన్న కవిత బీసీ రిజర్వేషన్ల పెంపు కోసం ఎప్పుడు పోరాటం చేశారో చెప్పాలి. ఆమె మాటలు విని తెలంగాణ సమాజం నవ్వుకుంటోంది. కవిత ఇప్పుడు ఏ పార్టీలో ఉన్నారో ఆమెకైనా స్పష్టత ఉందా? అని ఎద్దేవా చేశారు. ఇదిలావుంటే మిగులు రాష్ట్రంగా ఉన్న తెలంగాణను అప్పుల రాష్ట్రంగా ఎందుకు మార్చారో భారత రాష్ట్ర సమితి నేతలు చెప్పాలని ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. చర్చకు రాకుండా సీఎం రేవంత్‌రెడ్డిని ఎందుకు దూషిస్తున్నారని ప్రశ్నించారు. అసెంబ్లీలో అర్థవంతమైన చర్చ జరగాలని ప్రజలు ఆశిస్తున్నారని తెలిపారు. నీటిపారుదల శాఖ గురించి తాము మాట్లాడుతుంటే అసత్యాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ సందర్భంగాఎమ్మెల్సీ కవితపై కూడా తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డ మహేష్ గౌడ్, "బీఆర్ఎస్‌లో దెయ్యాల పీడ ఉందా? లేక దెయ్యాలే పనిచేస్తున్నాయా? కవిత సూటిగా చెప్పాలి. ఆమె ఏ పార్టీకి చెందినవారో ప్రజలకు అర్థం కావడం లేదు. కాంగ్రెస్ ప్రకటించిన రిజర్వేషన్లపై కవిత సంబరాలు చేసుకోవడం హాస్యాస్పదం" అని వ్యాఖ్యానించారు. "రంగులు, వేషాలు మార్చినంత మాత్రాన పిల్లి పులి కావదు. బీఆర్ఎస్‌లో నైతికత ఉండి ఉంటే, కవిత ఇప్పటివరకు రాజీనామా చేసి ఉండాల్సింది. కాంగ్రెస్ పార్టీ బీసీ డిక్లరేషన్ ప్రకటించిన సమయంలో ఆమె లిక్కర్ స్కామ్ ఊసులు లెక్కపెడుతున్నారు" అంటూ ఆమె తీరుపై సెటైర్లు వేసారు. బిఆర్ఎస్ హయంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ అన్ని బిల్లులకు బీఆర్ఎస్ మద్దతు తెలిపిందని కవితకు గుర్తు చేశారు.బీజేపీకి బీసీల పట్ల చిత్తశుద్ధి లేదు. రాష్ట్ర బీజేపీ అధ్యక్ష పదవిని బీసీ నేతకు ఇవ్వకుండా అగ్రవర్ణ వ్యక్తికి కట్టబెట్టినప్పుడే ఆ పార్టీ చిత్త శుద్ధి తేలిపోయింది. బీసీలు ఇప్పుడు వారి వాటా వారు అడిగే స్థాయికి వచ్చారు" అని చెప్పారు.కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాటకు కట్టుబడి ఉన్నదని స్పష్టం చేసిన మహేష్ గౌడ్, "బీసీ రిజర్వేషన్లు సాధ్యం చేసింది కాంగ్రెస్ పార్టీ మాత్రమే. ఈ విజయాన్ని సాధించేందుకు రాహుల్ గాంధీ ఆశయమే ప్రధాన కారణం. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులకు ప్రత్యేక కృతజ్ఞతలు" అని తెలిపారు. "కాంగ్రెస్ పార్టీ మా చాంపియన్, మా హీరో రాహుల్ గాంధీ. మేమంతా రాహుల్ సైనికులం" అంటూ అభిమానం వ్యక్తం చేశారు. ఇక ఎవరు దొంగలు? ఎవరు హీరోలు? అన్నది తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారనీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు అమలుకు తాము ఎంతగా కట్టుబడి ఉన్నామో ప్రతి ఒక్కరికీ తెలుసునన్నారు.

# అధిక వడ్డీలతో అభివృద్ధి కుంటుపడుతోంది

రుణాలపై వడ్డీలు తగ్గించుకునే ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా పాల్గొన్నారు.

# కాళేశ్వరంను బద్నాం చెయ్యొద్దు

కేసీఆర్‌కు మంచి పేరు వస్తుందనే కాళేశ్వరం నుంచి నీళ్లు ఆపుతున్నారు. రెండు పిల్లర్లకు మరమ్మతులు చేస్తే ఆరు నెలల్లో నీళ్లు ఇవ్వొచ్చు. మేం ప్రశ్నించడంతోనే కల్వకుర్తి మోటార్లు ఆన్ చేశారు. నాట్లకు నాట్లకు మధ్య కేసీఆర్ రైతుబంధు ఇచ్చారు. ఓట్లకు ఓట్లకు మధ్య మీరు రైతుభరోసా ఇస్తున్నారు. రైతుభరోసాను ఎలా కోత పెడదామనే చూస్తున్నారు" అని హరీశ్‌రావు ఆరోపించారు.

# ప్రజాసేవకంటే ప్రచారానికే ఆరాటం

### ప్రభుత్వంపై ఎమ్మెల్సీ కవిత విమర్శలు

**రంగారెడ్డి(జనంసాక్షి):**ఈ ప్రభుత్వం ప్రజలకు సేవ చేయడం కంటే ప్రచారానికే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆరోపించారు.ఎన్నికల ముందు అమ్మాయిలకు స్కూటీలు, పెళ్లికి లక్ష రూపాయల నగదు, తులం బంగారం ఇస్తామని చేసిన హామీల్లో ఏ ఒక్కదాన్ని కూడా ఈ ప్రభుత్వం నెరవేర్చలేదని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గ పర్యటనలో పాల్గొన్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, తెలంగాణ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనను టార్గెట్ చేసిన ఆమె, ఈ ప్రభుత్వం ప్రజలకు సేవ చేయడం కంటే ప్రచారానికే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తోందని ఆరోపించారు. రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీకి తరచూ వెళ్లే వ్యక్తిగా, రాష్ట్రానికి తక్కువ సమయాన్ని కేటాయిస్తున్నారని విమర్శించారు. ఇందిరమ్మ ఇళ్ల కమిటీ-లు మొత్తం కాంగ్రెస్ కార్యకర్తలతోనే నిండి ఉన్నాయని ఆరోపించిన కవిత, సీఎం సొంత జిల్లా అయిన మహబూబ్ నగర్‌లో అంబులెన్సులకు డీజిల్ లేక అస్తవ్యస్త పరిస్థితులు నెలకొన్నాయని మండిపడ్డారు.రేషన్ షాపుల్లో పంపిణీ చేస్తున్న సన్న బియ్యంలో 50 శాతం వరకు నాణ్యతలేని దొడ్డుబియ్యమే ఉండటం దారుణమని వ్యాఖ్యానించిన ఆమె, దీనిని ఆధారాలతో నిరూపిస్తామని చెప్పారు. మరోవైపు ఉచిత బస్సు ప్రయాణాల పేరుతో గ్రామాలకు వెళ్లే బస్సులను తక్కువ చేశారని, ఫ్రీ పథకాలు అందిస్తామనే చెప్పి సేవలు కట్ చేసిన దారుణ పాలన ఇది అని విమర్శించారు. ఇప్పటికే ఈ ప్రభుత్వం రెండు లక్షల కోట్ల రూపాయల అప్పు చేసి రాష్ట్రాన్ని ఆర్థిక సంక్షోభంలోకి నెట్టిందని కూడా ఆమె ఆరోపించారు. ఇది పనిచేసే ప్రభుత్వం కాదు... ప్రజలే వెంటే ఉండి పని చేయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని కవిత హేళన చేసింది

# కల్తీపై కదిలిన యంత్రాంగం

**హైదరాబాద్(జనంసాక్షి):**

నగరంలో కల్తీ కల్లు మరణాలతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఎక్సైజ్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు శనివారం కల్లు కాంపౌండ్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మూడు బృందాలతో వేర్వేరు ప్రాంతాల్లో దాడులు నిర్వహించారు. అనుమతి లేకుండా కల్లు దుకాణాలు నిర్వహిస్తున్నట్లు గుర్తించారు.మూసాపేట్, బాలానగర్, కైతలాపూర్ ప్రాంతాల్లోని కల్లు కాంపౌండ్లతోపాటు ముషీరాబాద్‌లో మూడు, కాచిగూడలో రెండు కల్లు డిపోల్లో తనిఖీలు నిర్వహించారు. ఆయా చోట్ల సేకరించిన నమూనాలను ల్యాబ్‌కు పంపించారు. శేరిలింగంపల్లి సిద్ధిక్‌నగర్‌లోని కల్లు కాంపౌండ్‌లో తనిఖీలు చేసిన అధికారులు.. అనుమతి లేకుండా నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. దుకాణాన్ని సీజ్ చేయడంతోపాటు యజమానిపై కేసు నమోదు చేశారు.

# ప్రాజెక్టులు వేగవంతంగా పూర్తి చేయండి

అటు పునరావాస పనులలో జాప్యం లేకుండా సమం వంతంగా పూర్తి చేయాలన్నారు.జిల్లాల వారిగా ప్రాజెక్టుల పురోగతిని సమీక్షించిన ఆయన నిర్మాణంలో ఎదురౌతున్న ఆటంకాలను అధిగమించెందుకు అధికార యంత్రాంగం పని చేయాలన్నారు.భూసేకరణలో జరుగుతున్న జాప్యంతో అంచనాలపై ప్రభావం చూపుతూ రెట్టింపు అబుతుందన్నారు.భూసేకరణలో ఎదురౌతున్న ఆటంకాలను అధిగమించేందుకు భూములు కోల్పయో రైతులతో సహృద్భావ చర్చలు జరపలన్నారు. నష్టపరిహారం, పునరావాసం వంటి అంశాల పై పారదర్శకంగా నిర్వహించాలన్నారు.ఎక్కడ నిర్లక్ష్యం వహించినా ప్రజావ్యతిరేకతతో పాటు న్యాయపరమైన చిక్కులు ఏర్పడతాయని ,అటువంటి సునిశితమైన అంశాల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆయన ఉద్బోధించారు.అదేవిధంగా ప్రాజెక్టుల నిర్మాణాలను ఆయన ప్రస్తావిస్తూ ఏజెన్సీ లతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ పనులను వేగవంతం చేయాలన్నారు.అదే సమయంలో పాలనా పరమైన అంశాలలో ఎటువంటి పోరాబాట్లకు ఆస్కారం లేకుండా చూడాలన్నారు. పనులలో అలసత్వం వహిస్తే అంచనాలు పెరుగుతాయన్నారు.పాలమూరు-రంగారెడ్డి, సీతారామ ప్రాజెక్టుల పూర్తికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. వర్షాకాలంలో సంభవిస్తున్న నీటి ప్రవహాలతో రాష్ట్రం లోని జలాశయాలలో పెరుగుతున్న నీటి మట్టాలపై ఆయన ఆరా తీశారు.ఎప్పటికప్పుడు నీటి మట్టాలను గమనించాలన్నా రు.రాష్ట్రంలోనీ ప్రధాన ప్రాజెక్టుల నిర్మాణాలలో టన్నెల్ నిర్మాణాలు కీలకంగా మరాయని,అటువంటి టన్నెల్ నిర్మాణాలలో అవసరమైన సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించేందుకు గాను తెలంగాణా నీటిపారుదల శాఖలో భారత సైన్యంలో పని చేస్తున్న ఇద్దరు ఇంజినీరింగ్ నిపుణుల ను చేర్చుకోబోతున్నట్లు ఆయన వెల్లడించారు.భారత సేన మాజీ ఇంజినీర్ ఇన్ చీఫ్ జనరల్ హార్పల్ సింగ్ నీటిపారుదల శాఖలో గౌరవ సలహాదారుగా,అంతర్జాతీయ స్థాయిలో టన్నెల్ ఇంజి నీరింగ్ నిపుణుడిగా ప్రసిద్ది చెందిన కల్నల్ పరిక్షిత్ మెహ్రా లు నీటిపారుదల శాఖల్లో చేరుటున్నట్లు ఆయన తెలిపారు.భారతదేశంలో అత్యంత క్లిష్టమైన రోహ్టాంగ్ ,జోజిలా టన్నెల్ నిర్మాణంలో వీరిద్దరూ కీలక పాత్ర పోషించారని,రాజేంద్రనగర్ లోని వాటర్ అండ్ ల్యాండ్ మేనేజ్మెంట్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ను మరింత బలోపేతం చెసే విదంగా ప్రణాళికలు రూపొందించాలని,సాగునీటి నిర్వహణలో శిక్షణతో పాటు పరిశోధన కు కీలక కేంద్రంగా ఉందన్నారు. అటువంటి ఇనిస్టిట్యూట్ కు చెందిన భూమి కబ్జాకు గురైందని తక్షణమే సర్వే జరిపి అక్రమ కబ్జాలను తొలగించాలన్నారు ప్రాజెక్టులను పూర్తి చేయడంతో పాటు ప్రజాధనాన్ని సమర్థవంతంగా సద్వినియోగం చేయడమే ప్రభుత్వ సంకల్పమన్నారు.

# ఉక్రెయిన్‌పై నిప్పుల వర్షం

- **600 డ్రోన్లతో ఆ దేశ రక్షణ వ్యవస్థలను ధ్వంసం**
- **చేసిన రష్యా సేనలు**
- **దెబ్బతిన్న నివాస భవనాలు, విశ్వవిద్యాలయాలు,మౌలిక సదుపాయాలు**
- **రష్యాకు 40శాతం ఆయుధాలు ఉత్తరకొరియా సరఫరా: ఉక్రెయిన్**



**కీవ్(జనంసాక్షి):**ఉక్రెయిన్‌పై రష్యా భారీ స్థాయిలో దాడులు కొనసాగిస్తోంది. తాజాగా కీవ్‌లోని ఆయుధ పరిశ్రమలపై మాస్కో 600 డ్రోన్లు, క్షిపణులతో వైమానిక దాడులకు పాల్పడింది.ఉక్రెయిన్‌కు చెందిన ఆర్మీ రిక్రూట్‌మెంట్ కేంద్రాలు, సైనిక వైమానిక స్థావరాలపైనా దాడులు నిర్వహించినట్లు రష్యా రక్షణశాఖ వెల్లడించింది. ఈ దాడుల్లో పలువురు ప్రాణాలు కోల్పోగా.. నివాస భవనాలు, మౌలిక సదుపాయాలు, విశ్వవిద్యాలయాలు దెబ్బతిన్నాయి. పదుల సంఖ్యలో ప్రజలు గాయాలపాలయ్యారు.రష్యా ప్రయోగించిన 319 డ్రోన్‌లు, 25 క్రూజ్ క్షిపణులను నేలకూల్చినట్లు ఉక్రెయిన్ ఎయిర్ డిఫెన్స్ ఫోర్స్ వెల్లడించింది. కీవ్ చేపట్టిన ఎదురు దాడుల్లో మాస్కోలోని పలు భవనాలు ధ్వంసమయ్యాయి. తమతో జరుగుతున్న యుద్ధంలో రష్యా వాడుతున్న 40 శాతం బాలిస్టిక్ క్షిపణులు, ఫిరంగి వ్యవస్థలు ఉత్తరకొరియా నుంచే రష్యాకు అందుతున్నాయని ఉక్రెయిన్ ఆరోపించిన కొన్ని గంటల్లోనే పుతిన్ సేనలు ఈ దాడులకు పాల్పడడం గమనార్హం. పుతిన్ సేనలు కొనసాగిస్తున్న యుద్ధానికి గట్టిగా బదులు చెప్తామని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ శుక్రవారం పేర్కొన్నారు. యుద్ధం విషయంలో త్వరగా ఓ నిర్ణయానికి రావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నేపథ్యంలో ఉక్రెయిన్‌కు తాత్కాలికంగా నిలిపివేసిన కొన్ని ఆయుధాల సరఫరాను తిరిగి ప్రారంభించినట్లు అమెరికా అధికారులు తెలిపారు. ఇందులో 155 ఎంఎం మందుగుండు సామాగ్రితో పాటు జీఎంఎల్‌ఆర్ఎస్‌గా పిలిచే ప్రెసిషన్ గైడెడ్ రాకెట్లు ఉన్నట్లు పేర్కొన్నారు.

రష్యాకు 40శాతం ఆయుధాలు ఉత్తరకొరియా సరఫరా:

ఉక్రెయిన్ ఉక్రెయిన్‌పై జరుగుతున్న యుద్ధం నేపథ్యంలో రష్యాకు ఉత్తరకొరియా మద్దతుగా ఉన్న సంగతి తెలిసిందే. ఈక్రమంలో కీలక విషయం వెలుగులోకి వచ్చింది.తమతో జరుగుతున్న యుద్ధంలో వాడే 40 శాతం ఆయుధాలు ఉత్తరకొరియా నుంచే రష్యాకు అందుతున్నాయని ఉక్రెయిన్ ఆరోపించింది. ఉక్రెయిన్ మిలిటరీ ఇంటెలిజెన్స్ అధ్యక్షుడు కైరులా బుడనోవ్ ఈవిషయాన్ని బయటపెట్టారు. గతేడాది రష్యా అధ్యక్షుడు పుతిన్ ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్‌ల మధ్య మిలిటరీ ఒప్పందం జరిగిన సంగతి తెలిసిందే. ఈ ఒప్పందంలో భాగంగా ఉ.కొరియా అనేక బాలిస్టిక్ క్షిపణులు, ఫిరంగి వ్యవస్థలను మాస్కోకు చేరవేస్తున్నట్లు తెలిపారు. దీనికి బదులుగా రష్యా నుంచి పెద్దమొత్తంలో నగదు, టెక్నాలజీని ఉత్తరకొరియా పొందుతున్నట్లు వెల్లడించారు. ఈసందర్భంగా కాల్పుల విరమణ ఒప్పందం వీలైనంత త్వరగా జరగాలని బుడనోవ్ ఆశాభావం వ్యక్తంచేశారు.యుద్ధంలో రష్యాకు బేషరతుగా మద్దతిస్తున్నట్లు కిమ్ ఇప్పటికే ప్రకటించారు. మిలిటరీ ఒప్పందం నేపథ్యంలో ఇరుదేశాల మధ్య సైనిక సంబంధాలు తీవ్రంగా బలపడ్డాయి. ఈ క్రమంలో మరో 30 వేల మంది సైనికులను ు.యుద్ధంలో రష్యాకు బేషరతుగా మద్దతిస్తున్నట్లు కిమ్ ఇప్పటికే ప్రకటించారు. మిలిటరీ ఒప్పందం నేపథ్యంలో ఇరుదేశాల మధ్య సైనిక సంబంధాలు తీవ్రంగా బలపడ్డాయి. ఈ క్రమంలో మరో 30 వేల మంది సైనికులనుమాస్కోకు మద్దతుగా పంపేందుకు కిమ్ సిద్ధమైనట్లు ఇటీవల వార్తలు కూడా వచ్చాయి. గతేడాది కుర్స్క్ ప్రాంతంలోకి ఉక్రెయిన్ సేనలు చొచ్చుకురావడంతో.. నవంబర్‌లో దాదాపు 11,000 మంది సైనికులను కిమ్ ప్రభుత్వం పంపించింది. ఇదిలాఉండగా.. రష్యా- ఉక్రెయిన్‌ల మధ్య కాల్పుల విరమణ చేసేందుకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రయత్నిస్తున్నారు. పలుమార్లు పుతిన్‌తోనూ ఫోన్లో మాట్లాడారు. అయినప్పటికీ ఈ చర్చలు ముందుకు సాగకపోవడంపై ఆయన అసంతృప్తికి గురయ్యారు. కాగా.. అమెరికా సైనిక ఆయుధ నిల్వలు తగ్గాయనే ఆందోళనల నేపథ్యంలో గతంలో ఆమోదించిన కీలక ఆయుధాల సరఫరాను అమెరికా ఉక్రెయిన్‌కు నిలిపివేసినట్లు గతంలో ట్రంప్ పేర్కొన్నారు. ఆ నిర్ణయంపై యూటర్న్ తీసుకున్న ట్రంప్ పుతిన్ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నందున కీవ్‌కు ఆయుధాలు ఇవ్వాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు.

# మళ్లీ సుంకాల మోత

### వీసా వచ్చినా.. నిబంధనలు పాటించకపోతే 'బహిష్కరణముప్పు' తప్పదు

### వలసదారులకు అమెరికా వార్నింగ్

వాషింగ్టన్(జనంసాక్షి):అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ బాధ్యతలు చేపట్టిన నాటినుంచి వలసదారులపై కఠిన వైఖరి అనుసరిస్తున్నారు. ఇప్పటికే వీసాల జారీకి 'సోషల్ మీడియా వెట్టింగ్'ను తప్పనిసరి చేసిన సంగతి తెలిసిందే. అయితే, వీసా పొందిన తర్వాత కూడా నిబంధనలు పాటించకపోతే 'బహిష్కరణ ముప్పు' తప్పదని అగ్రరాజ్యం తాజాగా హెచ్చరించింది. ఈ మేరకు భారత్‌లోని యూఎస్ రాయబార కార్యాలయం 'ఎక్స్' వేదికగా పోస్ట్ చేసింది.''వీసా మంజూరుతోనే వలసదారులపై స్క్రీనింగ్ ఆగిపోదు. వారి ప్రతి కదలికను నిశితంగా గమనిస్తూనే ఉంటాం. అమెరికా చట్టాలు, ఇమిగ్రేషన్ నిబంధనలను వీసాదారులు తప్పనిసరిగా పాటించాల్సిందే. వాటిని అతిక్రమిస్తే మాత్రం తక్షణం వీసాలను రద్దు చేసి దేశం నుంచి వెళ్లగొడతాం" అని ఎంబసీ తమ పోస్ట్‌లో స్పష్టంచేసింది. వీసా దరఖాస్తుదారులు తప్పనిసరిగా తమ ఐదేళ్ల సోషల్ మీడియా ఖాతాలను సమర్పించాల్సి ఉంటుందని ఇటీవల అమెరికా వెల్లడించిన సంగతి తెలిసిందే. ఫేస్‌బుక్, లింక్డిన్, ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలనూ, అందులో అభ్యర్థులు చేసిన పోస్టులు, కామెంట్లు, వెల్లడించిన అభిప్రాయాలనూ అగ్రరాజ్య అధికారులు పరిశీలిస్తారు. అలా అని వాటిలో ఉన్న పోస్టులు ఏవీ ఇప్పుడు డిలీట్ చేయడానికి వీల్లేదు. ఒకవేళ అలా చేసినట్టు కనిపిస్తే పరిశీలన మరింత లోతుగా వెళ్లి తనిఖీ చేసే అవకాశం ఉంటుంది. ఈ వివరాలను ఇవ్వకపోతే వీసా తిరస్కరిస్తారు. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకమైన ఆలోచనలు ఉన్నట్టు కనిపించిన వ్యక్తులను దేశంలోకి రాకుండా చూడటం కోసం ఈ 'సోషల్ మీడియా వెట్టింగ్'ను అగ్రరాజ్యం



తీసుకొచ్చినట్లు తెలుస్తోంది.

**- ఆగస్టు 1 నుంచి మెక్సికోతోపాటు ఈయూ నుంచి 30% సుంకాలు :ట్రంప్**

వాషింగ్టన్(జనంసాక్షి):అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పలు దేశాలపై మళ్లీ సుంకాల మోత మోగించారు. మెక్సికోతోపాటు ఈయూ నుంచి దిగుమతి అయ్యే వస్తువులపై 30 శాతం సుంకాలు విధించిన ఆయన.. ఆగస్టు 1 నుంచి ఇవి అమల్లోకి వస్తాయని ప్రకటించారు. ఇదే విషయాన్ని తెలియజేస్తూ ఈయూ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాండెర్ లెయెన్, మెక్సికో అధ్యక్షురాలు క్లాడియా షీన్‌బామ్‌లకు లేఖలు రాశారు.







# ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ

### కేంద్ర ఎన్నికల కమిషన్ పరిశీలన

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణపై కేంద్ర ఎన్నికల కమిషన్ కీలక నిర్ణయం తీసుకోనున్నట్లు- తెలుస్తోంది. త్వరలోనే దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ చేపట్టనున్నట్లు- కేంద్ర ఎన్నికల కమిషన్ అధికారులు తెలిపారు. ఆగస్టులో ఓటర్ల జాబితా సవరణని ప్రారంభించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం సన్నాహాలు చేస్తోంది. బీహార్ ఎన్నికల నేపథ్యంలో చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణపై ఇప్పటికే పెద్ద ఎత్తున విమర్శలు, ఆరోపణలు వస్తున్నాయి. ప్రత్యేక సవరణకు గ్రీన్‌సిగ్నల్ ఇస్తూనే ఈసీకి సుప్రీంకోర్టు కొన్ని సూచనలు చేసింది. బీహార్ తర్వాత అసెంబ్లీ ఎన్నికలు జరిగే పశ్చిమబెంగాల్, తమిళనాడు తదితర రాష్ట్రాల్లోనూ ఇదే ప్రక్రియను చేపట్టనుందని ప్రచారం జరుగుతోంది. ఎన్నికలు జరిగే రాష్ట్రాల్లే కాకుండా దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణకు సిద్ధమవుతున్నట్లు- కేంద్ర ఎన్నికల కమిషన్ అధికారులు వెల్లడించారు. ఇందుకు సంబంధించి ఆయా రాష్ట్రాల ఎన్నికల సంఘం అధికారులకు ఇప్పటికే సమాచారం ఇచ్చినట్లు- ఈసీ అధికారులు తెలిపారు. పూర్తిస్థాయి షెడ్యూల్‌ని త్వరలోనే కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించే అవకాశాలు ఉన్నాయి.

# బిఫోర్ ఆఫ్టర్‌లా నగరంలోని నాలాలు

## హైదరాబాద్‌లో పెద్దఎత్తున పూడిక తీత పనులు

## హైడ్రా రంగంలోకి దిగడంతో మారిన పరిస్థితి



**హైదరాబాద్, జూలై 12 (జనంసాక్షి) :** నగరంలో నాలాల పరిస్థితి బిఫోర్ – ఆఫ్టర్ లా మారింది. హైడ్రా రంగంలోకి దిగడంతో నాలాల్లో, కల్వర్టుల వద్ద పూడికతీత పనులు పెద్దఎత్తున జరుగుతున్నాయి. హైడ్రా మాన్సూన్ ఎమర్జెన్సీ టీంలు, డీఆర్ఎఫ్ బృందాలు సంయుక్త ఆధ్వర్యంలో కల్వర్టులు క్లియర్ అవుతున్నాయి. ప్లాస్టిక్ వ్యర్థాలు, థర్మోకోల్, చెత్త, పిచ్చి మొక్కలను తొలగించడంతో పూడుకు పోయిన నాలాలు, కల్వర్టులు తెరుచుకున్నాయి. లారీలకొద్దీ చెత్తను తొలగించడంతో వరద సాఫీగా వెళ్లేందుకు మార్గం సుగమం అయ్యింది. తొలగించిన చెత్తను వెంటనే ఆ పరిసరాల్లోంచి తరలించడంతో నివాసితులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జూలై 1 వ తేదీ నుంచి మొదలయిన పనులు.

ఈ నెల 1వ తేదీ నుంచి హైడ్రా మాన్సూన్ ఎమర్జెన్సీ టీంలు, హైడ్రా డీఆర్ఎఫ్ బృందాలు సంయుక్తాధ్వర్యంలో ఆపరేషన్ నాలా, కల్వర్టుల క్లీనింగ్ పనులు మొదలయ్యాయి. జిహెచ్ఎంసీ పరిధిలో మొత్తం నాళాలను, కల్వర్టులను, ముంపు ముప్పు ఉన్న ప్రాంతాలను ఈ బృందాలు జల్లెడ పట్టాయి. జీహెచ్ఎంసీ, జలమండలి సహకారంతో నాలాలు, కల్వర్టుల క్లీనింగ్ పనులను ముమ్మరం చేశాయి. వర్షం పడినప్పుడు వరద నీరు నిలబడకుండా, రోడ్లపై ట్రాఫిక్ జామ్ ఏర్పడకుండా పర్యవేక్షించే బృందాలు... వర్షం లేని ఖాళీ సమయాన్ని నాళాలు, కల్వర్టులు, మ్యాన్ హోల్స్ క్లియర్ చేసే పనుల్లో నిమగ్నమయ్యాయి. హైడ్రా డీఆర్ఎఫ్ అధికారులు క్షేత్రస్థాయిలో సర్కిళ్లవారీ ఈ బాధ్యతలను పర్యవేక్షిస్తున్నారు. దీంతో నాలాలు, కల్వర్టులు రూపు రేఖలు మారాయి. పిచ్చి మొక్కలతో, పేరుకుపోయిన చెత్తతో ఉన్న మ్యాన్ హెూల్స్, కల్వర్టులు యిప్పుడు ఊపిరి పీల్చుకుంటున్నాయి. మురుగు, వరద నీరు ముందుకు కదలకుండా ఉక్కిరిబిక్కిరి అయిన నాళాలు, కల్వర్టులు హమ్మయ్య అని సేదదీరుతున్నాయి. కాలువ పరిసరాల్లో నివాసముంటున్న ప్రజలు కూడా ఊపిరి పీల్చుకుంటున్నారు. కాలువల్లో నీరు సాఫీగా సాగిపోవడాన్ని చూసి హమ్మయ్య అనుకుంటున్నారు.

**నాలాల్లో ఆక్రమణలను తొలగించిన హైడ్రా**

నాలాల్లో చెత్తనే కాదు ఆక్రమణలను కూడా హైడ్రా తొలగించుతోంది. ఖైరతాబాద్ శ్రీధర్ ఫంక్షన్ హాల్ వద్ద బుల్కాపూర్ నాలా ఆక్రమణలను తొలగించింది. కూకట్పల్లి ఐడీఎల్ చెరువు నాలా ఆక్రమణలను కూడా తొలగించింది. ఖైరతాబాద్ చౌరస్తా వద్ద నాలా కల్వర్టులో పెద్దఎత్తున పేరుకుపోయిన వ్యర్థాలను హైడ్రా యుద్ధప్రాతిపదికన తొలగించింది. లాంగ్ ఆర్మ్ జేసీబీతో చెత్తతో పాటు థర్మోకోల్, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి లారీలకు నింపి తరలించింది. యిప్పుడు అక్కడ వరద సాఫీగా సాగడాన్ని చూసి స్థానికులు.. యిది కదా హైడ్రా అంటే అని కొనియాడుతున్నారు.

# అమెరికా ఒత్తిడికి లొంగితే తెలంగాణకు తీవ్ర అన్యాయం

- కేంద్ర ప్రభుత్వ తీరుపైన రేవంత్ రెడ్డి ముందుకు రావాలి
- సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు బివి రాఘవులు, ఏ విజయ రాఘవన్
- స్థానిక సంస్థల ఎన్నికల్లో బరిలో ఉంటాం : జాన్‌వెస్లీ




**హైదరాబాద్, జూలై 12 (జనంసాక్షి) :** అమెరికా ఒత్తిడికి మోడీ ప్రభుత్వం లొంగితే తెలంగాణకు తీవ్ర అన్యాయం జరుగుతుందని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యులు రాఘవులు హెచ్చరించారు. దక్షిణ తెలంగాణలో సోయా పంట కీలకంగా ఉందని, అమెరికా సుంకాలకు మోదీ ప్రభుత్వం లొంగిపోతే పంటలు, పాల ఉత్పత్తులకు నష్టం వాటిల్లుతుందని తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో కార్ల వ్యాపారం, ఫార్మా ఇండస్ట్రీ నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. శనివారం హైదరాబాద్‌లోని సీపీఎం రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు బివి రాఘవులు, ఏ విజయ రాఘవన్, రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం, టి జ్యోతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాఘవులు మాట్లాడుతూ.. అమెరికా సుంకాలకు మోడీ ప్రభుత్వం లొంగిపోయే ఆలోచనలో ఉన్నారు. కేంద్ర ప్రభుత్వ తీరుపైన రేవంత్ రెడ్డి ముందుకు రావాలని కోరారు. రాష్ట్ర సమస్యలపై డిల్లీకి వెళ్లి ప్రభుత్వ పెద్దలను కలుస్తున్న రేవంత్ రెడ్డి ఈ అంశాలను లేవనెత్తాలన్నారు. పని గంటలను పెంచే విధంగా బీజేపీ ప్ర జిత్వం ప్రయత్నం చేస్తోందని, తెలంగాణలో 8 గంటల పని దినాలను 10 గంటలకు పెంచుతూ రేవంత్ సర్కార్ 282 జీవో తీసుకు రావడం దురదృష్టకరం అన్నారు. అమెరికాను పొగడటమే కాదు దాని వల్ల జరుగుతున్న నష్టాన్ని ముఖ్యమంత్రి గ్రహించగలగాలన్నారు. విజయ రాఘవన్ మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఉపాధి అవకాశాల కల్పనలో విఫలం అయ్యింది. మోడీ పాలనలో సామాన్యుల జీవన ప్రమాణాలు దిగజారాయి. కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు, అసంఘటిత కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. బీజేపీ విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 9న దేశ వ్యాప్త సమ్మెకు కార్మికులు, రైతులు, కూలీల నుంచి మంచి స్పందన వచ్చిందన్నారు. అమెరికా విధిస్తున్న టారిఫ్‌లపై భారత ప్రభుత్వం స్పష్టమైన విధానాన్ని ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్ అనుకూల, ప్రజా వ్యతిరేక విధానాలపై ఐక్య ఉద్యమాలు నిర్మించాలని, సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో స్వతంత్రంగా ఉద్యమాలు నిర్వహిస్తామన్నారు. రాష్ట్రంలోనూ ప్రజా వ్యతిరేక విధానాలపై రాష్ట్ర కమిటీ చర్చించి కార్యాచరణ రూపొందిస్తుందన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ మాట్లాడుతూ.. కల్తీ కల్లు ఘటనపై ముఖ్యమంత్రి స్పందించాలన్నారు. బసవతారకం నగర్‌లో పేదల ఇండ్లను కూల్చడం దుర్మార్గమని, 40 ఏండ్ల నుంచి ప్రజలు అక్కడ నివాసం ఉంటున్నారని తెలిపారు. అధికారంలోకి రాకముందు బసవతారక్ నగర్ లో ఇండ్లు నిర్మిస్తామని చెప్పిన రేవంత్ రెడ్డి, ఇప్పుడు ఇండ్లు కూల్చడం ఏంటి..? అని ప్రశ్నించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బరిలో ఉంటామని, బలం ఉన్నచోట ఒంటరిగానే పోటీ చేస్తామని జాన్‌వెస్లీ వెల్లడించారు.

# వాణిజ్య పంటలతో లాభాలు గడించాలి : మంత్రి తుమ్మల



**ఖమ్మం,జులై 12 (జనంసాక్షి) :** ఆదాయం వచ్చే పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. ప్రధానంగా వాణిజ్య పంటలతో లాభాలు గడించాలని అన్నారు. ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం అంజనాపురంలో నిర్వహించిన 'మెగా ఆయిల్ పామ్ ప్లాంటేషన్ డ్రైవ్' ప్రారంభోత్సవంలో మంత్రి పాల్గొని ప్రసంగించారు. ఆయిల్ పామ్ సాగు విషయంలో రైతులకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందజేయాలని అధికారులను ఆదేశించారు. నవంబర్ నాటికి పామాయిల్ ఫ్యాక్టరీని ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రారంభించాలని, ఆ దిశగా పనులు పూర్తి చేయాలన్నారు. రిఫైనరీ పనులు కూడా స్థానికంగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. పామాయిల్ సీడ్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు ప్రభుత్వం నుంచి అవసరమైన సహకారాలు అందిస్తామని మంత్రి తుమ్మల చెప్పారు. భూసేకరణ ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్‌ను ఆదేశించారు. వన మహోత్సవంలో భాగంగా వక్క మొక్కలు నాటామని తెలిపారు. మే నెలలో కురిసిన వర్షాలతో పంటసాగు ప్రారంభించిన రైతులకు ఇబ్బంది కలగకుండా సీతారామ ఎత్తిపోతల పథకం నుంచి జలాలను నాగార్జున సాగర్ ఆయకట్టు–కు నేడు విడుదల చేశామన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# జులై 15న టీసీఈఐ ఎక్సలెన్స్ అవార్డ్స్ గ్రాండ్ ఫినాలే

**శేరిలింగంపల్లి, జులై 12 (జనంసాక్షి) :** తెలంగాణ చాంబర్ ఆఫ్ ఈవెంట్స్ ఇండస్ట్రీ (టీసీఈఐ) ఆధ్వర్యంలో టీసీఈఐ ఈవెంట్ ఎక్సలెన్స్ అవార్డ్స్ 2025 గ్రాండ్ ఫినాలేను ఈ నెల 15న గండిపేటలోని సవాయ కన్వెన్షన్‌లో నిర్వహించనున్నారు. ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమం పరిశ్రమలో ఉన్న అసాధారణ ప్రతిభ, వినూత్న, అంకితభావాన్ని గుర్తించే వేడుకగా అవార్డుల ప్రదానోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో కార్యక్రమ పోస్టర్‌ను మాదాపూర్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో హైటెక్స్ బిజినెస్ హెడ్ శ్రీకాంత్, టీసీఈఐ అధ్యక్షుడు బాలరాం బాబు, జనరల్ సెక్రటరీ రవి బూరా, ట్రెజరర్ తౌఫిక్ ముహమ్మద్ ఖాన్, కన్వీనర్లు, కో–కన్వీనర్ల తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టీసీఈఐ అధ్యక్షుడు బాలరాం బాబు, టీసీఈఐ ఈవెంట్ ఎక్సలెన్స్ అవార్డ్స్ 2025 కన్వీనర్ రమేశ్ కే ముప్పన కార్యక్రమానికి సంబంధించిన వివరాలను వెల్లడించారు.



# నేడు మంచిర్యాలలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించనున్న ఉప ముఖ్యమంత్రి

## ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు

**మంచిర్యాల ప్రతినిధి జూలై 12 (జనంసాక్షి) :** మంచిర్యాల నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించడంలో భాగంగా ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ, శాస్త్ర సాంకేతిక శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ రాష్ట్ర ఆబ్కారీ–మద్యనిషేధ, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి–జిల్లా ఇన్చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు జిల్లాలో పర్యటిస్తున్న నేపథ్యంలో మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు, జిల్లా అధికారులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేట మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభిస్తారని, మధ్యాహ్నం 12 గంటలకు అధికారులు, అనధికారులతో సమావేశమై 12.10 గంటలకు ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడి వారితో కలిసి భోజనం చేస్తారని తెలిపారు. మధ్యాహ్నం 3.15 గంటలకు హాజీపూర్ మండలం గుడిపేటలోని ప్రభుత్వ వైద్య కళాశాలను సందర్శిస్తారని తెలిపారు. సాయంత్రం 4 గంటలకు హాజీపూర్ మండలం వేంపల్లిలో ఇండస్ట్రియల్ పార్క్ శంఖుస్థాపన చేసి ప్రజలతో మాట్లాడతారని తెలిపారు. 4.15 గంటలకు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి, ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, మాత శిశు కేంద్రాన్ని సందర్శిస్తారని తెలిపారు. డిప్యూటీ సీఎం మంత్రుల పర్యటన కార్యక్రమాన్ని మంచిర్యాల నియోజకవర్గ కాంగ్రెస్ కార్యకర్తలు నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ప్రేమసాగర్ రావు కోరారు.

# మసీదుబండ కుడికుంట చెరువును ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతా

## రాష్ట్ర ప్రజాపద్దుల కమిటీ చైర్మన్ అరికెపూడి గాంధీ




**శేరిలింగంపల్లి, జులై 12 (జనంసాక్షి) :** శేరిలింగంపల్లి డివిజన్ మసీదుబండ పరిధి కుడికుంట చెరువు సుందరీకరణను సమగ్రంగా చేపట్టి ఆదర్శవంతమైన చెరువుగా తీర్చిదిద్దుతానని రాష్ట్ర ప్రజాపద్దుల కమిటీ చైర్మన్ అరికెపూడి గాంధీ పేర్కొన్నారు. ఈ మేరకు చెరువు పరిరక్షణకై సహే ఎన్జీవో సంస్థ ప్రతినిధి కల్పన రమేష్ ఆధ్వర్యంలో ఇన్ఫోసిస్ ఐటీ సంస్థ సహకారంతో చేపడుతున్న చెరువు సుందరీకన్నా అభివృద్ధి పనులలో భాగంగా శనివారం చెరువు కట్టపై పిఎసి చైర్మన్ అరికపూడి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని మొత్తం 64 చెరువులను పూర్తిస్థాయిలో అభివృద్ధి పరిచి నియోజకవర్గ ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి అవిశ్రాంత కృషిని సలుపుతానని వివరించారు. సహే ఎన్జీవో సంస్థ భూగర్భ జలాల ప్రాధాన్యతను గుర్తించి వాటికి ప్రధాన వనరులుగా భావించే చెరువులలో మంచినీటిని నిల్వ ఉంచడానికి వాటి అభివృద్ధి,పరిరక్షణ బాధ్యతను తీసుకొని కుడికుంట చెరువు సుందరీ కర్ణకై ముందుకు రావడం హర్షనీయమన్నారు. శేరిలింగంపల్లి నియోజక వర్గం పరిధిలో భూగర్భ జలాల సమృద్ధికి దోహదపడే 64 చెరువుల పరిరక్షణకు తాను కృతనిశ్చయంతో ఉన్నానని, అన్ని రంగాలలో సర్వాంగ సుందరంగా ముస్తాబవుతున్న కుడికుంట చెరువును శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోనే ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని అరికెపూడి గాంధీ స్పష్టం చేశారు. సామాజిక సేవలో కార్పొరేట్ సంస్థలు, స్వచ్ఛంద సంఘాలు ముందుకు వస్తే శేరిలింగంపల్లిని మరింతగా ప్రగతి పథంవైపు మళ్ళిస్తానని అరికపూడి ధీమాను వ్యక్తం చేశారు. చెరువు సుందరీ కరణ క్రమంలో చెరువు కట్టలు మరింత దృఢంగా నిర్మించడానికి నీటిపారుదల శాఖ అధికారులు పకడ్బందీ వ్యూహంతో వ్యవహరించాలని, కుడికుంట చెరువులోకి మురుగునీటిని రాకుండా నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. చెరువు చుట్టూ భూగర్భ డ్రైనేజీ మురుగునీటి కాలువను నిర్మించాల్సిన అవసరం ఉందని, ఓవైపు మురుగునీరు, అనారోగ్య సమస్య సమసిపోయి ఆహ్లాదకరమైన చెరువుతోపాటు మార్నింగ్ వాక్ ట్రాక్, ఇతర ఆరోగ్య ప్రదాత కార్యక్రమాలు అందుబాటులోకి వస్తాయని అరికెపూడి భరోసాను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు, కాలనీవాసులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# యుద్ధం ఎవరి కోసం..?

## వరంగల్‌లో నేడు రాష్ట్ర సదస్సు

**హైదరాబాద్ (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర ప్రజాస్వామిక వేదిక (టీఎస్‌డీఎఫ్) ఆధ్వర్యంలో యుద్ధం ఎవరి కోసం అనే అంశంపై వరంగల్‌లో నేడు రాష్ట్ర సదస్సు జరగనున్నట్టు టీఎస్‌డీఎఫ్ తెలంగాణ రాష్ట్ర సమన్వయ కమిటీ తెలిపింది. మధ్యాహ్నం 12 నుంచి అబ్బాస్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్నట్టు ఈ సదస్సులో జస్టిస్ చంద్రకుమార్, సీపీఐ టి శ్రీనివాసరావు, కృష్ణప్రసాద్, జెవి చలపతిరావుతో పాటు పలు వామపక్ష పార్టీల నేతలు, ప్రజాసంఘాల నేతలు హాజరుకానున్నట్టు తెలిపింది.

# హైదరాబాద్ యూత్ డిక్లరేషన్ అమలు ప్రకటన చేయాలి

## లేదంటే 14న సూర్యాపేట జిల్లాలో జరిగే సభ అడ్డుకుంటాం

### తెలంగాణ యువజన సంఘము రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనంతుల మధు



**హైదరాబాద్ (జనంసాక్షి) :** సూర్యాపేట జిల్లా కేంద్రంలో తెలంగాణ తల్లి విగ్రహం వద్ద తెలంగాణ యువజన సంఘం ఆధ్వర్యంలో గత ఎన్నికల సందర్భంగా విద్యార్థి నిరుద్యోగ యువతకు హైదరాబాద్ యూత్ డిక్లరేషన్ పేరుతో ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చి సుమారు రెండు సంవత్సరాలు అవుతున్న అమలు చేయడం లేదంటూ తెలంగాణ యువజన సంఘము రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనంతుల మధు ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్ యూత్ డిక్లరేషన్ వెంటనే అమలు చేయాలని లేని యెడల ఈనెల 14న సూర్యాపేట జిల్లా తిర్మలగిరిలో జరిగే సీఎం రేవంత్ రెడ్డి సభను అడ్డుకుంటామని, విద్యార్థి, నిరుద్యోగ యువత తో కలిసి నల్ల జెండాలు ఎగురు వేసి నిరసన కార్యక్రమం చేపడుతమని అన్నారు. విద్యార్థి, నిరుద్యోగ యువత గొంతెమ్మ కోర్కెలు కోరడం లేదని, గత ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను, మ్యాని ఫెస్టో మాత్రమే అమలు చేయాలనీ డిమాండ్ చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు భాషిపంగు సునీల్, ఏనిగా సంతోష్ రెడ్డి, పంతం యాకయ్య తెలంగాణ యువజన సంఘము జిల్లా అధ్యక్షులు పోరెళ్ల విప్లవ్ కుమార్, జిల్లా నాయకులు దారావత్ శివ నాయక్, చెరుకు నగేష్ తదితరులు పాల్గొన్నారు.

# మెనూ ప్రకారం భోజనం వడ్డించడం లేదని విద్యార్థులు గేటు ముందు కూర్చుని నిరసన



**మర్పల్లి, జూలై 12 (జనంసాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వం వసతి గృహాలలో ఉంటూ చదువుకుంటున్న విద్యార్థుల కోసం ప్రత్యేక శ్రద్ధ చూపుతుంది. వారికి భోజన విషయంలో ఎలాంటి రాజీ పడకుండా సన్నబియ్యంతో కూడిన అన్నం, కూరగాయలు, మంచి పోషకమైన ఆహారాలను అందిస్తుంది. కానీ కొన్ని వసతి గృహాలలో మాత్రం మెనూ ప్రకారం భోజనం వడ్డించడం లేదు. అక్కడి సిబ్బంది ఇష్టం వచ్చినట్లు వడ్డించడం జరుగుతుంది. అలాంటి సంఘటన శనివారం వికారాబాద్ జిల్లా మర్పల్లి మండల కేంద్రంలో కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం నందు జరిగింది. మెనూ ప్రకారం భోజనం వడ్డించడం లేదని విద్యార్థులు గేటు ముందు కూర్చుని ధర్నా చేశారు. అన్నంలో పురుగులు వస్తున్నాయని వారు తెలిపారు. ఉదయం టిఫిన్ సమయంలో ఒకే రకమైన వంటను వడ్డిస్తున్నారని, ప్రతిరోజు పిల్లలపై ఆగ్రహ పడుతుందని వారు ఆరోపించారు. ఇకనైనా సంబంధిత అధికారులు జోక్యం చేసుకొని మెనూ ప్రకారం మంచి రుచికైనా భోజనాన్ని విద్యార్థులకు అందించాలని తల్లిదండ్రులు అధికారులను వేడుకుంటున్నారు.


# పెద్దపల్లి జిల్లాలో ఏసీబీకి చిక్కిన అవినీతి అధికారి

## రూ. 90 వేలు తీసుకుంటూ పట్టుబడ్డ పిఆర్ ఏఈ

**పెద్దపల్లి,జూలై 12(జనంసాక్షి) :** పెద్దపల్లి జిల్లాలో మరో అవినీతి చేప ఏసీబీ అధికారులకు చిక్కింది. జిల్లాలోని కాల్వ శ్రీరాంపూర్ మండల కేంద్రంలో ఓదెల మండలానికి చెందిన కాంట్రాక్టర్ రాజు వద్ద నుండి 90 వేల రూపాయల లంచం తీసుకుంటున్న పిఆర్ ఏఈ జగదీష్ ను ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. సీసీ రోడ్డు నిర్మాణం ఎంబి రికార్డుల కోసం లంచం డిమాండ్ చేసిన పీఆర్ ఏఈ జగదీష్ ను బాధితుడు శాఖ చాకచక్యంగా అవినీతి నిరోధక శాఖ అధికారులకు పట్టించాడు.అనంతరం ఏఈని విచారణ నిమిత్తం కోసం ఏసీబీ అధికారులు పెద్దపల్లి పంచాయతీరాజ్ కార్యాలయానికి తరలించారు.

# ఇంజినీర్ల దినోత్సవాన్ని విస్మరించిన ప్రభుత్వం

## మైనారిటీల పట్ల ప్రభుత్వం చూపుతున్న చిన్నచూపు వెలుగులోకి..



**హైదరాబాద్, జూలై 12 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించడంలో ముఖ్య భూమిక పోషించిన ప్రముఖ ఇంజినీర్ నవాబ్ అలీ నవాజ్ జంగ్ బహదూర్ జయంతి (జూలై 11)ను ఈ సంవత్సరం ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించడం పట్ల ముస్లిం మైనారిటీ వర్గాలు, రాష్ట్ర ఇంజినీర్లు తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేసిన తర్వాత నాటి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ఈ మహనీయుడి సేవలకు గౌరవంగా జూలై 11ను "తెలంగాణ ఇంజినీర్ల దినోత్సవంగా" ప్రకటించి, ప్రతి ఏడాది జలసౌధ (ఇర్రమంజిల్)లో ఘనంగా వేడుకలు నిర్వహించేవారు. కానీ ఈ సంవత్సరం కాంగ్రెస్ ప్రభుత్వం ఈ వేడుకలను పూర్తిగా విస్మరించడం పట్ల తీవ్ర నిరాశ వ్యక్తమవుతోంది. నవాబ్ అలీ నవాజ్ జంగ్ బహదూర్ నిజాం పాలనలో చీఫ్ ఇంజినీర్‌గా ఉన్న సమయంలో నిర్మించిన ప్రాజెక్టులు, భవనాలు ఇవే గాక తెలంగాణ రాష్ట్రానికి ప్రాణవాయువులుగా నిలిచిన నీటిపారుదల నిర్మాణాలు – నిజాంసాగర్, పోచారం, వైరా, పాలేరు, ఎగువ మానేరు, డిండి, హిమాయత్ సాగర్, ఉస్మాన్ సాగర్, నాగార్జునసాగర్ మొదలైనవి ఆయన సేవలకు నిలువెత్తు నిదర్శనాలు. ఇలాంటి మహా ప్రజాసేవకుడిని మరిచిపోవడమే కాక, ఆయన జయంతిని కూడా నిర్వహించకపోవడం ముస్లిం మైనారిటీలను బాధిస్తున్నది. ఈ విషయంపై స్పందించిన తెలంగాణ స్టేట్ మైనారిటీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మహమ్మద్ వసీమ్ మీడియాతో మాట్లాడుతూ.. "ముస్లిం మైనారిటీల ఓట్లు తీసుకోవడానికే ఎన్నికల ముందు మైనారిటీ డిక్లరేషన్ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఇప్పుడు హక్కుల విషయానికి వచ్చాక పక్కకు పెట్టేస్తోంది. ఒక్క శాసనసభ స్థానం ఇవ్వలేదు, ఎమ్మెల్సీ స్థానం కూడా ఇవ్వలేదు, మంత్రివర్గంలో కూడా ఒక్క మైనారిటీకి స్థానం ఇవ్వలేదు. ఇప్పటికే ఉన్న కార్పొరేషన్లకు అధికారాలు ఇవ్వడం లేదు. ఇప్పుడు గత ప్రభుత్వ హయాంలో నిర్వహించిన మహనీయుల జయంతులను కూడా నిర్లక్ష్యం చేస్తున్నది. ఇది మైనారిటీల పట్ల చూపుతున్న అసలైన వైఖరి" అని ఆవేదన వ్యక్తం చేశారు. ముస్లిం మైనారిటీల సంఖ్య రాష్ట్రంలో దాదాపు 14 శాతంగా ఉన్నప్పటికీ, వారిని ఏ రాజకీయ ప్రాతినిధ్యం లేకుండా చేయడం, గుర్తించకపోవడం, కార్యక్రమాలు చేపట్టకపోవడం చాలా బాధాకరమని ఆయన పేర్కొన్నారు. 'తెలంగాణ వ్యతిరేకి తెలంగాణ వద్దు అన్ని చెప్పిన రోశయ్య జయంతిని ఘనంగా నిర్వహించిన ప్రభుత్వం, తెలంగాణ, హైదరాబాద్ అభివృద్ధికి అసమాన సేవలందించిన నవాబ్ అలీ జయంతిని ఎందుకు మరిచింది?' అని ప్రశ్నించారు. ఇప్పటికైనా మైనారిటీ వర్గాలన్నీ ముస్లింలు, క్రిస్టియన్లు, సిక్కులు, బౌద్ధులు, ఇతరులు తమ హక్కుల కోసం ఒకతాటి మీద నిలవాల్సిన అవసరం ఉందని, లేకపోతే మన సమస్యలు ఎవ్వరూ పట్టించుకోరని గత అనుభవాలే చెప్పుతున్నాయని ఆయన గుర్తుచేశారు.

# ఉపాధ్యాయుడి లైంగిక వేధింపులు

## నిప్పంటిచుకుని విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

**భువనేశ్వర్,జులై 12 :** ఒడిశాలో దారుణం చోటు–చేసుకుంది. ఓ ఉపాధ్యాయుడి లైంగిక వేధింపులు భరించలేని ఓ విద్యార్థిని ఆత్మహత్యకు ప్రయత్నించింది. దీంతో 90శాతం కాలిన గాయాలతో చావు బతుకుల మధ్య కొట్టు–మిట్టాడుతోంది. ఆమెను కాపాడేందుకు ప్రయత్నించిన తోటి విద్యార్థి మంటలంటు–కోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ చర్యలు తీసుకోకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యింది. న్యాయం జరగడం లేదనే ఆవేదనతో కాలేజీ ప్రాంగణంలోనే పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకుంది. బాలేశ్వర్‌లోని ఫకీర్ మోహన్ కాలేజీలో ఓ విద్యార్థిని బీఈడీ రెండో సంవత్సరం చదువుతోంది. ఓ విభాగాధిపతి సదరు విద్యార్థినిని కొన్ని రోజులుగా లైంగికంగా వేధిస్తున్నాడు. తనమాట వినకుంటే భవిష్యత్తు నాశనం చేస్తానని బెదిరించసాగాడు. ఇవి భరించలేని ఆ విద్యార్థిని జూన్ 30న కాలేజీ యాజమాన్యానికి ఫిర్యాదు చేసింది. ఉపాధ్యాయుడిని రక్షించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించిన విద్యార్థిని.. తనకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ గత వారం రోజులుగా కాలేజీ క్యాంపస్‌లో నిరసన చేపట్టింది.

# ఘనంగా గోరింటాకు సంబరాలు

## ముఖ్య అతిథిగా హాజరైన ఉప్పల శ్రీనివాస్ గుప్త




**హైదరాబాద్ (జనంసాక్షి) :** వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయం కమ్యూనిటీ హాల్ కేపీహెచ్‌బీ కాలనీలో తెలంగాణ స్టేట్ అవోపా మహిళ విభాగం ఆధ్వర్యంలో జరిగిన గోరింటాకు సంబరాలలో ముఖ్య అతిథిగా టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త హాజరయ్యారు. గోరింటాకు సంబరాలు అంటే ఆషాడ మాసంలో మహిళలు తమ చేతులకు గోరింటాకు పెట్టుకుని జరుపుకునే సంబరాలు అని, ఇది ఒక సంప్రదాయ పండగగా తెలంగాణలో జరుపుకుంటారని తెలిపారు. మహిళలు గోరింటాకు పెట్టుకోవడం ద్వారా తమ ఆరోగ్యాన్ని కాపాడుకుంటారన్నారు. అంటువ్యాధులను దూరం చేసుకుంటారని, ఈ సంబరాలు ఆషాడ మాసంలో ప్రత్యేకంగా మహిళలు జరుపుకుంటారని, ఈ గోరింటాకు సంబరాల కార్యక్రమాన్ని మహిళలు ఇంత పెద్ద ఎత్తున జయప్రదం చేసినందుకు మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో అవోప రాష్ట్ర అధ్యక్షుడు మలిపెద్ది శేఖర్, మహిళ విభాగం అధ్యక్షురాలు వందనపు శిల్పా, ఏవీఓపీఏ ప్రధాన కార్యదర్శి శ్రీధర్, కోశాధికారి శ్రీనివాస్, అడిషనల్ ప్రధాన కార్యదర్శి సిరిపురం శ్రీనివాస్, ఆర్గనైజేషన్ కార్యదర్శి కట్ట రవి కుమార్ గుప్త, మహిళ విభాగం ప్రధాన కార్యదర్శి ప్రియాంక, కోశాధికారి పద్మజ తదితరులు పాల్గొన్నారు.

# కమ్యూనిస్టుల కర్తవ్యం



మన దేశంలో కమ్యూనిస్టులు నిర్వహించాల్సిన మొదటి కర్తవ్యం ఏమిటంటే ప్రజలకు వర్గ చైతన్యం కలిగించడం. ఎందుకంటే ప్రజల యొక్క కష్టాలకు ,ఇబ్బందులకు కారణం ఏమిటో వారికి తెలియనంత కాలం వారు చేయాల్సిన కర్తవ్యం వారికి అర్థం కాదు. పేదరికానికి, నిరుద్యోగానికి నిరుద్యోగానికి, రైతుల ఆత్మహత్యలకు ,కార్మికుల పరిస్థితి రోజురోజు దిగజారడానికి, పెరుగుతున్న నిరుద్యోగానికి కారణం ఎవరు? విద్య క్రమంగా కార్పొరేట్ విద్య మారిపోయింది .బాగా డబ్బున్న వారి పిల్లలకు సకల సదుపాయాలు నాణ్యమైన విద్య పేదవారికి ఏ సదూపాయాలు లేని ప్రభుత్వ విద్య లభ్యమవుతుంది. అదేవిధంగా బాగా డబ్బున్న వారికి అత్యధిక సదుపాయాలు గల కార్పొరేట్ వైద్యం అందుబాటులో ఉంది. పేదవారికి ప్రభుత్వ వైద్యం అది కూడా అరకొరగా అందుబాటులో ఉంది. వీటన్నిటికీ కారణం ఏమిటి అనేది ప్రజలకు తెలియాలి. అధికారంలోఉన్నది ఎవరు? అధికారం లో ఉన్నవారు ఎవరికి లాభం చేయుచున్నారు? 78 సంవత్సరాల స్వాతంత్రం తర్వాత ఏ విధంగా పెట్టుబడిదా రులు, కార్పొరేట్ శక్తులు, మల్టీ నేషనల్ కంపెనీలు బాగా బలపడి లాభపడి కోటానుకోట్లు సంపాదిస్తున్నారు .అదే సమయంలో మధ్య తరగతి వారు క్రమంగా పేదవారిగా ఎలా మారుతున్నరు. పేదవారు మరింత పేదలవుతున్నారు. వీటికి కారణం సమాజంలో జరుగుతున్న దోపిడి అనే విషయం ప్రజలకు అర్థం కావాలి. రాజ్యాంగంలో ఎన్నో ఉన్నత లక్ష్యాలను పేర్కొన్నప్పటికీ మన పాలకుల విధానాల వలన వాటిని అందుకోలేకపోతున్నాం. కారణం అధికారంలో ఉన్నవారు కార్పొరేట్ శక్తులకు, మల్టీనేషనల్ కంపెనీలకు అనుకూలంగా వ్యవహరించడమే. ఈ విషయం సామాన్య ప్రజలకు అర్థం కావడం లేదు. అదే సమయంలో కార్మికుల ,రైతుల ప్రయోజనాలు కాపాడే వారెవరు.? ఏరాజకీయ సిద్ధాంతం కలవారు సోషలిస్టు సమాజం తీసుకుని రావడానికి నిజాయితీగా పనిచేయగలరు అనే విషయం కూడా ప్రజలకు తెలియడం లేదు. అసలు సోషలిస్టు సమాజం అంటే ఏమిటి ? ఆ సమాజంలో ఆర్థిక సంబంధాలు ఎలా ఉంటాయి.? పరిశ్రమలు ఎవరి ఆధీనంలో, ఆధ్వర్యంలో ఉంటాయి. వేలాది ఎకరాలు భూములు ఎవరి స్వాధీనంలో ఉంటాయి. ఉత్పత్తి లాభాల కోసం జరుగుతుందా? సమాజ అవసరాల కోసం జరుగుతుందా ? అనేది ప్రజలకు తెలియాలి. ఎప్పుడైతే పరిశ్రమలు, భూములు అంటే ఉత్పత్తి సాధనాలన్నీ సమాజ పరమవుతాయో అప్పుడు వాటి వల్ల జరిగే ఉత్పత్తి సమస్త సమాజ పరమవుతుంది .సమాజమే వాటిని ఎలా పంపిణీ చేయాలో నిర్ణయిస్తుంది. ఒక వ్యక్తి మరో వ్యక్తిని దోచుకునే అవకాశం ఉండదు .ప్రస్తుత సమాజంలో ఒక పరిశ్రమలో జరిగిన ఉత్పత్తి వల్ల వచ్చే లాభాలన్నీ అపరిశ్రమ యజమానికి చెందుతాయి. అదే విధంగా వందల ఎకరాల భూముల నుంచి వచ్చిన పంట ఆ భూముల యజమానులైన బడా భూస్వాములకు చెందుతుంది .లాభాలు వారికె చెందుతాయి .వాస్తవంగా పరిశ్రమలలో భూముల్లో పనిచేసే వారికి అంటే ఉత్పత్తి చేసేవారికి ఉత్పత్తిలో వాటా అతి తక్కువగా దొరుకుతుంది. అంతే కాదు లాభాల కోసం ఏది చేసినా తప్పు కాదనే భావన సమాజంలో ఉంటుంది .దాని వలన ధరలు పెరుగదల, అక్రమ వ్యాపారం, కల్తీ, వాతావరణంలో కాలుష్యం మొదలైనవి పెరిగిపోతాయి. ఎప్పటివరకయితే ప్రజలకు ఈ విషయం అర్థం కాదో అంటే ప్రజలకు వర్గ చైతన్యం కలిగించలేమో,వారి కష్టాలకు ఈ దోపిడి వ్యవస్థ కారణమనే విషయం వారికి అర్థం కాదో, అధికారంలో ఉన్నవారు కార్పొరేట్ శక్తులకు పెట్టుబడిదారులకు బడా వ్యాపారులకు, మల్టీనేషనల్ కంపెనీలకు అనుకూలంగా, భూస్వాములకు అనుకూలంగా ఉన్నందు వలననే ఆ వర్గాలకు చెందిన వారు లభ పడతారని విషయం ప్రజలకు అర్థం కాదో అంత వరకు ప్రజలు చైతన్యం గా ఆలోచించి లేరు.

అంటే రాజకీయ అధికారములోకి కార్మికుల ప్రయోజనాలను, రైతుల ప్రయోజనాలను కాపాడేవారు వచ్చినప్పుడే ప్రజల సమస్యలు పరిష్కారం అవుతాయి అనే విషయం ప్రజలకు తెలియాలి. మరొక ముఖ్యమైన విషయం కార్మిక వర్గాన్ని రాజకీయంగా చైతన్యవంతమైన శక్తిగా మార్చాల్సిన అవసరం ఉంది అనేక ట్రేడ్ యూనియన్లు కేవలం ఆర్థిక డిమాండ్లకే పరిమితం అవుతున్నాయి .కానీ కార్మికులకు వర్గ చైతన్యం కలిగించలేకపోతున్నాయి. దానివల్ల పెట్టుబడిదారుల ఏజెంట్లే కార్మికుల డిమాండ్ పరిష్కరిస్తామని చెప్పి వారి నాయకులుగా మారి కార్మికులను పక్కదారి పట్టిస్తున్నారు. అదే సమయంలో రైతులను రాజకీయంగా చైతన్యవంతులుల చేయలేకపోవడం వలన వారి సమస్యల కారణమేంటో వారికి అర్థం కావడం లేదు. కాబట్టి కమ్యూనిస్టుల ప్రథమ కర్తవ్యం ప్రజలకు వర్గ చైతన్యం కలిగించడం. ప్రజల్ని వారి వారి సమస్యలపై సంఘటిత పరిచి ఐక్య ఉద్యమాలకు తయారు చేయాలి ఒక ట్రేడ్ యూనియన్ ఉద్యమం ప్రారంభించినప్పుడు మిగిలిన యూనియన్లు వాటికి మద్దతుగా నిలవాలి. అదే విధంగా ఒకచోట రైతుల పోరాటాలు జరిగినప్పుడు ఆ పోరాటాలకు మరో ప్రాంతంలోని రైతులు బలపరచాలి. రైతాంగ పోరాటాలను కార్మిక వర్గం బలపరచడం కార్మిక వర్గ పోరాటాలను రైతులు బలపరచడం జరిగినప్పుడే భారత దేశంలో మార్పు రావడానికి అవకాశం ఉంటుంది. కమ్యూనిస్టులు ప్రజలను రాజకీయ చైతన్యవంతుల్ని చేయడంలో వెనకంజ వేయడంతో మతోన్మాద శక్తులు ప్రజల మనసుల్లో మత విద్వేషాలను రెచ్చగొడుతున్నారు ప్రజల అభిప్రాయాలు తమకు అనుకూలంగా మరల్చుకుంటున్నారు. ప్రభుత్వ రంగానికి బదులు ప్రైవేట్ రంగమే మంచిదనే భావన కలిగిస్తున్నారు.

దేశంలోని వివిధ కమ్యూనిస్టు పార్టీలు, ట్రేడ్ యూనియన్లు కలిసికట్టుగా పని చేయాల్సిన అవసరం ఉంది. చిన్న చిన్న రాజకీయ ,ప్రాంతీయ విభేదాలను వదిలిపెట్టి ఉన్నత లక్ష్యాలు సాధించడానికి ఐక్యం కావాల్సిన అవసరం ఉంది .సోషలిస్ట్ చైతన్యం గల యువతరాన్ని తయారు చేయకుండా ఈ దేశంలో మార్పు సాధ్యం కాదు. నక్సలైట్లు కూడా కార్మిక వర్గాన్ని రైతాంగాన్ని చైతన్యం పరచడానికి కార్మిక, రైతాంగ ఉద్యమాలను నిర్మించడానికి పూనుకోవాల్సిన అవసరం ఉంది. అక్కడక్కడ కొన్ని పోరాటాలు జరిగినప్పటికీ వీటిని సంఘటిత పరిచాల్సిన అవసరం ఉంది. ప్రస్తుత వ్యవస్థలో ఎంతకాలమైతే కార్పొరేట్ శక్తుల పెట్టుబడిదారుల మల్టీనేషన్ కంపెనీల ప్రయోజ నాలను కాపాడేవారు అధికారంలో ఉంటారో అంత వరకు సోషలిస్టు సమాజం గురించి ఆలోచించడం సాధ్యం కాదు. అదేవిధంగా రాజ్యాంగ లక్షణాలను కూడా నెరవేర్చే అవకాశం ఎంత మాత్రం లేదు. ఇప్పుడున్న పరిస్థితులతో రాజీపడటం కాదు పరిస్థితులను సరిగ్గా అంచనా వేసి ,పరిస్థితిల కనుగుణంగా ప్రజలని చైతన్యవంతుల్ని చేసి ప్రజా ఉద్యమాన్ని నిర్మించడం ఒకటే మార్గం. ప్రజా ఉద్యమాలు నిర్మించకుండా ప్రజల లో రాజకీయ చైతన్యం తేలేము.

జస్టిస్ చంద్రకుమార్
89783 85151

# భారతదేశంలో వ్యవసాయ చరిత్ర- ఆహారం ఉత్పత్తి!

భారతదేశంలో వ్యవసాయ చరిత్ర పురాతనమైనది, వేద సాహిత్యం, ముఖ్యంగా ఋగ్వేదం, దున్నడం, సాగు, నీటిపారుదల, పండ్లు, కూరగాయల పెంపకంపై తొలి లిఖిత ఆధారాలను అందిస్తుంది. సింధు లోయ నాగరికతలో వరి, పత్తి సాగు జరిగినట్లు, రాజస్థాన్‌లోని కలిబంగన్‌లో కాంస్య యుగ దున్నడం నమూనాలు లభించాయి. 2500 సంవత్సరాల పురాతన గ్రంథం భూమివర్గహ భూమిని సారవంతమైన, బంజరు, ఎడారి, గడ్డి, బురద, నీటితో కూడిన, గులకరాళ్ళు, ఇసుక, నదీనీటి, వర్షాధార భూములుగా వర్గీకరించింది. క్రీ.పూ. 6వ సహస్రాబ్దిలో గంగా ఒడ్డున వరి, వాయవ్య భారత దేశంలో బార్లీ, ఓట్స్, గోధుమలు, చిక్కుళ్ళు, నువ్వులు, ఆవాలు, ఆముదం, ముంగ్‌బీన్, నల్ల శనగ, గుర్రపు ముల్లంగి, పావురం బఠానీ, గడ్డి బఠానీ, మెంతులు, పత్తి, జుజుబ్, ద్రాక్ష, ఖర్జూరం, మామిడి, జాక్‌ఫ్రూట్, మల్బరీ, బ్లాక్‌ప్లం వంటి పంటలు 3000-6000 సంవత్సరాల క్రితం సాగయ్యాయి. దక్షిణ భారతదేశంలో తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, కర్ణాటకలో పప్పుధాన్యాలు, మిల్లెట్‌లు, జొన్న, పెర్ల్ మిల్లెట్, ఫింగర్ మిల్లెట్, హైసింత్ బీన్ సాగు జరిగింది. 5000 సంవత్సరాల క్రితం గేదెను పెంపుడు జంతువుగా పెంచారు. క్రీ.పూ. 9000 నాటికి మొక్కల పెంపకం, పనిముట్ల అభివృద్ధితో స్థిర జీవనం ప్రారంభమైంది. డబుల్ రుతుపవనాలు రెండు పంటల సాగుకు దోహదపడ్డాయి. భారతీయ ఉత్పత్తులు వాణిజ్య నెట్‌వర్క్‌లకు చేరి, విదేశీ పంటలు ప్రవేశపెట్టబడ్డాయి. చెరకు సాగు, చక్కెర స్ఫటికాల (ఖండ) ఉత్పత్తి క్రీ.పూ. 500 నాటికి జరిగింది, ఇది "క్యాండీ" పదానికి మూలం. 18వ శతాబ్దం వరకు చక్కెర ఐరోపాలో విలాసవంతమైన వస్తువుగా ఉండగా, 19వ శతాబ్దంలో ప్రపంచవ్యాప్త అవసరంగా మారింది. చెరకు, పత్తి తోటలు 19-20 శతాబ్దాల్లో ఆఫ్రికా, కరేబియన్, దక్షిణ అమెరికా, హిందూ మహాసముద్రం, పసిఫిక్ ద్వీపాలకు వలసలకు, రాజకీయ, సాంస్కృతిక పరిణామాలకు కారణమయ్యాయి.



స్వాతంత్ర్యానంతరం, భారతదేశం ఆహార భద్రతలో గణనీయ పురోగతి సాధించింది. జనాభా మూడు రెట్లు పెరిగినప్పటికీ, ఆహార ధాన్యాల ఉత్పత్తి నాలుగు రెట్లు పెరిగింది. పంజాబ్ హరిత విప్లవానికి నాయకత్వం వహించి, దేశానికి ఆహార ధాన్యాల పెట్టెగా గుర్తింపు పొందింది. 1960ల మధ్యకాలం వరకు దిగుమతులపై ఆధారపడిన భారతదేశం, 1965-66 కరువుల తర్వాత ఆహార స్వయం సమృద్ధి కోసం సంస్కరణలు చేపట్టింది. ఉన్నత దిగుబడి, వ్యాధి నిరోధక గోధుమ రకాలు, మెరుగైన సాంకేతికతతో 1948లో హెక్టారుకు 0.8 టన్నుల గోధుమ ఉత్పత్తి 1975 నాటికి 4.7 టన్నులకు, 2000 నాటికి 6 టన్నులకు చేరింది. ఈ విజయం వరి సాగుకు విస్తరించింది. నీటిపారుదల సౌకర్యాలు పరిమితంగా ఉండటంతో, భూగర్భ జలాల సేకరణకు గొట్టపు బావులు ఆవిష్కరించబడ్డాయి. 1970-80లలో ఈ సాంకేతికత బీహార్, ఒడిశా, పశ్చిమ బెంగాల్‌లకు వ్యాపించింది. 1980ల నాటికి, నూనెగింజలు, ఇతర పంటల ఉత్పత్తి డిమాండ్‌కు అనుగుణంగా పెరిగింది.


అయినప్పటికీ, వ్యవసాయ దేశమైన భారతదేశం దిగుమతులపై ఆధారపడటం ఆందోళన కలిగిస్తోంది. ఆయుర్వేద వైద్యంలో అగ్రస్థానంలో ఉన్న దేశంగా, విభిన్న పంటలు, మందు మొక్కలు సమృద్ధిగా ఉన్నప్పటికీ, హరిత విప్లవం భూసారాన్ని నిస్సారం చేసింది. క్రిమిసంహారక మందులు, రసాయన ఎరువుల వాడకం వల్ల పంటల్లో పోషక విలువలు తగ్గాయి, విషపూరిత పదార్థాలు ఆరోగ్య సమస్యలకు కారణమయ్యాయి. 2018-20లో వ్యవసాయ దిగుమతుల విలువ 1.52 లక్షల కోట్ల నుండి 2022-23లో 2.82 లక్షల కోట్లకు, 2024-25లో 3 లక్షల కోట్లకు చేరింది. 2024 నవంబర్ నాటికి వెజిటేబుల్ ఆయిల్స్‌కు 1,22,202 కోట్లు, పప్పు ధాన్యాలకు 27,441 కోట్లు, తాజా పండ్లకు 16,092 కోట్లు, చక్కెరకు 8,254 కోట్లు, సుగంధ ద్రవ్యాలకు 8,710 కోట్లు, జీడిపప్పుకు 9,896 కోట్లు, సహజ రబ్బరుకు 6,798 కోట్లు, ఇతర నూనె గింజలకు 978 కోట్లు ఖర్చయ్యాయి. 2024 సంవత్సరంలో ఆరు నెలలకే 1,81,141 కోట్లు దిగుమతులకు ఖర్చయ్యాయి, ఇది ఆర్థిక వ్యవస్థకు భారం. ఈ సమస్యకు పరిష్కారంగా, రైతులకు అవగాహన కల్పించి, శాస్త్రీయ భూసార పరీక్షలు, సేంద్రీయ వ్యవసాయం, పోషక విలువలతో కూడిన పంటల ఉత్పత్తిని ప్రోత్సహించాలి. కేంద్ర ప్రభుత్వం 3000 కోట్లతో సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తోంది. రైతులు, అధికారులు, నిపుణులు, పాలకుల మధ్య సమన్వయం, స్పష్టమైన లక్ష్యాలు, నష్ట భర్తీ విధానాలతో సమున్నత వ్యవసాయ వ్యవస్థ సాధ్యమవుతుంది. ఇది దిగుమతులను తగ్గించి, ఆహార సంపదను సృష్టించి, ఎగుమతులకు అవకాశం కల్పిస్తుంది. లేకుంటే, దిగుమతుల భారం ఆర్థిక వ్యవస్థను వెనుకకు నెట్టే ప్రమాదం ఉంది. రైతుల కష్టాన్ని, చెమటను గౌరవిస్తూ, చిత్తశుద్ధితో పనిచేస్తే, వ్యవసాయ రంగం దేశ ఆర్థిక స్థిరత్వానికి బలమైన స్తంభంగా నిలుస్తుంది.



డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

# మాదిగలు మహారాజులు, జాంబవంతుని వారసులు

హిందు పురాణాలలోని సంకల్ప మంత్రంలో "జంబుద్వీపే భరతవర్షే భరతఖండే" పదాలు ఉచ్చరి0స్తారు. వీటి ప్రకారం ఒకప్పుడు జంబుద్వీపం, అందులో భారతదేశం భాగమని అర్థమవుతుంది. మరి ఈ జంబూద్వీప భూమండలానికి తొలి మూలపురుషుడు, జాంబవ మహాచక్రవర్తి అని 'జాంబవ ఇతిహాసం' చెబుతున్నది. ఇది దక్కలి వారి మౌఖిక జానపద చరిత్ర. జాంబవంతుడు ఈ భూమికి ఆది దేవుడు, మహాప్రభువు, మహారాజు. ఈ దేశాన్ని మొదట జంబూద్వీపం అనే వారని జానపద ఇతిహాసం, మౌఖిక చరిత్ర, శాస్త్రీయ పరిశోధనలు, చరిత్రకారులు, విదేశీ సాహిత్య ఆధారాలు చెబుతున్నాయి. ఈ నేలకు మొదటగా పేరు పెట్టింది మాదిగ జాతి బిడ్డని, మన ఉనికిని, గొప్పతనాన్ని చాటి చెపుతున్నాయి. నేటి మాదిగలు జాంబవంతుని వారసులు, జాంబవంతుని వారసత్వంగా వచ్చిందే ఈ మానవజాతి. జంబుద్వీపం అంటే కేవలం భారత ఉపఖండమే కాదు. ఇందులో ఆసియా, ఐరొపా,ఆఫ్రికా, ఉత్తర అమెరికా ఉండేవి. భరతవర్షం అని పిలబడే భారతదేశం కూడా భాగమే. భారతదేశం ఈజిప్ట, ఆఫ్ఘనిస్తాన్, బలుచిస్తాన్, ఇరాన్, సుమేరియా, క్యాస్పియన్ సముద్రం వరకు వ్యాపించి ఉండేది. జంబుద్వీపానికి మొదటి పాలకుడు జాంబవంతుడు. ఆయనే భూమిపై మానవ నాగరికతను, సంస్కృతిని, విలువలను నెలకొల్పాడని చరిత్ర చెబుతుంది. స్వేచ్ఛ, సమానత్వం, సోదరాభావాన్ని నేర్పిన గొప్ప మహనీయుడు. గణతంత్ర విలువల ద్వారా రాజ్యాన్ని పాలించిన రాజు. మనుషులకు ఆహారాన్ని , ఆరోగ్యాన్ని అందించిన గొప్ప దేవుడు. కుల, మత, వర్ణ భేదాలు లేకుండా మనుషుల మధ్య ప్రేమను నింపి, మానవ విలువలతో రాజ్యాన్ని ఎలాడు. స్త్రీలను గౌరవించే మాతృస్వామ్య వ్యవస్థ కేంద్రంగా జాంబవ చక్రవర్తులు రాజ్య పరిపాలన చేసేవారు. ఆర్య బ్రాహ్మణ వలసదార్లు అధర్మయుద్ధం ద్వారా జాంబవంతుడిని ఓడించారు. అనంతరం వారు రాసిన పురాణాలలో జాంబవంతుని చరిత్రను తలకిందులు చేశారు. మనుషులను నాలుగు వర్ణాలుగా, అనంతరం కులాలుగా విభజించారు. జాంబవంతుని వారసులైన మాదిగలను అతిశూద్రులుగా, పంచమ వర్ణంగా అట్టడుగున చేర్చారు. అనేక అవలక్షణాలు అంటుగట్టి మాదిగలను ఊరవతల జీవించే పరిస్థితికి తీసుకొచ్చారు. వీరికి విద్యను, భూమిని, ఆయుధాన్నీ, సింహాసనాన్ని అందకుండా చేశారు. ఇప్పటికి వీరి ఇండ్లు ఊరు బయటనే ఉండడమే దీనికి సజీవ సాక్ష్యం. కడపటి(ఊరి చివర ఉండే మాదిగలు)వాడే ఈ దేశానికి మొట్టమొదటి పాలకుడు అని జ్యోతిబాపూలే అధ్యయనం ద్వారా చెప్పారు. దీన్ని బట్టి నేడు మాదిగలు ఈ దేశ పాలకులు అనేది రుజువు అవుతుంది. మరోవైపు సామాజిక శాస్త్ర ప్రకారం నాలుగు వర్ణాల్లో ఇప్పుడున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, రెడ్డి, వెలుమ, కమ్మ, కరణం కులాలు శూద్రులుగానే చెబుతారు. ఇప్పటికీ ఒక కులానికి ఉన్న ఇంటి పేర్లు మరోక కులానికి కూడా ఉంటాయి. నేడు సామాజిక స్థితి మారడం వల్ల విభజన రేఖ ఏర్పడింది.




వారసత్వ జ్ఞానంతో చైతన్యం కావాలి.

మాదిగలు ఒకప్పటి ఈ దేశ నిర్మాతలు, రాజులు అయి ఉండి, వారి చరిత్రను మరచిపోయి, జ్ఞానాన్ని కోల్పోయి, అన్నంకోసం బ్రతికే హీన జీవులుగా బ్రతుకుతున్నవి. ఈ క్రమంలో దళిత శక్తి ప్రోగ్రాం ద్వారా డాక్టర్ విశారదన్ మహారాజు గారు తొలిసారి తెలంగాణలో జాంబవంతుని చరిత్రను పరిచయం చేశారు. మాదిగలు జాంబవంతుని వారసులమని, ఈ దేశాన్ని పాలించిన మహారాజులమని చెప్పి ఆత్మనూన్యత భావాన్ని తొలగించాడు. 5వేల కిలోమీటర్ల మహాకాళినడక ద్వారా ప్రతి మాదిగ గూడెంలోకి వెళ్లి అక్కడ మహారాజుల కాలనీ బోర్డ్ లు కూడా పెట్టారు. దీంతో కొన్నాళ్లుగా తెలంగాణ రాష్ట్రంలో జాంబవంతుడు, మాదిగల వారసత్వ చరిత్ర గురించి చర్చ జరుగుతుంది. ఇప్పటిదాకా మన పూర్వికులు చెప్పులు కుట్టేవాళ్ళు ,డప్పులు కొట్టేవాళ్ళు అని కొన్ని సంఘాలు చెప్పుకుంటూ తిరిగాయి. మరోవైపు నేడు మనుధర్మం స్త్రీలకు ఆంక్షలు పెట్టి, అనగదొక్కింది. బానిసత్వం, అంటరానినం, స్త్రీల వెనుకబాటుతనంకి కారణమైన ధర్మాన్ని ,సంస్కృతిని ఆరాధిస్తున్నాం. కానీ మన చరిత్రను మాదిగ జాగృతి సంఘం శాస్త్రీయంగా అధ్యయనం చేసి మన పూర్వికులు ఒకనాడు అఖండ శౌర్య పరాక్రమాలతో, జ్ఞానంతో ఈ దేశాన్ని పరిపాలించిన రాజులమని చెబుతుంది. కుల మత వర్ణ బేధాలు లేని ఆ గొప్పనైన సమాజంలో ప్రజలని కన్న బిడ్డల్లా భావించేవారని మన చరిత్ర చాటి చెబుతోంది. చరిత్ర తెలియని వాడు చరిత్ర సృష్టించలేడని ఆనాడు అంబేద్కర్ అన్నాడు. ఆయన జాంబవంతుని విలువలను రాజ్యాంగంలో పొందుపరిచాడు. నేడు మాదిగల ఉద్యమ లక్ష్యం దీనస్థితిలో, అజ్ఞానంలో ఉన్న శరీరాలకి అన్నం పెట్టడం, డబ్బులు ఇవ్వడం, ఓట్ల కోసం జాతిని తాకట్టు పెట్టడం కాదు, జ్ఞానం ద్వారా సంస్కరణ చేయడమే. ఇవే నిజమైన మాదిగ ఉద్యమాలు. ఈ నేపథ్యంలో మాదిగలు పూర్వీకుల చరిత్ర, సంస్కృతి, జ్ఞానం వారసత్వాన్ని తెలుసుకొని ఆత్మగౌరవంతో రాజ్యాధికారం వైపు ప్రయాణించాలి. అప్పుడే ఈ దేశంలో అంటరానితనం, అస్పృశ్యతో ఊరవతల ఉన్న మాదిగలు పాలకులవుతారు. అప్పుడే ఈ సమస్త సంపద, వనరులు అందరికీ సమానంగా పంచబడతాయి.

సంపతి రమేష్ మహారాజ్
సామాజిక విశ్లేషకులు, 7989578428.

# ప్రాణాలను నిలబెట్టేందుకే చర్చలు



మే 2025 లో ఆపరేషన్ కగార్‌లో భాగంగా కర్రెగుట్టను చుట్టుముట్టిన వేలాది బలగాలు 22 మందిని హత్య చేసి శవాల గుట్టగా మార్చాయి. అందులో మనకు తెలిసి ఏటూరు నాగారం మండలం ఏటూరు గ్రామానికి చెందిన డాక్టర్ చందు శవాన్ని ఆ శవాల గుట్టలోంచి శవాన్ని వెతికి వెతికి తీసుకొని వచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. ఆ క్రమంలోనే మందు పాతర పేలి ముగ్గురు గ్రేహంట్ పోలీసులు మృతి చెందినట్లుగా వార్త వచ్చింది. కానీ అదే కర్రెగుట్టలో 17 రోజులుగా ఆపరేషన్ కగార్ పేరుతో అణచివేత కొనసాగింది. అయితే క్రాస్‌ఫైరింగ్‌లోనే ఈ ముగ్గురు చనిపోయినట్లుగా పోస్ట్ మార్టమ్ ప్రాథమిక అంచనాల వలన తెలిసింది. ఈ మృతి చెందిన పోలీసులు ముగ్గురు తెలంగాణ రాష్ట్రానికి సూర్యాపేటకు చెందిన సిద్దిపేట సందీప్, పవన్, రణధీర్‌లుగా గుర్తించారు. మృత దేహాలను వరంగల్ ఎం.జి.ఐ. ఆసుపత్రిలో చాలా రహస్యంగా 4 గంటల పాటు పోస్టమార్టం నిర్వహించి కుటుంబీకులకు అందజేశారు. ఆ తరువాత జరిగిన 9 జూన్ 2025న జరిగిన ఐ.ఈ.డి. బ్లాస్ట్‌లో ఎ.ఎస్.పి. ఆకాశ్ రావు కూడా మరణించడం జరిగింది. 18 నెలల ఆపరేషన్ కగార్ హత్యాకాండలో మనకు తెలిసి ఈ మధ్య కాలంలో నలుగురు పోలీసులు చనిపోయారు. అందులో ఆకాశ రావు ఒక అధికార స్థానంలో ఉండి చనిపోవడం జరిగింది. ప్రభుత్వం దృష్టికి పౌరహక్కుల సంఘంగా మేము తీసుకువస్తున్న విషయం ఏమిటంటే, ఆపరేషన్ కగార్ ఇప్పిటికే 57 ఎన్‌కౌంటర్‌లలో 580 మంది వరకు హత్య గావించబడ్డారు. అది కేవలం ఎన్‌కౌంటర్ పేరుతో. ఎన్‌కౌంటర్లన్నీ ప్రభుత్వ హత్యలే అని చరిత్ర ఆవిష్కరించిన సత్యం మనందరికి తెలిసిందే. ప్రభుత్వాలు గ్రీన్‌హంట్, ఆపరేషన్ సమాధాన్‌ల పేరుతో కొనసాగించిన హత్యాకాండలను మించి 100 రేట్లు ఎక్కువ స్థాయిలో కొనసాగుతున్న ఆపరేషన్ కగార్‌ను నిలువరించుట కోసం చర్చల ప్రక్రియ కూడా ముందుకు వచ్చింది. అది ఈ సారి మావోయిస్టు పార్టీ నుంచి ముందుగా వచ్చింది. కానీ గత 5 నెలలుగా ప్రభుత్వం చర్చలకు అవకాశం లేకుండా హత్యలు చేసి శాంతి ని నెలకొల్పుతామని ప్రగల్బాలు పలుకుతూ ఆదివాసీల, మావోయిస్టుల హననాన్ని నిరంతరాయంగా క్రూరాతిక్రూరంగా కొనసాగిస్తుంది. దీన్ని మెజారిటీ దేశ ప్రజలు ప్రజాస్వామిక వాదులు ఆమోదించకుండా చర్చలు జరపాలని డిమాండ్ చేస్తున్నది. అందులో తెలంగాణలోని అధికార ప్రతిపక్ష పార్టీలతో పాటు రాష్ట్రంలో ఉన్న 10 వామపక్ష పార్టీలు కూడా ముందువరుసలో నిలబడ్డాయి. మొత్తం తెలంగాణ యొక్క అభీష్టాన్ని కాదని ఒక్క బిజెపి పార్టీ మాత్రమే హత్యలకు ప్రాధాన్యతనిస్తూ మావోయిస్ట ఉద్యమ ప్రాధాన్యాన్ని ఉగ్రవాదంగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారు. కానీ మావోయిస్టులు కోరినట్లుగా చర్చల ప్రక్రియ కొనసాగించినట్లయితే ముగ్గురు గ్రేహంట్స్ పోలీసులు గాని ఎఎస్‌పి ఆకాశ రావు గాని అలాగే 600 మంది ఆదివాసీ ఉద్యమకారులు మరణించి ఉండేవారు కాదు. వీళ్ళందరినీ హత్య చేసి ఎటువంటి శాంతిని ప్రభుత్వం సాధించాలనుకుంటుంది. ఇది ప్రభుత్వ ఎజెండానా? కార్పొరేట్ల ఎజెండానా? కార్పొరేట్ల కోసం దేశంలో మూలవాసులైన ఆదివాసీలను హననం చేస్తున్నది, అలాగే 35 ఆదివాసీ సంఘాలతో ఏర్పడ్డ ఒక ఆదివాసీ గొంతుక మూలవాసీ బచావో మంచ్‌ను కూడా నిషేదించి నిర్బంధాలకు గురి చేసి ఆదివాసీల గొంతే లేకుండా మధ్యభారతాన్ని నిశ్శబ్ధం చేయాలని మోడీ ప్రభుత్వం కలలు గంటున్నది. ఇది ఆచరణలో పూర్తిగా సాధ్యమయ్యే అంశం కాదు. గతంలో పౌరహక్కుల సంఘం ప్రకటించినట్లుగానే మావోయిస్టు పార్టీ ఎజెండా ప్రజల మౌలిక సమస్యల మీద ఆధారపడి ఉంది. కానీ 78 ఏళ్ళ స్వతంత్ర భారతంలో 50 ఏళ్ళ మావోయిస్టు పార్టీ ఉద్యమ చరిత్రలో పోరాటాలు సాగుతున్నాయి, ఎన్‌కౌంటర్ హత్యాకాండ కొనసాగుతున్నది, కానీ ప్రజలకు రాజ్యాంగం కల్పించిన మౌలిక హక్కులను కూడా ఏ ప్రభుత్వం కూడా అందజేయలేక పోయింది. అందుకే ప్రజలకు సమస్యలు ఉన్నంత కాలం పోరాటాలు ఉంటాయి, ఆ పోరాటాలకు ఏదో ఒక రాజకీయ పార్టీ నాయకత్వం వహిస్తుంది. దాన్ని దృష్టిలో పెట్టుకొని బయట ఉన్న ప్రజాస్వామిక వాదులు ఎన్‌కౌంటర్లతో ఉద్యమాలను నిశ్శబ్ధం చేయడం కన్నా చర్చల ద్వారా ఒక శాంతియుత పరిస్థితిని నెలకొల్పుకుందామనే స్థితికి ప్రభుత్వాలు ముందుకు రావాలి. అలా కాక హత్యాకాండనే విశ్వసిస్తే అది ఎప్పటికైనా సరే పూర్తి సరియైన ఫలితాలను ఇవ్వదు. ఇప్పటికే దేశంలో ఆకలి, నిరుద్యోగం, పర్యావరణం, వరకట్న హత్యలు, మత విద్వేశాలు, విద్యార్థుల ఆత్మ హత్యలు ఏవీ కూడా నియంత్రణ లేకుండా నిరంతరాయంగా కొనసాగుతుంది. ఎవరికి కూడా పరిష్కారాలు కనబడడం లేదు. ప్రభుత్వాలు ప్రజల్ని పరిపాలించడంలో వారి మౌలిక సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలం అయ్యాయి. అందులో నుంచే కదా ప్రజా ఉద్యమాలు ఆవిర్భవించాయి. వాటన్నింటిపై అప్పటి నుంచి ఈ రోజు వరకు అణచివేత అనేక ఆపరేషన్ల పేరుతో కొనసాగిస్తున్నది. ఏ ఉద్యమాన్నైనా శాంతిగా కొనసాగించడం కోసం శాంతి చర్చల కోసం 2000 నుండి చాలా ప్రయత్నాలు జరిగాయి. దానిలో ఎస్.ఆర్. శంకరన్, పొత్తూరి వెంకటేశ్వర రావులు కీలక భూమిక నిర్వహించారు. ఆ కాలంలో శాంతి చర్చలు జరిగి శాంతి వాతావరణం ఏర్పడింది. కానీ నేడు ప్రభుత్వాలే హత్యాకాండను కొనసాగించే విధంగా చర్చల కోసం ముందుకు రావడం లేదు. కర్రెగుట్టను చుట్టుముట్టిన నేపథ్యంలో కోల్పోయిన 22 ప్రాణాలతో పాటు ముగ్గురు గ్రేహండ్ పోలీసులు ఉన్నారు. ఆ తరువాత జరిగిన ఘటనలో ఎఎస్‌పి ఆకాశ రావు ఉన్నాడు. వీరందరి మరణానికి ప్రభుత్వాలే కారణం కదా. ఎందుకు పోలీసు అధికారుల సంఘం గ్రేహండ్స్ పోలీసుల విభాగం ప్రశ్నించడం లేదు. పోలీసు ఉద్యోగులు వారి వారి పరిమితుల్లోనే పని చేస్తున్నారు. ప్రభుత్వం, కార్పొరేట్ల కోసం తమ పరిధిని దాటి శాంతి చర్చల ప్రక్రియలో లేకుండా ప్రాణాలు కోల్పోవాల్సిన పరిస్థితిని ప్రభుత్వాలు సృష్టిస్తున్నాయి. ఆ వైపుగా ప్రజలందరు ప్రభుత్వాన్ని ప్రశ్నించకపోతే శాంతి చర్చల ప్రక్రియ ఆగిపోయి ఇంకా ప్రాణ నష్టం జరిగే ఆస్కారం ఏర్పడుతుంది. కాబట్టి పోలీసుల మరణాలైనా మావోయిస్టుల మరణాలైనా ప్రభుత్వమే బాధ్యత పడాల్సిన అవసరం ఉంది. ప్రధానంగా ప్రజాస్వామ్యంలో ఉద్యమాలుంటాయి, పోరాటాలుంటాయి, వాటిని ఒకానొక స్థాయిలో చర్చలతో పరిష్కరించుకుంటారు. అది ప్రజాస్వామ్యం యొక్క ఆనవాయితీ. ప్రభుత్వాలు ఆ గీతను ఎప్పుడో దాటేసాయి. అవి కేవలం కుల విద్వేశాలను, మత విద్వేశాలను, ప్రాంత విద్వేశాలను రెచ్చగొట్టి ప్రజల్లో ఆందోళన సృష్టించి ప్రధానమైన సమస్యలను పక్కదోవ పట్టించే ప్రయత్నంలో భాగంగానే ఈ కార్పొరేట్ హత్యాకాండలో ప్రభుత్వాలు భాగమవుతున్నాయి. అందుకే చర్చలకు వ్యతిరేకంగా మాట్లాడుతున్నాయి. నిన్నటి నుంచి కొనసాగుతున్న ఆపరేషన్‌లో 30 వేల బలగాలు నేషనల్ పార్కును చుట్టుముట్టి ప్రతి ఒక్క గ్రామంలో ప్రతి ఒక్క ఇంటిలో ఉన్న కోడిని, మేకను, సామాన్లన్నింటిని విధ్వంసం చేస్తూ ఒక భయానక వాతావరణాన్ని సృష్టిస్తున్నారు. అక్కడ న్యాయం చెప్పడానికి దిక్కులేదు, అన్యాయాన్ని నిలువరించడానికి బలం లేదు. కేవలం అధికార బలమే పోలీసు బలమే అక్కడ అణిచవేతను కొనసాగిస్తూ శాంతి కోసం ప్రయత్నిస్తున్నామని ప్రపంచానికి తెలియపరుస్తుంది. కానీ జరుగుతున్నదంతా కూడా మారణ కాండ తప్ప మరొకటి కాదు. ఇప్పటికైనా నేషనల్ పార్కు (10వేల ఎకరాలు) ను చుట్టుముట్టిన 30 వేల బలగాలు వెంటనే వైదొలగాలని, ఆదివాసీల జీవించే హక్కుకు రక్షణ కల్పించాలని పౌరహక్కుల సంఘంగా డిమాండ్ చేస్తున్నాం. కర్రెగుట్ట అయినా, నేషనల్‌పార్కు అయినా నారాయణ పూర్ అయినా ఏవి అయినా ఎన్‌కౌంటర్లు కాదు, చుట్టు ముట్టి కాల్చివేత. ఇది ప్రజాస్వామ్యంలో చెల్లదు గాక చెల్లదు. ఇప్పటికైనా మోడీషా ప్రభుత్వం తమ తప్పును సరిదిద్దుకోవాలని చర్చల ప్రక్రియను కొనసాగించాలని మధ్యభారతంలో ఉన్న అన్ని సైనిక క్యాంపులను ఎత్తివేయాలని ప్రజాస్వామ్యాన్ని రక్షించాలని మరొక్కసారి మోడీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం.



ఎన్. నారాయణ రావు
ప్రధాన కార్యదర్శి
పౌరహక్కుల సంఘం




## నేటి భారతం!

అంతులేని పన్నులతో
జనాన్ని కొల్లగొట్టారు!
అది రాజుల కాలం!
నాటి రాజగురువులు
శాపాలతో భయపెట్టి
మనువాదంతోపిండారు!
ఇప్పుడు మంత్రులొచ్చినా
ఆ గురువుల మనువాదం
నేటికీ కొనసాగుతోంది!
పేరుకు ప్రజాస్వామ్యం
మనువాద భావజాలం
వేళ్ళూనుకుపోయింది!
మనువాద సంస్కృతి
నేటి పాలకవర్గాలకు
వరప్రసాదమైంది!
జనం కులమతాలు
మూఢ నమ్మకాల నుండి
బైట పడటం లేదు!
నేటి మత పాలకులకు
మనుస్మృతి చట్టమట!
ఇదీ నేటి భారతం!

-తమ్మినేని అక్కిరాజు
హైదరాబాద్

# కుమ్మరికుంట రోడ్డు పనులు త్వరలో పునరుద్ధరణ

● మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్



**హయత్‌నగర్, జూలై 12 (జనం సాక్షి) :** హయత్‌నగర్‌లో దీర్ఘకాలికంగా ఉన్నటువంటి కుమ్మరి కుంట పై రోడ్డు సమస్యను మల్కాజ్ గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్, స్థానిక డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ మల్కాజ్ గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ సహాయం తో గత సంవత్సర కాలం గా హయత్ నగర్ డివిజన్‌లో దాదాపు 12 కోట్ల రూపాయల అభివృద్ధి పనులు చేపట్టమని వారు తెలిపారు. సూర్య నగర్ కాలనీ ప్రధాన రోడ్డు మార్గం, ముదిరాజ్ కాలనీ నుండి జైస్వాల్ ఫర్నిచర్ వరకు, గాయత్రి నగర్ కాలనీ నుండి ఇన్ఫర్మేషన్ కాలనీ వరకు, దత్తాత్రేయ కాలనీ, వివిధ కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టామని వారు తెలియజేశారు. ఈటెల రాజేందర్ స్వయంగా జోనల్ కమిషనర్‌కి ఫోన్ చేసి హయత్‌నగర్ డివిజన్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయించారని వారు అన్నారు. హయత్ నగర్ డివిజన్‌లో దీర్ఘకాలికంగా ఉన్న కుమ్మరికుంటపై రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు గత నాలుగున్నర సంవత్సరాలుగా జిహెచ్ఎంసి, ఇరిగేషన్ అధికారు లకు వినతిపత్రం ఇవ్వడం జరిగిందని, స్టాండింగ్ కమిటీలో ఈ అంశంపై చర్చించామని వారు అన్నారు. త్వరగా కుమ్మరి కుంట కట్టపై రోడ్డు నిర్మాణం చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని ఈటలకి వారు విజ్ఞప్తి చేశారు. కుమ్మరి కుంట పై రోడ్డు మార్గం హయత్‌నగర్ డివిజన్‌లో ఉన్నటువంటి దాదాపు 30 కాలనీ వాసులకు కాకుండా బి.ఎన్.రెడ్డి మీదుగా నాగార్జునసాగర్ హైవేలకు కనెక్టివిటీ రోడ్డు మార్గం కావడంతో లక్షలాది మందికి ఉపయోగకరంగా మారుతుందని వారు వివరించారు. ఎంపీ ఈటెల రాజేందర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్ విశ్వ నగరమని, హైటెక్ సిటీని చూపుతూ అభివృద్ధి సాధించామని గొప్పలు చెబుతుందే తప్ప నగర శివారు ప్రాంతాల కాలనీల్లో కూడా మౌలిక వససతులైన రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి సదుపాయాలు కల్పించాలని వారు సూచించారు. హైదరాబాద్ శివారులో కొత్తగా విస్తరించిన కాలనీలలో, బస్తీ లలో గానీ సమస్యలు చూస్తే గుండె తరుక్కుపోతుందన్నారు. రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి వ్యవస్థ లేకపోవడంతో కాలనీల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని వారు తెలిపారు. వర్ష కాలం లో వరదలకు ఇళ్లు మునిగిపోతున్నాయి తప్ప వరదలను తరలించేందుకు సరైన స్ట్రామ్ వాటర్ డ్రైన్లు ఏర్పాటు చేయడం లేదని వారు అసహనం వ్యక్తం చేశారు. ఎల్బీనగర్ నియోజకవర్గం లోని హయత్ నగర్, మనసురాబాద్, నాగోల్ డివిజన్ లలో సరైన డ్రైనేజీ, రోడ్లు, స్ట్రామ్ వాటర్ డ్రైన్ లేక పోవడంతో సమస్యలు ఏర్పడుతున్నాయని వారు పేర్కొన్నారు. నగర శివారు కాలనీలు, బస్తీ లలో మౌలిక వసతులు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నానని వారు చెప్పారు. లక్షలాది మంది నివాసముంటున్న దాదాపు 30 కాలనీల ప్రజలు రాకపోకలు సాగిస్తున్న ప్రధాన రోడ్డులో కూడా కనీసం రోడ్డు సౌకర్యం ఏర్పాటు చేయలేదన్నార, హయత్ నగర్ కుమ్మరి కుంట మధ్య ఉన్న 80 నుండి 100 పీట్ల రోడ్డు ను పునరుద్ధరించేందుకు దాదాపు రూ.6 కోట్ల తో త్వరలో నే నిర్మాణ పనులు చేయిస్తానని వారు హామీ ఇచ్చారు. హయత్ నగర్ డివిజన్ లో ప్రధాన మైన డ్రైనేజీ సమస్యను పరిష్కరిస్తామని వారు తెలిపారు. నిర్మాణ పనుల కు ప్రతిపాదనలు సిద్ధం చేశామని, మంజూరు అనంతరం పనులు ప్రారంభిస్తామని వారు స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి రంగారెడ్డి జిల్లా మాజీ అధ్యక్షులు సామ రంగా రెడ్డి, మల్కాజిగిరి పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ బండారి భాస్కర్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఉగాది ఎల్లప్ప, డివిజన్ అధ్యక్షులు గంగాని శ్రీనివాస్, స్థానిక నాయకులు, వివిధ కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సంఘాల అభ్యున్నతికి సీఎం రేవంత్ రెడ్డి కృషి



**బొంరాస్‌పేట, జూలై 12 (జనం సాక్షి) :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళా సంఘాల అభ్యున్నతికి కృషి చేస్తున్నాడని కొడంగల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకారం వేణుగోపాల్,దుద్యాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆవుటి శేఖర్ అన్నారు.రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమన్నారు.శనివార ఇందిరా మహిళా శక్తి సంబరాల్లో భాగంగా ఈర్లపల్లి,లగచర్ల గ్రామాల్లో పాల్గొన్నారు.ఉల్లాస్ అనే కార్యక్రమం ద్వారా నిరక్షరాస్యులైన మహిళలను గుర్తించి చదువుకునేలా ప్రోత్సహించేందుకు రేవంత్ రెడ్డి సర్కారు ప్లాన్ చేస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి వెంకటయ్య, మండల కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు రవి నాయక్,సిసి రామచంద్రయ్య,వివోఏ మల్కప్ప, ఆయా గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు చెన్నంపల్లి లక్ష్మయ్య, పిట్ల మొగులయ్య తదితరులు పాల్గొన్నారు.

# స్వయం ఉపాధితో యువత రాణించాలి




**చంపాపేట్, జూలై 12 (జనం సాక్షి) :** ఉద్యోగుల కోసం నిరీక్షించకుండ స్వయం ఉపాధి రంగాలను ఎంచుకుని రాణించాలని ప్రముఖ సినీ తార కుమారి ఐశ్వర్య రాజేష్, ఏసిపి కృష్ణయ్య, సీఐ సైదిరెడ్డి అన్నారు, శనివారం ఎల్బీనగర్ నియోజకవర్గం చంపాపేట్ డివిజన్ పరిధిలోని కర్మన్ ఘాట్ శుభం ప్రెస్టేజ్ పక్కన ప్రధాన రహదారి పై నూతనంగా ఏర్పాటు చేసిన కుబేర సిల్క్స్ షాప్‌ను సంక్రాంతి సినిమా ప్రముఖ సినీ తార కుమారి ఐశ్వర్య రాజేష్, ఎల్బీనగర్ ఏసిపి ఏ. కృష్ణయ్య, సిఐ సైది రెడ్డి ఎస్సైలు, పలు రాజకీయ నాయకులు,డివిజన్ కార్పొరేటర్లు, ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా విచ్చేసి నిర్వాహకులతో కలిసి ప్రారంభించారు, అనంతరం నిర్వాహకులు శ్రీనివాస్, శ్యాంసుందర్, సిబ్బంది లతో మర్యాదపూర్వకంగా కలిసి పూలమాలలు వేసి మెమొంటో అందజేస్తూ, శాలువతో ఘనంగా సత్కరిస్తూ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భముగా ఏసిపి మాట్లాడుతూ.. శాంతి భద్రత పరిరక్షణలో పోలీసులకు సహకరించాలన్నారు. రోడ్డు భద్రత మనందరి బాధ్యత, ప్రజలకు ఇబ్బంది కలుగకుండా చూడాలని సూచించారు. చిన్నపిల్లల నుండి పెద్దల వరకు దుస్తులు ప్రత్యేకత ఉండాలని సూచించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా నూతన వెరైటీలను అందించి ప్రజల మన్ననలు పొందాలని నిర్వాహకులకు సూచించారు. ప్రత్యేక ప్రజలకు అందించాలన్నారు. పరిశుభ్రతమైన నాణ్యత గల జాగ్రత్త పాటించాలన్నారు. అభివృద్ధి చెందలంటే మారుతున్న కాలానుగుణంగా కష్టపడి పురోగతి చెంది వినియోగదారులకు మంచి సేవలు అందించినప్పుడే వినియగదారుల ఎల్లప్పుడూ మీ సేవ సౌకర్యాలు అందుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసులు సిబ్బంది నాయకులు పెద్దలు అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆర్డినెన్స్ పేరుతో రేవంత్ రాజకీయ నాటకం



**శివ్వంపేట, జూలై 12 (జనంసాక్షి) :** స్థానిక సంస్థల ఎన్నికల విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ద్వందా విధానాలను అవలంబిస్తున్నారని ఆర్డినెన్స్ తో ఈ కుట్రకు తెర తీశాడని బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు రమణ గౌడ్, మాజీ ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, మాజీ జెడ్పిటిసి పబ్బా మహేష్ గుప్తా లు పేర్కొన్నారు. శనివారం వారు మండల కేంద్రమైన శివ్వంపేట లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమంత్రి చెప్పేది ఒకటి చేస్తున్నది మరొకటి, ముఖ్యమంత్రి అవలంబిస్తున్న ప్రాధాన్యతల క్రమం ఏమిటి, ముఖ్యమంత్రి చేతలకు మాటలకు పొంతనలేదని బీసీలకు సంపూర్ణంగా అన్యాయం చేయడానికి ఈ కొత్త తరహా రాజకీయ కుట్రకు తెర తీశాడని వారు విమర్శించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై ఈ ప్రభుత్వం శాసనసభలో బిల్లు ప్రవేశపడితే ఏకగ్రీవ తీర్మానానికి మన పార్టీ సభ్యులందరూ ఆమోదం తెలపాలని, తమ పార్టీ అధినేత కెసిఆర్ ఆదేశాల మేరకు శాసనసభలో బీసీ బిల్లుకు ఎమ్మెల్యే లు సంపూర్ణ మద్దతు తెలియజేసి ఆమోదించడం జరిగిందని వారు గుర్తు చేశారు. ఈ ముఖ్యమంత్రి వచ్చి 18 నెలలు గడిచిన ఇప్పటికీ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహించకపోవడంతో గ్రామాలలో ఎక్కడి సమస్యలు అక్కడ తిష్ట వేశాయని, గ్రామాలన్నీ చెత్తాచెదారాలతో మురికి కూపాలుగా దర్శనమిస్తున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. సకాలంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహించకుండా కాలయాపన చేస్తూ, పబ్బం గడుపుతున్నారని వారన్నారు. అసెంబ్లీ ఆమోదించిన బీసీ బిల్లును ఢిల్లీకి పంపి, అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకువెళ్ళి, కేంద్ర ప్రభుత్వ పెద్దలతో మాట్లాడకుండా, ఆర్డినెన్స్ పేరుతో కొత్త రాజకీయ కుట్రకు రేవంత్ ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని వారు విమర్శించారు. గతంలో మహారాష్ట్ర, బీహార్ రాష్ట్రాలలో ఆర్డినెన్స్ లు చేసిన ప్రభుత్వాలు ఫెయిల్ అయ్యాయని, ఆర్డినెన్స్ లతో ఆ ప్రభుత్వాలు ఎన్నికలు నిర్వహించిన కోర్టు మొట్టికాయలు వేసి, ఆ ఎన్నికలను రద్దు చేయడం జరిగిందని హరికృష్ణ, రమణ గౌడ్, మహేష్ గుప్తా గుర్తు చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో బీసీలకు 50 శాతం ఇస్తామని చెప్పి, కనీసం 20 శాతం కూడా ఇయ్యాలేదని, ముఖ్యమంత్రి చెప్పేవన్నీ శ్రీరంగనీతులు తప్ప ఒక్కటి కూడా అమలు చేసిన దాఖలాలు లేవన్నారు. కోర్టు స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని చెబుతుందని ఆర్డినెన్స్ రూపంలో ఎన్నికల నిర్వహించే సమయంలో ఎవరైనా కోర్టుకు వెళితే స్టే ఇస్తుందని తెలిసి కూడా ఈ ఆర్డినెన్స్ నాటకం ఆడుతున్నారని వారు విమర్శించారు. ఈ సమావేశంలో టిఆర్ఎస్ పార్టీ నాయకులు మర్రి మహేందర్ రెడ్డి, సత్యనారాయణ గౌడ్ తదితరులు ఉన్నారు.

# మున్సిపాలిటీలను ఆదర్శంగా తీర్చిదిద్దడమే ప్రధాన ధ్యేయం

● ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి



**ఇబ్రహీంపట్నం, జూలై 12 (జనం సాక్షి) :** ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో అభివృద్ధి వేగవంతంగా ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి సహకారంతో అభివృద్ధి పరుగులు పెడుతోందన్నారు. శనివారం తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని మాన్నెగూడ, రాగన్నగూడ, కమ్మగూడ, రూ.8.46 కోట్ల రూపాయలతో వివిధ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డితో కలిసి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.... ప్రతి గ్రామం, పట్టణం అభివృద్ధి చెందడమే ప్రాధాన్యతగా ముందుకు పోతున్నామని తెలిపారు. తుర్కయంజాల్ మున్సిపాలిటీలో అభివృద్ధి వేగవంతంగా ముందుకు సాగుతుందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఈ ప్రాంతం అభివృద్ధికి నోచుకోలేదని విమర్శించారు. నేడు సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో మున్సిపాలిటీలు బ్రహ్మాండంగా అభివృద్ధి చెందుతున్నాయన్నారు.. మున్సిపాలిటీల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సమిష్టిగా కృషి చేయాలన్నారు. అభివృద్ధిలో ఎక్కడ కూడా రాజీపడే ప్రసక్తే లేదన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా పని చేస్తున్నట్లు వివరించారు. అభివృద్ధి పనులు ప్రజల అవసరాలను తీర్చడమే కాకుండా ప్రాంతం యొక్క ఆర్థిక, సామాజిక పురోగతికి దోహదపడతాయన్నారు. రానున్న రోజుల్లో ప్రభుత్వం నుండి అధిక నిధులు వెచ్చించి అభివృద్ధికి కృషి చేస్తామని చెప్పారు. ప్రజలకు సేవ చేయడం తమ కర్తవ్యమని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నట్లు వివరించారు. అనంతరం మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి, టీపీసీసీ కార్యదర్శి కొత్తకుర్మా శివకుమార్, టీపీసీసీ సభ్యులు కాకుమాను సునీల్, మాజీ వైస్ చైర్మన్ గుండ్లపల్లి హరిత ధనరాజ్, కమిషనర్ అమరేందర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు మర్రి మాధవి మహేందర్ రెడ్డి, కీర్తన, గుండా భాగ్యమ్మ ధనరాజ్, హరిత యాదగిరి, మేతరి అనురాధ దర్శన్, శ్యామల, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికై సీపీఐ పోరాటం

● సిపిఐ జిల్లా కార్యదర్శి కె విజయ రాములు



**అమరచింత, జూలై 12 (జనం సాక్షి) :** శనివారం పాలకుల వైఫల్యాలను ఎండగడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి సిపిఐ శ్రేణులు పోరాటం నిర్వహించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కె విజయ రాములు పిలుపునిచ్చారు. శనివారం అమరచింత మండల కేంద్రంలోని పద్మశాలి ఫంక్షన్ హాల్ లో జరిగిన సిపిఐ మండల మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ నిర్మాణం పై కార్యకర్తలతో మాట్లాడారు. గ్రామాల్లో సిపిఐ ఉద్యమాలను బలోపేతం చేసి పార్టీ నిర్మాణానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. మూడు సంవత్సరాలకు ఒకసారి జరిగే మండల మహాసభలో ఆయన పార్టీ నిర్మాణం గురించి సుదీర్ఘంగా ప్రసంగించారు. మిగతా రాజకీయ పార్టీలకు సిపిఐ కి తేడా ఉందని ఓట్ల కోసం రాజకీయం చేసే పార్టీ సిపిఐ కాదని ఆయన అన్నారు. కేంద్ర రాష్ట్ర పరిపాలనలో ప్రజలు ఎదుర్కొంటున్న కష్టాలను గుర్తించి వాటి పరిష్కారానికై సిపిఐ కృషి చేస్తుందని అన్నారు. గ్రామాలలో పార్టీని పటిష్ట చేసేందుకు సమస్యలను గుర్తించి ఉద్యమాలు చేస్తూ పార్టీ నిర్మాణాన్ని సంస్థాగతంగా పెంచాలని సిపిఐ శ్రేణులకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీ ల అమలుకు కృషి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని డిమాండ్ చేశారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం వచ్చిన ఈ 12 సంవత్సరాల కాలంలో మైనారిటీలకు దళితులకు బీసీలకు రక్షణ లేకుండా పోయిందని ఆరోపించారు. ప్రభుత్వ రంగాన్ని ప్రైవేటుపరం చేసి బిజెపి ప్రభుత్వం విదేశీ కార్పోరేట్లకు అమ్ముడుపోయిందని ఆరోపించారు. ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తుందని అన్నారు. అన్ని ప్రభుత్వ సంస్థలను ప్రైవేట్ రంగానికి అప్పజెప్పి ఈ దేశాన్ని అప్పుల పాలు చేస్తుందని ఆరోపించారు. కార్మికులకు కర్షకులకు మోడీ ప్రభుత్వం తీరని అన్యాయం చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాలుగు లేబర్ కోడ్ల ను తెచ్చి రైతులకు తీరని అన్యాయం చేసిందని అన్నారు. అంత రం సిపిఐ జిల్లా సీనియర్ నాయకులు శ్యాంసుందర్ అరుణ పతాకాన్ని ఎగరవేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి అబ్రహం పట్టణ కార్యదర్శి రవీందర్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు శ్రీహరి, టౌన్ గోపాలకృష్ణ రమేష్ కార్యదర్శి భాస్కర్ జిల్లా కార్యదర్శి ఎండి కుతుబ్ తదితరులు పాల్గొన్నారు.

## పేద ప్రజలకు వైద్యం చౌకగా అందేలా చూడాలి

● తెలంగాణ ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి




**తాండూరు, జూలై 12 (జనంసాక్షి) :** పేద ప్రజలకు వైద్యం చౌకగా అందేలా చూడాలని తెలంగాణ ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని వంశీ న్యూరో ఆసుపత్రిని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా డాక్టర్ అఖిల్‌కి శుభాకాంక్షలు తెలిపారు. పేద ప్రజలకు వైద్యం చౌకగా అందేలా చూడాలని ఆయన వారికి సూచించారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర టీపీసీసీ ప్రచార సమన్వయకర్త కరణం పురుషోత్తం రావు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ సంపత్ కుమార్, మాజీ మున్సిపల్ చైర్మన్ స్వప్న పరిమల్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ గడ్డలి పరిమళ రవీందర్, బీదర్ రాజశేఖర్, అబ్దుల్ ఖవి ,బిర్కెట్ రఘు, భగవాన్, బిసి సెల్ నాయకులు పునీత్ కుమార్, అయ్యుబ్ ఖాన్, శివానంద్ మడపతి, ఆనంద్ గౌడ్ తదితరులు ఉన్నారు.

# మహిళలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చాలి

● మహాలక్ష్మి పథకం అమలు చేయకుంటే ఉద్యమిస్తాం

● జాగృతి రాష్ట్ర అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



**కేశంపేట్, జూలై 12 (జనం సాక్షి) :** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు మహిళలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చి తీరాలని తెలంగాణ జాగృతి రాష్ట్ర అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. మండలంలోని వేముల నర్వ, కాకునూరు గ్రామాలలో ఎమ్మెల్సీ కవిత శనివారం పర్యటించారు. ఆయా గ్రామాల బీఆర్ఎస్, జాగృతి నాయకులు, అభిమానులు ఆమెకు ఘన స్వాగతం పలికారు. వేముల నర్వ గ్రామంలో జాగృతి కార్యాలయాన్ని ఎమ్మెల్సీ ప్రారంభించారు. కాకునూరు గ్రామంలో సింగిల్ విండో చైర్మన్ గంద్ర జగదీశ్వర్ గౌడ్, జాగృతి నాయకులు సీమల రమేష్ ఆధ్వర్యంలో గ్రామస్తులు, మహిళలు ఎమ్మెల్సీ కవితపై పూల వర్షం కురిపించి మంగళ హారతులు పట్టారు. అనంతరం ఆమె రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ప్రతి నెల 2 వేల 5 వందల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీకి గ్రామ మహిళల చేత పోస్ట్ కార్డులు వ్రాయించి పోస్ట్ బాక్స్‌లో వేయించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలకు అమలు కానీ హామీలను ఇచ్చి గద్దెనెక్కదని విమర్శించారు. రేవంత్ రెడ్డి రాష్ట్రంలో పాలన వదిలేసి ఢిల్లీలోనే ఎక్కువగా ఉంటాడని, అందుకే మహాలక్ష్మి పథకాన్ని అమలు చేయాలని ఆ పార్టీ అధినేత్రి సోనియాగాంధీకి పోస్ట్ కార్డ్ పంపించడం జరిగిందన్నారు. కాకునూరు గ్రామంలో 1100 మంది ఆడబిడ్డలకు ప్రతినెల 2500 చొప్పున 18 నెలల నుండి ఐదు కోట్ల రూపాయలు కాంగ్రెస్ ప్రభుత్వం బాకీ పడిందన్నారు. తమ వద్దకు వచ్చే కాంగ్రెస్ వాళ్ళను తమ హామీని నెరవేర్చాలని గ్రామ మహిళలు ప్రశ్నించాలన్నారు. కళాశాలకు వెళ్లే విద్యార్థినిలకు స్కూటీలు ఇస్తానన్న హామీ ఏమైందనన్నారు. కాకునూరు గ్రామానికి గతంలో రెండు బస్సులు వచ్చేవని కెసిఆర్ ముఖ్యమంత్రి అయ్యాక ఐదు బస్సులు వచ్చాయన్నారు. ప్రస్తుతం ఉచిత బస్సు అయ్యాక గ్రామానికి బస్సులే రావడం లేదన్నారు. బీఆర్ఎస్ పాలనలో నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ కల్యాణ లక్ష్మి పథకం ద్వారా లక్ష రూపాయలను అందించి లక్షల మంది ఆడబిడ్డల కళ్యాణం చేయించడం జరిగిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం లక్ష రూపాయలతో పాటు తులం బంగారం ఇస్తానన్న హామీ ఏమైందో చెప్పాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కెసిఆర్ ను రాజకీయంగా విమర్శిస్తూ కెసిఆర్ జపం చేయడం తప్ప మరేదీ చేయడని విమర్శించారు. గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీలలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలే ఉండి తమ పార్టీ కార్యకర్తలకే ఇండ్లను ఇస్తున్నారని ఆరోపించారు. రేషన్ షాపుల ద్వారా ఇస్తున్న సన్న బియ్యం లో 50 శాతం నూకలే ఉన్నాయని అన్నారు. ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థులు సరైన సదుపాయం లేక చనిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వలసల జిల్లా పాలమూరును అభివృద్ధి పథంలో నడిపించిన ఘనత కెసిఆర్ కే దక్కుతుందన్నారు. మహాలక్ష్మి పథకాన్ని అమలు చేయకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తామని అన్నారు. ప్రజలు తమ హామీలను నెరవేర్చుకొనేందుకు ఉద్యమించాలన్నారు. కాంగ్రెస్ పార్టీకి మరోసారి ఓటు వేస్తే మోసపోతామన్నారు. వచ్చే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఓడించి బుద్ధి చెప్పాలని ప్రజలకు కవిత పిలుపునిచ్చారు.

# స్కూల్ అసిస్టెంట్ పోస్టును జోనల్ పరిధిలోకి మార్చాలి

- 317 జీఓను సవరించాలి
- ఆల్ మేవా రాష్ట్ర అధ్యక్షుడు, షేక్ ఫరూక్ హుస్సేన్




**వనపర్తి, జూలై 12 (జనంసాక్షి) :** స్కూల్ అసిస్టెంట్ పోస్టును జోనల్ పరిధిలోకి మార్చి, ఉపాధ్యాయులకు న్యాయం చేకూర్చాలని ఆల్ మైనార్టీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ అసోసియేషన్ ఆల్ మేవా రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఫరూక్ హుసేన్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ కళాభవన్‌లో జిల్లా అధ్యక్షులు అబ్దుల్ ఖలీల్ సమావేశానికి అధ్యక్షతన జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా షేక్ ఫరూక్ హుసేన్ మాట్లాడుతూ తెరాసా పాలన ఉద్యోగస్తులకు చీకటి రోజులని, వారి పాలనలోనే ఆర్టీసీ కార్మికులు ఆత్మ హత్యలకు పాల్పడ్డారని అన్నారు. 317 జీవో తీసుకువచ్చి ఉపాధ్యాయుల జీవితాల్లో చీకట్లు మిగిల్చిందని ధ్వజమెత్తారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేపట్టిన బదిలీల వల్ల 75 శాతం మంది ఉపాధ్యాయులకు మేలు జరిగిందన్నారు. స్కూల్ అసిస్టెంట్ పోస్టును జోనల్ పోస్టుగా మారిస్తే ప్రస్తుతం వందల కిలోమీటర్ల దూరం లో పని చేస్తూ మిగిలిపోయిన ఉపాధ్యాయులందరికీ న్యాయం చేసినట్టు అవుతుందని అన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థికపరమైన సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి ఉద్యోగ జేఏసీ నాయకులతో చేసుకున్న ఒప్పందాన్ని తూ.చ .తప్పకుండా పాటించి నెలకు 700 కోట్ల రూపాయలు విడుదల చేస్తేనే సమస్య లు పరిష్కారం అవుతాయని అన్నారు.కాని తక్కువ బడ్జెట్ విడుదల చేయడం వల్ల రాష్ట్రంలో ఉన్నటు వంటి ఉద్యోగ, పెన్షనర్లు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇది ప్రభుత్వానికి సమంజసం కాదని ఆయన పేర్కొన్నారు. దీన్ని సాకుగా తీసుకొని తెరాస మాజీ ఉద్యోగ సంఘ నాయకులు తెలంగాణ భవన్ నుంచి తెలంగాణ ఉద్యోగ సంఘ నాయకులకు ఫోన్లు చేసి తమ ప్రభుత్వం వస్తుందని,తమకు మద్దతు ఇవ్వాలని కోరడము హాస్యాస్పదం అన్నారు. తెలంగాణలో ఏ ఒక్క ఉద్యోగి కూడా తెరాస ప్రభుత్వాన్ని మరొకమారు అధికారంలోకి రానివ్వడానికి స్వాగతించరని జోస్యం చెప్పారు. రానున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో సంఘ పక్షాన ఒక అభ్యర్థిని పోటీలో ఉంచాలని సంఘం ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. ఈ సమావేశంలో ఆల్ మేవా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ సయ్యద్ అబ్దుల్ వహిద్ షా ఖాద్రి, ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా ఇన్చార్జి రాష్ట్ర కోశాధికారి ఎండి రషీద్, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ షేక్ ఫరీద్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు హాబీబ్ అబ్దుల్ రెహ్మాన్, వక్ఫ్ పరిరక్షణ కమిటీ జిల్లా అధ్యక్షుడు ఎంఎ నిజాంలు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు సయ్యద్ ఖాజా నిజాముద్దీన్, ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అహ్మద్, జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు మొహమ్మద్ సయ్యద్, ఖాదర్ వలీ, సలహాదారులు మొహమ్మద్, కోశాధికారి మొహమ్మద్ ఆరిఫ్, లీగల్ అడ్వకేట్ ముహమ్మద్ వహాబ్, మహిళా కార్యదర్శి డాక్టర్ అస్మా ఫాతిమా, సలహా దారులు ముహమ్మద్ ఖయ్యూం, యూసుఫ్ బీన్ నాసర్, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి ఎం. డి అజీమ్, ఆవాస్ కమిటీ జిల్లా అధ్యక్షులు ఎండి. హయ్యూ, ప్రధాన కార్యదర్శి మహమ్మద్ సలీం, నాయకులు నజీర్, నజీముద్దీన్, నజీముల్లా అఫ్రోస్తాన్, ఎండి .రషీద్, రియాజుద్దీన్ అధిక సంఖ్యలో మైనార్టీ ఉద్యోగస్తులు పాల్గొన్నారు. అనంతరం ఇటీవల కాలిఫోర్నియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందిన డాక్టర్ ఎం డీ గౌస్ మొహియుద్దీన్ ఘనంగా సన్మానం చేశారు.

## ఆకునూరులో రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం



**చేర్యాల, జూలై 12 (జనంసాక్షి) :** రాష్ట్రంలో కుల గణన సర్వే ఆధారంగా రానున్న స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకోవడం పట్ల కాంగ్రెస్ పార్టీకి బీసీలు ఎల్లప్పుడూ రుణపడి ఉంటారని యూత్ కాంగ్రెస్ జనగామ జిల్లా ప్రధాన కార్యదర్శి అందె నానిబాబు, బీసీ భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గం ఇంచార్జి అంబటి అంజయ్య గౌడ్ లు హర్షం వ్యక్తం చేశారు. శనివారం చేర్యాల మండలం ఆకునూర్ గ్రామంలోని అంగడి బజారు వద్ద ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి ఫ్లెక్సీకి పాలాభిషేకం చేసి కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. ఏడు దశాబ్దాలకు పైగా బీసీలు ఎంతో పేదరికం, ఆకలి, నిరుద్యోగం, నయవంచన, దోపిడీకి గురయ్యారని, దేశంలో ఉన్న అన్ని రాజకీయ పార్టీలు బిసిలను రాజకీయంగా వాడుకొని పదవులలో అన్యాయం చేశారని, 2023 అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ బీసీలకు సముచిత స్థానం కల్పిస్తామని ఇచ్చిన మాటను అమలులోకి తీసుకురావడం హర్షించదగ్గ విషయమన్నారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు అమలుకు శ్రీకారం చుట్టిన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి, మంత్రివర్గానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు ఆకుల రాజు గౌడ్, రిటైర్డ్ ఉపాధ్యాయులు పందిళ్ళ నరసయ్య, కాంగ్రెస్ సీనియర్ నేతలు శేవల్ల రాజయ్య, మాజీ సర్పంచ్, వెలుగల లావణ్య రఘువీర్ ఎండి హైమద్, తాటికొండ రాములు, కోయినేని నర్సయ్య, శిగుళ్ల బాలరాజు,ఏళ్ల దామోదర్, అమరగొండ రామచంద్రయ్య,కడారి కనకయ్య, బైకని యాదయ్య, కోతి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళల జీవితాలు మారలంటే రాజ్యాధికారం అవసరం

- 2026 అసెంబ్లీ పునర్విభజనలో జహీరాబాద్ జనరల్ కాబోతుంది
- రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో పోటికి బిసీలు సిద్ధం కావాలి
- ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న



**ఝరాసంగం, జూలై 12 (జనం సాక్షి) :** 2026 అసెంబ్లీల పునర్విభజనలో భాగంగా (డిలీమీటేషన్) జహీరాబాద్ నియోజకవర్గం జనరల్ మహిళ కాబోతుందని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు. శనివారం మండల కేంద్రమైన ఝరాసంగంలోని ఆర్యవైశ్య ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన బిసీల ఐక్యత సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీసీలు పోటీ చేసేందుకు సన్నద్ధం కావాలన్నారు. చత్తీస్గఢ్ అడువుల నుంచి మహారాష్ట్ర, కర్ణాటక సరిహద్దుల వరకు ఉన్న ప్రజల కష్టాలు తెలుసుకునేందుకు తను పర్యటించడం జరిగిందన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇస్తున్నామని ముఖ్యమంత్రి ప్రకటిస్తే కల్వకుంట్ల కవిత రంగులు వేసుకోని సంబరాలు చేస్తే నవ్వుకుంటున్నారన్నారు. రైతుభరోసా కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ, 9 వేల కోట్ల అప్పు తీసుకరావడం జరిగిందని, ఇందులో బీసీల అప్పు రూ, 5,500 కోట్లన్నారు. బీసీల పై భారం మరింత మోపడం జరిగిందన్నారు. తెలంగాణలో బీసీల జీవితాలు మారాలంటే మనకు కావాల్సింది రాజాధికారమేనన్నారు. తీన్మార్ మల్లన్న అసెంబ్లీలో ప్రసంగిస్తే ఒక్కరూ కూడా మాట్లాడే శక్తి లేదన్నారు. ఎమ్మెల్సీ పదవిని వదులుకోని బీసీల కోసం పోరాటం చేస్తున్నానన్నారు. ఈ సమావేశంలో తీన్మార్ జహీరాబాద్ నియోజక వర్గ ఇంచార్జ్ నర్సింలు, ప్రవీణ్, జ్యోతిఫండ్యాల్, శంకర్, సంగన్న, నారయణ, ధన్రాజ్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

### కేతకీలో పూజలు..

దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన శ్రీ కేతకీ సంగమేశ్వర స్వామి ఆలయంలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు వేదామంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల మధ్య పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామి వారికి అభిషేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ చైర్మెన్ చంద్రశేఖర్ శాలువ, పూలమాలలతో ఘనంగా సన్మానించారు.

## కామారెడ్డి డిక్లరేషన్‌ను కప్పిపెట్టడానికే కాంగ్రెస్ డ్రామాలు

- బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలి
- కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి ఉంటే బీసీని ముఖ్యమంత్రిని చేయాలి
- బీఆర్ఎస్ నేతల డిమాండ్



**వనపర్తి, జూలై 12 (జనంసాక్షి) :** స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పిస్తామని గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్ ను కప్పిపెట్టే డ్రామాలు ఆడుతోందని బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు గట్టు యాదవ్, పట్టణ అధ్యక్షులు పలుస రమేష్ గౌడ్,జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్ ఘాటుగా విమర్శించారు.జిల్లా కేంద్రంలోని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి స్వగృహంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.స్థానిక సంస్థల ఎన్నికలలో బి. సిల ఓట్లు కొల్లగొట్టేందుకు కాంగ్రెస్ పార్టీ ఆర్డినెన్స్ అంటూ మరోసారి మోసం చేస్తుందని ,ఆర్డినెన్స్ ద్వారా 42శాతం రిజర్వేషన్లు అమలు అయ్యేటట్లు ఉంటే అసెంబ్లీ తీర్మానం చేసి కేంద్రానికి ఎందుకు పంపిందని ఎద్దేవా చేశారు.50శాతం బి.సి జనాభా దాటితే తమిళనాడు తరహాలో 9వ షెడ్యూల్లో చేర్చి రాజ్యాంగ సవరణ చేయాలని, మీ లెక్కల ప్రకారం 42శాతం రిజర్వేషన్లు ఉన్నపుడు ఎందుకు చట్టబద్ధత కల్పించడం లేదని ప్రశ్నించారు. రాజ్యాంగ సవరణ,పార్లమెంట్ ఆమోదం తర్వాతనే బి.సి. రిజర్వేషన్లు అమలు అవుతాయని తెలిసి కాంగ్రెస్ పార్టీ బి.ఆర్.ఎస్ ని బద్నాం చేయడానికి కొత్త నాటకానికి తెరలేపిందని ఆరోపించారు. కార్మిక,రైతు చట్టాలకు చట్టబద్ధత కలిపించినట్లుగానే బి.సి రిజర్వేషన్లు 42శాతానికి చట్టబద్దత కల్పించి స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఫ్పటికైనా 90శాతము స్థానిక సంస్థలలో బి.సి,ఎస్.సి,ఎస్.టి,మైనార్టీ,దళితులు ప్రాతినిధ్యం వహిస్తున్నారని, వారికి సరైన విధులు,నిధులు, కార్యాలయాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ,పార్లమెంట్ ఎన్నికల్లో కూడా 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. కామారెడ్డి డిక్లరేషన్ నుండి తప్పించుకొని బి.సి ల ఓట్లు దండుకునేందుకు కాంగ్రెస్ పార్టీ కుయుక్తులు,కుట్రలు పన్నుతోందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ మోసపూరిత విధానాల పట్ల బి.సి.నాయకులు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్,గొర్లకాపరుల జిల్లా మాజీ అధ్యక్షులు కురుమూర్తి యాదవ్, మార్క్ ఫెడ్ డైరెక్టర్ విజయ్ కుమార్, మండల పార్టీ అధ్యక్షులు వనం రాములు, వేణు యాదవ్, బొల్లెద్దుల బాలరాజు, పృథ్వీనాథ్, కర్రేస్వామి, వడ్డే.ఈశ్వర్,కడుకుంట్ల శ్రీను, జోహేబ్ హుస్సేన్,చిట్యాల రాము,టి.సురేష్, గుంటి కృష్ణ,వంశీ,మెంటేపల్లి. రామకృష్ణ, భగవంత్ యాదవ్, సవాయిగూడెం.రామకృష్ణ,తోట శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## సహకార సంఘాలతోనే రైతు రుణ సౌకర్యం

- పిఎసిఎస్ చైర్మన్ మెరుగు కృష్ణ గౌడ్



**చేర్యాల, జూలై 12 (జనంసాక్షి) :** సహకార సంస్థలు ఉత్తమ ప్రపంచాన్ని నిర్మించగలవని పిఎసిఎస్ చైర్మన్ మెరుగు కృష్ణ గౌడ్ అన్నారు. అంతర్జాతీయ సహకార దినోత్సవం సందర్భంగా శుక్రవారం పీఏసీఎస్ కార్యాలయంలో సహకార సంఘం సభ్యులు కార్యాలయం ప్రాంగణంలో మొక్కలు నాటారు. అనంతరం మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ మేరకు చైర్మన్ కృష్ణ గౌడ్ జెండాను ఎగురవేసి మాట్లాడుతూ..సహకార సంఘాల ఏర్పాటుతో రైతులకు రుణ సౌకర్యం అందుబాటులోకి వచ్చిందన్నారు. గ్రామ, మండల స్థాయిలో సంఘాల ఏర్పాటుతో వాటి పరిధిలోని బ్యాంకుల ద్వారా రుణాలు అందుతున్నాయని తెలిపారు. జీవనోపాదులను సుస్థిరంగా సహకార రంగమే ఏర్పాటు చేస్తున్నదని తెలిపారు.ఈ కార్యక్రమంలో, వైస్ చైర్మన్ వెలుగల శ్రీనివాస్,డైరెక్టర్లు కొమ్ము రవి, బుడగం జ్యోతి -మహిపాల్ రెడ్డి, కొమ్ముల బాల నర్సయ్య, రైతులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రతి కేసు దర్యాప్తును పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలి

- జిల్లా ఎస్పీ రావుల గిరిధర్



**వనపర్తి బ్యూరో, జూలై 12 (జనంసాక్షి) :** జిల్లాలో నమోదైన ప్రతి ఒక్క కేసులో నిందితులు ఎట్టి పరిస్థితుల్లో తప్పించుకోకుండా దర్యాప్తు పురోగతిపై క్షుణ్ణంగా పర్యవేక్షించాలని జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలోని పోలీసు అధికారులతో జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ పెండింగ్ కేసులపై దృశ్య సమీక్షా సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ అండర్ ఇన్వెస్టిగేషన్ లో ఉన్న గ్రేవ్, నాన్ గ్రేవ్, మిస్సింగ్ కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తును త్వరితగతిన పూర్తి చేసి బాధితులకు అండగా ఉండాలని, అండర్ ఇన్వెస్టిగేషన్ కేసులు పరిమితలిమిట్లో ఉండాలని. ఫోక్సో, ఎస్సీ ఎస్టీ, గ్రేవ్ కేసుల్లో త్వరితగతిన ఇన్వెస్టిగేషన్ పూర్తి చేసి, 60 రోజుల్లో కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయాలి. ప్రతి అధికారికి పూర్తి ఇన్వెస్టిగేషన్, స్టేషన్ మేనేజ్మెంట్ తెలిసి ఉండాలని, ప్రతిరోజు కేసులను ఆన్లైన్లో నమోదు చేయాలని సూచించారు. కేసులను అన్ని కోణాలలో ఇన్వెస్టిగేషన్ చేసి కేసు ఫైనల్ చేయాలని సూచించారు. లాంగ్ పెండింగ్ కేసులు త్వరగా చేదించాలి అని తెలిపారు. లాంగ్ పెండింగ్ కేసుల ఛేదనకు ప్రత్యేక ప్లాన్ ఆఫ్ యాక్షన్ ఉండాలని సీఐలకు సూచించారు. పోక్సో, అత్యాచార కేసులలో జిల్లా భరోసా సేవలను వినియోగించుకొని, బాధితులకు మెడికో, లీగల్ సేవలను అందిస్తూ, వీలైనంత త్వరగా ఇన్వెస్టిగేషన్ పూర్తి చేయాలని, దోషులను న్యాయస్థానం ముందు ప్రవేశపెట్టాలని అన్నారు. ఆన్లైన్ బెట్టింగ్స్, బెట్టింగ్ యాప్స్, ఆన్లైన్ మోసాలు, డ్రగ్ దుర్వినియోగం మరియు ట్రాఫిక్ రూల్స్ పై జిల్లా ప్రజలలో, విద్యాసంస్థలలో కమ్యూనిటీ పోలిసింగ్ ద్వారా అవగాహన కల్పిస్తూ ప్రజలను అప్రమత్తం చేయాలని అధికారులకు సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో డిసిఆర్బి ఎస్పై, తిరుపతి రెడ్డి, ఐటి కోర్, డిసిఆర్బి, కమ్యూనికేషన్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థుల చదువుల కోసం ఉపాధ్యాయుల కృషి




**బిజినేపల్లి, జూలై 12 (జనం సాక్షి) :** విద్యార్థుల చదువుల కోసం ఉపాధ్యాయుల కృషి ఎంతగానో ఉందని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ సుమతి అన్నారు. శనివారం మండల కేంద్రంలో గల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల లో విద్యార్థులతల్లిదండ్రుల సమావేశం ప్రిన్సిపల్ సుమతి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ. విద్యార్థుల చదువు కోసం ఉపాధ్యాయులు ఎంతోగాను కృషి చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్నటువంటి అన్ని సదుపాయాలు విద్యార్థులకు అందిస్తున్నాము అలాగే మీ వంతుగా మీయొక్క కుమారునికి మీరు కూడా ప్రోత్సహిస్తూ మీ కుమారుని పాఠశాలలో ఎప్పుడూ ఉండే విధంగా చూడాలని తల్లిదండ్రులను కోరారు. అనంతరం పేరెంట్స్ కమిటీ చైర్మన్ శంకర్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు మంచి విద్యాబుద్ధులు నేర్పుతూ సమయానికి భోజనం అందిస్తూ వాళ్ల పర్యవేక్షణలో పిల్లలు చాలా మంచిగా ఉన్నారు. అని చెప్పడం జరిగింది. ఈ సమావేశంలో విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయులు అందర్నీ అభినందించారు. చాలా మంచిగా విద్యాబుద్ధులు నేర్పిస్తున్నారు. మాకు చాలా సంతోషంగా ఉందని చెప్పారు.

## పేదల భూముల జోలికి వస్తే ఖబడ్దార్



**కొండాపూర్, జూలై 12 (జనం సాక్షి) :** పేదల భూముల జోలికొస్తే ఖబర్దార్ అని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అతిమేల మానిక్, ఎం నర్సింలు హెచ్చరించారు. శనివారం సిపిఎం కొండాపూర్ మండలం కమిటీ సమావేశం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథులుగా అతిమేల మానిక్ ఎం నర్సింలు హాజరై మాట్లాడుతూ.. కొండాపూర్ మండలంలో పేదలకు ఇచ్చిన సుమారు 657 ఎకరాలు అసైన్మెంట్ భూములను పరిశ్రమల కోసం టిజీఐఐసీ పేరుతో బలవంతంగా లాక్కోవడం దారుణమన్నారు. మునిదేవునిపల్లి గ్రామంలోని 92, 112,154 సర్వే నంబర్ లలో గల 293 ఎకరాలు, మాందాపూర్ గ్రామంలోని 22 సర్వే నంబర్ లోని 321 ఎకరాలు, అలియాబాద్ తొగరపల్లి గ్రామాలలో 43 ఎకరాలు మొత్తంగా 657 ఎకరాల భూములను ఎస్సీ, బీసీలకు చెందిన నిరుపేద రైతుల నుండి పరిశ్రమల పేరుతో ప్రభుత్వం గుంజుకుంటుందన్నారు. ఇదే పరిస్థితి జిల్లాలోని కంది మండలం చేర్యాల 120 ఎకరాలు సదాశివపేట మండలం ఆరూర్ గ్రామంలో 193.14 ఎకరాలు గుమ్మడిదల 125 ఎకరాలు జిల్లాలో సుమారు 1100 ఎకరాలు పేదల భూములను ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. టిఆర్ఎస్ ప్రభుత్వం భూములు గుంజుకుంటుంది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినాక ఆ భూముల్ని తిరిగి పేదలకు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చింది. ఇప్పుడు పేదల భూములను బలవంతంగా గుంజుకుంటుందని పాలక పార్టీలు అధికారం అప్పుడు ఒక మాట అధికారంలో ఉంటే ఒక మాట అనే విధంగా ప్రజలను మోసం చేస్తున్నాయన్నారు. పేద ప్రజల భూముల జోలికి వస్తే పోరాటాం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి కూరాకుల రాజయ్య, మండల కమిటీ సభ్యులు బాబురావు, ఆసిఫ్ ప్రవీణ్, మహిపాల్ రెడ్డి, అమూర్తమ్మ, పుల్లయ్య , కిషన్, తదితరులు పాల్గొన్నారు.

# దేశానికి ఆదర్శం తెలంగాణ ప్రభుత్వం

- పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి



**నారాయణఖేడ్, జూలై 12 (జనం సాక్షి) :** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక సీట్లు ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకే కేటాయిస్తామని, దేశానికి ఆదర్శం తెలంగాణ ప్రభుత్వమని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి, జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ శెట్కర్, స్థానిక ఎమ్మెల్యే పట్లోళ్ల డాక్టర్ సంజీవరెడ్డి, టీజీఐఐసి చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి అన్నారు. శనివారం నారాయణఖేడ్ పట్టణంలోని సాయిబాబా ఫంక్షన్ హాల్ లో నారాయణఖేడ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం స్థానిక ఎమ్మెల్యే పట్లోళ్ల డాక్టర్ సంజీవరెడ్డి ఆధ్వర్యంలో నాయకుల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డికి కాంగ్రెస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. గత పది సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీ అధికారంలో లేకున్నా పార్టీ కోసం ఎంతో కష్టపడి గెలిపించారన్నారు. ఎప్పుడు స్థానిక ఎన్నికల్లో ఎంపిటీసీలు, ఎంపీపీలు, జెడ్పిటిసిలు గెలిపించుకునే బాధ్యత మాది అన్నారు. ఎంపీ, ఎమ్మెల్యే ఎన్నికల్లో ఎలాగైతే కష్టపడి పని చేశారో ఇప్పుడు కూడా స్థానిక సంస్థల ఎన్నికలకు కలిసికట్టుగా ఉంటే సైనికుల పని చేయాలన్నారు. గుజరాత్, హర్యానా తరహాలో మాడల్ సామాజిక న్యాయం పాటిస్తూ ఎస్సి, ఎస్టీ మైనారిటీ బిసి యువతకు పార్టీ పదవుల్లో పెద్దపీట వేస్తున్నామని అన్నారు. ఎంపీ సురేష్ కుమార్ శెట్కర్ మాట్లాడుతూ...కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయి నుంచి సంస్థగతంగా అభివృద్ధి చేయడం కొరకు ప్రత్యేక కార్యచరణ రూపొందించమని దీనికోసం పార్టీలో మొదటి నుంచి కీలకంగా పని చేస్తున్న కిందిస్థాయి కార్యకర్తల నుంచి పై స్థాయి నాయకుల వరకు వారి సేవలను గుర్తించి ప్రాధాన్యత ఇస్తూ కమిటీలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కుల గణన నలో తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలిచిందని, తెలంగాణ అభివృద్ధి మీద రాహుల్ గాంధీ సంతృప్తిగా ఉన్నారని ఆయన అన్నారు. ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడుతూ.. ప్రతి పేదవాడికి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రతి సంక్షేమం పథకాన్ని అందిస్తున్నామన్నారు. కొత్త పథకాలు అమలు చెయ్యాలన్న, అది కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు. జనాభా దామాషా ప్రకారం బీసీలకు సమాన వాటా దక్కాలని లక్ష్యంగా రాజకీయంగా బీసీలు ఎదగాలని ఆకాంక్షతో ముందుకెళ్తున్నామని అన్నారు. కార్యక్రమంలో డిసిసి ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల చంద్రశేఖర్ రెడ్డి, రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రాకేష్ షెట్కర్ , జిల్లా కాంగ్రెస్ నాయకులు పట్లోళ్ల సుధాకర్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు భోజిరెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంద్ స్వరూప షెట్కర్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ దారం శంకర్ సెట్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షు తహేర్ అలీ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# బాసర క్షేత్రాన్ని ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తాం

**మంత్రులు కొండా సురేఖ, వివేక్ వెంకటస్వామి**

**ముధోల్, జులై 12 (జనంసాక్షి) :** త్రిశక్తులు వెలసిన పవిత్ర బాసర క్షేత్రాన్ని దేశవ్యాప్తంగా గుర్తింపు పొందేలా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర దేవాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. శనివారం బాసరలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించిన మంత్రి, బాసర సరస్వతి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా బాసర చేరుకున్న మంత్రులకు ట్రిబుల్ ఐటీ హెలిప్యాడ్ వద్ద జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకి షర్మిల పూల మొక్కలను అందించి స్వాగతం పలికారు.అనంతరం బాసర శ్రీ సరస్వతి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన మంత్రులకు ఆలయ అధికారులు పూర్ణకుంభంతో స్వాగత పలికి అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేసి, ఘనంగా సత్కరించారు.టిటిడి ఆధ్వర్యంలో రూ.9.30 కోట్ల వ్యయంతో మరమ్మత్తులు, నిర్మించిన 100 గదుల ధార్మిక వసతి గృహాలను మంత్రులు కొండా సురేఖ, కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి సంయుక్తంగా ప్రారంభించారు. అలాగే రూ.3.48 కోట్లతో నిర్మించిన కార్యనిర్వాహణ అధికారి (ఈవో) కార్యాలయ నూతన భవనాన్ని ప్రారంభించారు. అనంతరం మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, బాసర పుణ్యక్షేత్రాన్ని యాదాద్రి తరహాలో అభివృద్ధి చేయడానికి చర్యలు చేపట్టామని, భక్తుల అవసరాలకు అనుగుణంగా మరుగుదొడ్లు, ఇతర వసతుల కోసం రూ.40 లక్షలు, అదనంగా రూ.1 కోటి మంజూరయ్యాయని పేర్కొన్నారు. వ్యాస మహర్షి తపస్సు చేసిన ఈ ప్రాంతాన్ని ఆధ్యాత్మికతతో పాటు పర్యాటక హబ్ గా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. తెలుగు రాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక తదితర ప్రాంతాల నుంచి భారీగా భక్తులు బాసరకు వస్తున్న నేపథ్యంలో వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని వసతులు కల్పిస్తామని వివరించారు. ఈ సంవత్సరం సమ్మక్క-సారలమ్మ జాతరను ఘనంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే రానున్న కృష్ణా, గోదావరి పుష్కరాల కోసం పూర్తి స్థాయిలో అభివృద్ధి పనులు, భద్రతా ఏర్పాట్లకు నిధుల కేటాయింపుతో ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. త్వరలోనే ఆలయానికి రెగ్యులర్ ఈవోను, అవసరమైన సిబ్బందిని నియమించనున్నట్లు వెల్లడించారు. గోదావరి పుష్కర ఘాట్లలో ప్రమాదాలు జరగకుండా అన్ని భద్రతా చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ, బాసర పుణ్యక్షేత్రాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం



పటిష్టమైన చర్యలు తీసుకుంటోందని తెలిపారు. రైతు భరోసా, సన్నబియ్యం, నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇండ్ల మంజూరు, వంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని వెల్లడించారు. విద్యా రంగంలో పురోగతికి ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 10వేల ప్రభుత్వ ఉపాధ్యాయులని నియమించామని వెల్లడించారు. కార్మికుల సంక్షేమం దృష్టిలో ఉంచుకుని, ఉద్యోగ భద్రత, మినిమమ్ వేజెస్ అందించేలా చర్యలు చేపడతామని, అందుకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని మంత్రి తెలిపారు. విద్య, ఉపాధి, వైద్య రంగాలకు అధిక నిధులు మంజూరు చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఆ దిశగా చర్యలు కొనసాగుతున్నాయని వెల్లడించారు.బాసర ఆలయాన్ని ఆధునిక సౌకర్యాలతో ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ఆలయ అభివృద్ధి ప్రణాళికలపై మంత్రులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, అమ్మవారి దేవాలయాన్ని మరింత వైభవంగా తీర్చిదిద్దడం, శాస్త్రీయ వాస్తు ప్రమాణాలకు అనుగుణంగా ఆలయ నిర్మాణం జరగడం, భక్తుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని విశాలమైన క్యూలైన్ కాంప్లెక్స్, మరిన్ని వసతి గృహాలు నిర్మించడం, తాగునీరు, మరుగుదొడ్లు, పార్కింగ్ వంటి మౌలిక సదుపాయాలను విస్తరించడం ప్రణాళికలో భాగంగా ఉన్నాయని చెప్పారు. పర్యావరణాన్ని దృష్టిలో ఉంచుకొని పచ్చదనం పెంపొందింపు, పుష్కరిణి పునరుద్ధరణ, సౌర విద్యుత్ ఆధారిత విద్యుత్ వ్యవస్థ, సాంకేతికత వినియోగంతో సీసీ కెమెరాలు, డిజిటల్ డిస్ప్లేలు, ధార్మిక విద్య ప్రదర్శనలు వంటి ఏర్పాట్లు చేపడతామని తెలిపారు. ప్రజల అభిప్రాయాలు, పండితులు, పురోహితుల సూచనలతో సమన్వయం చేస్తూ ఈ అభివృద్ధిని సమగ్రంగా కొనసాగిస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాలలో ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు గోడం నగేష్, ముధోల్ శాసనసభ్యులు పవార్ రామారావు పటేల్, మాజీ ఎమ్మెల్యే విట్టల్ రెడ్డి, సీనియర్ నాయకులు నారాయణరావు పటేల్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్ రావు పటేల్, అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, ఆర్డిఓ రత్న కళ్యాణి, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## తీపి కబురు చెబుతారనుకుంటే తాపీగా వాయిదా వేశారు

**అడుక్కోని ఐన సరే ఆలయాన్ని అభివృద్ధి చేస్తా : ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్**

**బాసర, జూలై 12 (జనంసాక్షి) :** నిర్మల్ జిల్లా బాసరలో చదువుల తల్లి శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మ వారి ఆలయాన్ని అభివృద్ధి పరచడానికి ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ దేవాదాయ శాఖ మంత్రి సాక్షిగా ఆవేదనకు లోనయ్యారు. సరస్వతి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో పరిపాలన భవనం, టీటీడీ భవన ప్రారంభోత్సవానికి శనివారం బాసరకు వచ్చిన దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకట స్వామి విలేకరుల సమక్షంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే రామారావు పటేల్ ఆవేదన వ్యక్తం చేశారు.తీపి కబురు చెబుతుందనుకున్న మా అక్క (కొండ సురేఖ) అభివృద్ధి మాస్టర్ ప్లాన్ ను మళ్లీ వాయిదా వేయడం పై సభ ముఖంగా అసంపూర్తి లోనైనట్లు తెలిపారు. ఎన్నోసార్లు రాష్ట్ర సచివాలయంలో మంత్రులకు అభివృద్ధి పై వినతిపత్రాలు అందజేశామని ఇక తమకు ఓపిక లేదని తేల్చి చెప్పారు.దసరా లోపు అభివృద్ధిపనులు మొదలు కాకపోతేఅడుక్కోనయనా సరే బాసర ఆలయ అభివృద్ధిని మొదలు పెడతామని తెలిపారు. ప్రభుత్వం నిధులు సమకూర్చకపోతే ఎందరో దాతలు ఉన్నారని కనీసం వాళ్ళకైన అవకాశం కల్పించాలని కోరారు. బాసర ఆలయ అభివృద్ధి పనులు త్వరలో ప్రారంభించకపోతే నిరహార దీక్షకైన సిద్ధమని ఈ సందర్భంగా మంత్రికి తెలిపారు.

## సోమనాథుని స్మృతివనాన్ని వినియోగంలోకి తేవాలి

**ప్రభుత్వం ఆదికవిని ఆదరించాలని బీజేపీ నాయకుల డిమాండ్**



**పాలకుర్తి, జూలై 12 (జనంసాక్షి) :** తొలి తెలుగు విప్లవ కవి, పాల్కూరికి సోమనాధుడు స్మృతివనాన్ని వెంటనే వినియోగంలోకి తీసుకురావాలని భారతీయ జనతాపార్టీ మండల జిల్లా నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఆ పార్టీ జిల్లా నాయకుడు కమ్మగాని శ్రీకాంత్, మాజీ మండల అధ్యక్షుడు దుంపల సంపత్, మండల అధ్యక్షుడు మారం రవికుమార్ బృందం సభ్యులు సోమనాధుడు స్మృతివనంతో పాటు నిర్మించిన గదులను కూడా సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం ఈ ప్రాంత కవులు, రచయితల కోసం నిర్మాణం చేపడితే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టింపు లేదన్నారు. ఈ ప్రాంతానికి చెందిన వర్తమాన కవులను తయారు చేయడానికి, కవి సమ్మేళనాలను ఏర్పాటు చేయడానికి అదికవి పాల్కూరికి పేరుతో నిర్మించిన స్మృతి వనం అలనా, పాలన లేక అధ్వాన్నంగా తయారైందని విమర్శించారు. స్మృతినవం గదుల్లో మందు సీసాలు, సిగరేట్ డబ్బలు, పగిలిన సీపాలు, పేడతో దర్శనమిస్తుందని విమర్శించారు. తక్షణమే జిల్లా కలెక్టర్ రిజ్వాన్భాషేక్ స్మృతి వనాన్ని సందర్శించి, దీనిని వినియోగంలోకి తీసుకువచ్చి పరిరక్షించాలని కోరారు.ఈ కార్యక్రమంలో వేల్పుల దేవరాజ్, పబ్బ సంతోష్, మచ్చ సునిల్, కేరళ కర్ణాకర్, శ్రీనివాస్ ఉన్నారు.

# ఉపాధి అవకాశాల కోసం నిరంతరం కృషి చేస్తా

**భూక్య జాన్సన్ నాయక్**

**ఖానాపూర్ జూలై 12 (జనం సాక్షి) :** స్వలాభాల కోసం తపన పడుతున్న ఆధునిక ప్రపంచంలో నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని సంకల్పించడం ఎంతో అభినందనీయమని అసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మీ అన్నారు. శనివారం బి ఆర్ ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి భూక్య ఝాన్సన్ నాయక్ ఆధ్వర్యంలో నియోజకవర్గ కేంద్రంలోని ఈఎంకే ఫంక్షన్ ప్లాజాలో ఏర్పాటుచేసిన మెగా జాబ్ మేళా కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆమె నిరుద్యోగులను ఉద్దేశించి మాట్లాడారు. ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయినంత మాత్రాన ప్రజలను మరిచిపోకుండా అక్కున చేర్చుకొని అవకాశాలు కల్పిస్తున్న జాన్సన్ తీరు ఎంతో హర్షినియమన్నారు. ఇలాంటి ఆలోచనలు రావడం యువతను ప్రోత్సహించడం శుభ పరిణామం అని అన్నారు. అలాగే నిరుద్యోగ యువతీ యువకులు వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని భవిష్యత్తులో రాణించాలని అన్నారు. వేలాదిగా తరలివచ్చిన యువతకు ఆమె అభినందనలు తెలిపారు. బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ ఇలాంటి జాబ్ మేళా బోథ్ నియోజకవర్గం లో కూడా నిర్వహిస్తామని అన్నారు. అందరికీ ఆదర్శంగా నిలుస్తున్న ఝాన్సన్ నాయక్ తీరును ఆయన అభినందించారు. అనంతరం మెగా జాబ్ మేళా నిర్వహించిన జాన్సన్ నాయక్ యువతను ఉద్దేశించి



మాట్లాడారు. యువత ఎంతో నిరుత్సాహంతో ఉన్నారని ఉద్యోగ అవకాశాలు కల్పించి వారిలో ఉత్తేజాన్ని నింపడమే తన లక్ష్యం అని అన్నారు. నిరుద్యోగులకు అవకాశాలు కల్పించడం కోసం నిరంతరం కృషి చేస్తానని అన్నారు. ఎన్నికల సమయంలో తట్టిన ఆలోచనను ఇప్పుడు ఆచరణలో పెడుతున్నానని అన్నారు. 20 సంవత్సరాల కాలంగా ఎంప్లాయిమెంట్ ఏజెన్సీ కంపెనీని అమెరికాలో ఏర్పాటు చేశానని అన్నారు. కేటీఆర్ సహకారంతో మరిన్ని ఉద్యోగ అవకాశాలు నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతకు కల్పించే ఏర్పాటు చేస్తానని అన్నారు. రాజకీయాలకు అతీతంగా ఎలాంటి లాభాపేక్ష లేకుండా నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తానని అన్నారు. అందరి ఆదరణ ఇలాగే కొనసాగాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా శ్రేణులు, తదితరులు పాల్గొన్నారు.

## దొడ్డా మల్లికార్జున్‌కు తెలుగు వెలుగు మహానంది జాతీయ పురస్కారం

**రంగస్థల పద్యనాటక కళారంగంలో విశిష్ట కళకు గౌరవం**



**టేకుమట్ల జూలై 12 (జనంసాక్షి) :** తెలుగు సాహిత్యం, నాటకరంగ అభివృద్ధికి అత్యున్నత స్థాయిలో కృషి చేసిన ప్రముఖులు అందుకునే తెలుగు వెలుగు మహానంది జాతీయ పురస్కారం - 2025ను ఈ సంవత్సరం భూపాల పల్లి జిల్లా టేకుమట్ల మండలం ఆశిరెడ్డిపల్లి గ్రామనికి చెందిన రంగస్థల పద్యనాటక కళాకారుడు దొడ్డా మల్లికార్జున్ అందుకున్నారు. తెలుగు వెలుగు సాహితీ వేదిక ఆధ్వర్యంలో ప్రతి ఏడాదీ దేశవ్యాప్తంగా వివిధ కళారంగాలలో విశేష కృషి చేసిన సృజనశీలులను గుర్తించి, ఈ జాతీయ స్థాయి పురస్కారాన్ని అందజేస్తూ వస్తోంది. దొడ్డా మల్లికార్జున్ పద్యనాటక రంగంలో చేస్తున్న కృషి అనిర్వచనీయమని, పద్య నాటకాలకు నూతనోత్తేజం కలిగించడంలో ఆయన పాత్ర ప్రత్యేకమైనదని వేదిక నిర్వాహకులు తెలిపారు. అనేక పద్యనాటకాలను ప్రదర్శించడం, నటనలో గాఢతను కలిగించడం ద్వారా ఆయన ఈ కళారంగాన్ని మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లారు. పురస్కారం ప్రదానోత్సవం హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించబడింది. సాహితీవేత్తలు, కళాకారులు, విశిష్ట అతిథులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో మల్లికార్జున్‌కు సన్మానపూర్వకంగా బహుమతి, జ్ఞాపిక, ప్రశంసాపత్రాన్ని అందజేశారు. ఈ పురస్కారంతో పద్యనాటక కళారంగంలో మల్లికార్జున్ కృషికి మరింత గుర్తింపు లభించినట్టు వేదిక నిర్వాహకులు పేర్కొన్నారు.

## ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదగడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

**పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నాం : ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి**



**వరంగల్ ప్రతినిధి, జులై 12 (జనం సాక్షి):** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పార్టీలకతీతంగా పేద ప్రజల సంక్షేమమే ధ్యయంగా, సంక్షేమ పథకాలు అమలు చేస్తూ గ్రామీణ ప్రాంతం పేదలు నిరుపేదలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు. శనివారం వరంగల్ జిల్లా సంగెం మండల కేంద్రంలోని రైతు వేదికలో 17వ డివిజన్ మరియు సంగెం మండల పరిధిలోని అర్హులైన లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పంపిణీ చేశారు. సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి మాట్లాడుతూ...ఇప్పటివరకు15 విడతలుగా సంగెం మండలం లోని 401 మందికి 1కోటి 32 లక్షల 41 వేల 500 రూ ఆర్థిక సహాయాన్ని అందజేశామన్నారు. పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామని అన్నారు. మూడు పవిత్రమైన కార్యక్రమాలు సీఎంఆర్ఎఫ్, కళ్యాణ లక్ష్మి, ఇందిరమ్మ ఇండ్ల ను తీసుకున్నామన్నారు. బడుగు బలహీన వర్గాల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందని, సీఎంఆర్ఎఫ్ ద్వారా ఎందరో నిరుపేదల ప్రాణాలు నిలబడుతున్నాయన్నారు. సోషల్ మీడియా ద్వారా బిఆర్ఎస్, బిజెపి నాయకుల అసత్యపు ప్రచారాలను త్రిప్పి కొట్టాలని అన్నారు. ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదగడమే తమ ప్రభుత్వ లక్ష్యం అన్నారు.ఈనెల 14వ తేదీన రేషన్ కార్డులను పంపిణీ చేయబోతున్నామని, అర్హులైన ప్రతివారికి రేషన్ కార్డులను పంపిణీ చేస్తామన్నారు. రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేయడం లక్ష్యంగా ప్రతి గ్రామానికి ఒక అధికారిని,మండలంలోని భూ విస్తీర్ణం ఆధారంగా సర్వేయర్లను నియమించబోతున్నామన్నారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడం కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ చారిత్రాత్మక నిర్ణయం అన్నారు. రైతులకు సకాలంలో యూరియా అందేలా చర్యలు తీసుకుంటున్నామని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.200 యూనిట్ల ఉచిత కరెంట్, 500 రూ గ్యాస్ సిలిండర్, రైతు రుణమాఫీ, ఇందిరమ్మ ఇల్లు, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, డైట్ చార్జీల పెంపు తదితర సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నమన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు అధికారులు పాల్గొన్నారు.

## ఓసిపిలో క్యాంటీన్ సమస్యలు వెంటనే తీర్చాలి



**శ్రీరాంపూర్ (జనంసాక్షి) :** శ్రీరాంపూర్ ఏరియా ఎస్ఆర్పి ఓసిపి లో క్యాంటీన్ లో ఉన్న సమస్యలు,భోజన వసతులు ,టీ పౌడర్ కి బదులు పాల పాకెట్ లతో చేసిన టీ మాత్రమే ఉద్యోగులకు అందించాలని, పలు సమస్యలపై గుర్తింపు సంఘం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శ్రీరాంపూర్ బ్రాంచ్ సెక్రెటరీ బాజీసైదా,మేనేజర్ ఐ.శ్రీనివాస్ కి శనివారం మెమొరాండం ఇవ్వడం జరిగింది.మేనేజర్ సానుకూలంగా స్పందించి త్వరలోనే పరిష్కరిస్తానని హామి ఇచ్చారని ఏఐటీయూసీ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ సంయుక్త కార్యదర్శి రాచర్ల చంద్రమోహన్, పిట్ కార్యదర్శి నల్లపు సత్తయ్య, ట్రేడ్స్మెన్ కమిటీ మెంబర్ నాగభూషణం,యూనియన్ కార్యకర్తలు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## రెండో శనివారం సెలవు టీచర్ల హక్కు

**టీపీటీఎల్ఎఫ్, డివైఎఫ్ఐ టీచర్లకు సెలవు ఇవ్వకపోతున్న చోద్యంచూస్తున్న విద్యాశాఖ**

**టీపీటీఎల్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఏ విజయ్ కుమార్**




**హైదరాబాద్ (జనంసాక్షి) :** రెండో శనివారం సెలవులు పొందడం అనేది టీచర్ల హక్కు అని తెలంగాణ ప్రైవేట్ టీచర్స్ లెక్చరర్స్ ఫెడరేషన్ (టీపీటీఎల్ఎఫ్), భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) సంఘాల ఆధ్వర్యంలో హైదరాబాద్ మరియు జిల్లాల్లో విద్యాసంస్థల టీచర్స్ లెక్చరర్స్ కి సెలవు ఇప్పించడం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు ఏ. విజయ్ కుమార్ మాట్లాడుతూ ఈరోజు విద్యా సంస్థలలో టీచింగ్ ఫ్యాకల్టీ కి సెలవులు ఇవ్వడం అనేది విద్యా సంస్థలు ఇస్తున్న బిక్ష కాదు అది హక్కు అని ఆయన అన్నారు. ప్రతి నెల రెండవ శనివారం విద్యాసంస్థలు విద్యార్థులకు, టీచర్స్‌కి సెలవు ఇవ్వాల్సి ఉండగా ఇవ్వకుండా టీచర్స్ సెలవులను విద్యా సంస్థల యాజమాన్యాలు లాక్కుంటున్నా యని, వారి శ్రమను అదనంగా దోచుకుంటూ మరింత దోపిడీ చేస్తున్నాయని అన్నారు. ప్రైవేట్ విద్యాసంస్థలలో పని చేస్తున్న టీచింగ్ ఫ్యాకల్టీ రోజులో ఏమాత్రం ఖాళీ లేకుండా ఎనిమిది నుండి పది క్లాసులు విద్యార్థులకు బోధిస్తూ, హెూమ్ వర్క్ ఇస్తూ, కరెక్షన్ చేస్తూ, ఎగ్జామ్ పేపర్స్ తయారు చేస్తూ, పరీక్ష అయ్యాక దిద్దుతూ బిజీ గా ఉంటారు. మద్యలో పీరియడ్స్ ఖాళీ ఉండ నీయకుండా ప్రైవేట్ విద్యా సంస్థలు పకడ్బందీ ప్లాన్ చేసుకొని పని చేయించుకుం టారు. అలాగే వివిధ పిల్లల మానసిక స్థితులు గమనిస్తూ వారికి తర్ఫీదు నిస్తూ వారి ఎదుగుదలకు కృషి చేసి గమ్యం గమనం చూపుతున్న టీచర్స్ బాధలు ఎవరు పట్టించుకోరు.

వత్తిడితో మానసికంగా కృంగి పోయే పరిస్థితిలో పాఠాలు చెబుతున్నారు. వత్తిడిని అధిగమించడానికి అవకాశం ఉన్న సెలవుల్లో కూడా మళ్లీ విద్యా సంస్థకు రమ్మని చెప్పి, చిన్న చిన్న పనులుంటే చేసుకోమనే పేరుతో, పిటిఎంల పేరుతో సెలవు ఇవ్వకపోవడం అన్యాయమని ఆయన అన్నారు. అందుకే టీచింగ్ స్టాఫ్ కి సెలవు అనేది తప్పని సరిగా ఇవ్వాలని ఆయన విద్యా సంస్థలను డిమాండ్ చేశారు. అలాగే విద్యాశాఖ అధికారులు కూడా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహారం చేయడం సిగ్గు చేటు. ముందు నుండే సంఘం హెచ్చరిస్తున్నా చోద్యం చూడటమేమిటని ఆయన అన్నారు. ప్రతీ శనివారం సెలవు విద్యా సంస్థలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని టీపీటీఎల్ఎఫ్, డివైఎఫ్ఐ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈరోజు విద్యా సంస్థల బంద్ లో రాష్ట్ర ఉపాధ్యక్షులు కొమ్ము విజయ్ కుమార్, పి.విజయ్, డివైఎఫ్ఐ జిల్లా నాయకులు రాజు తదితరులు పాల్గొన్నారు.

# డిప్యూటీ సీఎం, మంత్రుల పర్యటనను విజయవంతం చేయండి

**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**మంచిర్యాల ప్రతినిధి జూలై 12 (జనంసాక్షి) :** మంచిర్యాల జిల్లాలో నేడు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర ఆబ్కారీ-మద్యనిషేధ, పర్యాటక, సాంస్కతిక శాఖ మంత్రి-జిల్లా ఇన్చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ, శాస్త్ర సాంకేతిక శాఖ మంత్రి దామోదర రాజనరసింహ ల పర్యటనను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం మంచిర్యాల జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో డి.సి.పి. ఎ. భాస్కర్ తో కలిసి అన్ని శాఖల జిల్లా అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ...జిల్లాలో 13వ తేది ఆదివారం రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, రాష్ట్ర మంత్రులు పర్యటించను న్నారని, అధికారులు పూర్తి ఏర్పాట్లతో సిద్దంగా ఉండాలని తెలిపారు. ఈ నెల 13వ తేదీన 11.10 గంటలకు లక్షెట్టిపేట మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభిస్తారని, మధ్యాహ్నం 12 గం?లకు అధికారులు, అనధికారులతో సమావేశమై 12.10 గం?లకు ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడి వారితో కలిసి భోజనం చేస్తారని, మధ్యాహ్నం 2 గం?లకు దండేపల్లి మండలం రెబ్బెనపల్లి గ్రామంలో ఇందిరా మహిళా శక్తి సోలార్ ప్రాజెక్టు (పైలెట్ ప్రాజెక్టు)కు శంఖుస్థాపన చేసి, బహిరంగ సభలో పాల్గొంటారని 3.15 గంటలకు హాజీపూర్ మండలం గుడిపేటలోని ప్రభుత్వ వైద్య కళాశాలను సందర్శిస్తారని తెలిపారు. సాయంత్రం 4 గం?లకు హాజీపూర్ మండలం వేంపల్లిలో ఇండస్ట్రియల్ పార్క్



శంఖుస్థాపన చేసి ప్రజలతో మాట్లాడతారని తెలిపారు. 4.15 గంటలకు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి, ప్రభుత్వ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, మాత శిశు కేంద్రాన్ని సందర్శిస్తారని తెలిపారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణ, ప్రముఖుల బందోబస్తు ఏర్పాట్లు, మంచిర్యాల రాజస్వ మండల అధికారి కార్యక్రమాలను పర్యవేక్షించాలని, జిల్లా పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో రహదారులు, గ్రామీణ రహదారుల మరమ్మత్తులు, రోడ్లు భవనాల శాఖ ఆధ్వర్యంలో ప్రధాన రహదారుల అభివృద్ధి, వేదిక, మైక్ ఏర్పాట్లు చేయాలని తెలిపారు. టి.జి.ఎం.ఐ.డి.సి. ఆధ్వర్యంలో నిర్మాణ పనుల పర్యవేక్షణ, అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన, టి.జి.ఐ.ఐ.సి. జోన్ మేనేజర్ పరిశ్రమల సమన్వయం, పారిశ్రామిక మౌలిక సదుపాయాలు, శంకుస్థాపన సంబంధిత ఏర్పాట్లు, హాజీపూర్, లక్షెట్టిపేట, దండేపల్లి మండలాల తహసిల్దార్లు బృందంగా పని చేసి వాహనాల పార్కింగ్ స్థలంలో ఇబ్బందులు లేకుండా చూడాలని, ఆయా మండలాల మండల పరిషత్ అభివృద్ధి అధికారులు 15 నుండి 30 వరకు నీటి ట్యాంకర్లను అందుబాటులో ఉంచాలని తెలిపారు. అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో ఎలాంటి అగ్ని ప్రమాదాలకు తావు లేకుండా ముందస్తు ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని, అగ్ని నిరోధకాలు, ఫైర్ ఇంజన్లను అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. ఆబ్కారీ -మద్య నిషేధ శాఖ ఆధ్వర్యంలో నిబంధనలను అమలు చేయాలని, పంచాయతీ శాఖ ఆధ్వర్యంలో పారిశుద్యం, మౌలిక సదుపాయాల కల్పన, వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్యులు, సిబ్బంది నిర్ణయించి వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, 2 అంబులెన్సులను కార్యక్రమం వద్ద అందుబాటులో ఉంచాలని, కార్డియాలజీ నిపుణునితో కూడిన ఒక అంబులెన్స్ ను కాన్వాయ్ లో ఉంచాలని, రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్త నిధి కేంద్రంలో రక్త నిల్వలను అందుబాటులో ఉంచాలని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రులను పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో విద్యా సంస్థలలో చదువుతున్న విద్యార్థులను కార్యక్రమంలో భాగస్వామ్యులను చేయాలని, వారికి అవసరమైన భోజన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఆహార భద్రత శాఖ ఆధ్వర్యంలో ఆహార నాణ్యత పరిశీలన, గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో గ్రామీణ పథకాలు, వసతులను సమీక్షించాలని, పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో మీడియా ప్రతినిధుల సమన్వయం, విస్తృత ప్రచారం చేయాలని, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నగర ప్రాంత శుభ్రత, అభివృద్ధి పనుల నిర్వహణ అంశాలను పర్యవేక్షించాలని తెలిపారు. విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో నిరంతర విద్యుత్ సరఫరా, లైట్ల నిర్వహణ, రవాణా శాఖ ఆధ్వర్యంలో ప్రముఖుల వాహనాల ఏర్పాటు, ట్రాఫిక్ రూట్ మ్యాప్ రూపొందించాలని తెలిపారు. అధికారులు వారికి కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వహించి రాష్ట్ర పర్యటనను విజయవంతం చేయాలని తెలిపారు.

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
13 జూలై 2025

# శేరిలింగంపల్లి సమగ్ర అభివృద్ధే లక్ష్యం

- రాష్ట్ర ప్రజాపద్దుల కమిటీ చైర్మన్ అరికెపూడి గాంధీ


**శేరిలింగంపల్లి, జూలై 12 (జనంసాక్షి) :** శేరిలింగంపల్లి నియోజకవర్గ సమగ్ర, సంతులిత అభివృద్ధే తన ప్రధాన ధ్యేయమని, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా తాను ముందుకు సాగుతున్నానని రాష్ట్ర ప్రజాపద్దుల కమిటీ చైర్మన్ అరికెపూడి గాంధీ స్పష్టం చేశారు. ఈ మేరకు నియోజకవర్గ పరిధిలోని ఆయా ప్రాంతాలలో 2 కోట్ల 15 లక్షల 50 వేల రూపాయల నిధుల అంచనా వ్యయంతో ప్రభుత్వం చేపట్టనున్న భూగర్భ డ్రైనేజీ, మంచినీటి పైప్ లైన్ నిర్మాణపు పనులకు ఆయా డివిజన్ల కార్పొరేటర్లతో కలిసి శనివారం ఆయా డివిజన్ల కార్పొరేటర్లతో కలిసి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని శంకుస్థాపనలు గావించారు. మియాపూర్ డివిజన్ పరిధి నాగార్జున ఎంక్లేవ్ కాలనీలో ఎస్డిఎఫ్ నిధుల కింద 50 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న మంచినీటి పైప్లైన్ నిర్మాణపు పనులకు మియాపూర్ డివిజన్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ తో కలిసి, చందానగర్ డివిజన్ పరిధి వేముకుంట, ఇందిరానగర్, సురక్ష ఎంక్లేవ్, శంకర్ నగర్ కాలనీ పరిధిలో 50 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న మంచినీటి పైప్లైన్ నిర్మాణం పనులకు, హుడా ఫేస్-2 కాలనీ పరిధిలో 30 లక్షల



రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న భూగర్భ డ్రైనేజీ పనులకు, పిఏ నగర్ కాలనీ పరిధిలో 25 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న యుజిడి పనులకు చందానగర్ డివిజన్ కార్పొరేటర్ మంజుల రఘునాథ్ రెడ్డితో కలిసి శంకుస్థాపన గావించారు. హాఫీజ్పేట్ డివిజన్ పరిధి నందిని నగర్ సాయి నగర్ కాలనీలలో 60.50 లక్షల రూపాయల అంచనా వ్యయంతో నూతనంగా చేపట్టనున్న భూగర్భద్ర పనులకు డివిజన్ కార్పొరేటర్ పూజిత జగదీశ్వర్ గౌడ్, శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్చార్జి వాలిదాసు జగదీశ్వర్ గౌడ్తో కలిసి అరికపూడి ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా కార్పొరేటర్లతో కలిసి అరికపూడి మాట్లాడుతూ మొదటి నుండి శేరిలింగంపల్లి ప్రజలు తనను ఎంతో ఆదరాభిమానాలతో ఆశీర్వదిస్తూ వస్తున్నారని, శేరిలింగంపల్లి ప్రజలంటే తన సొంత కుటుంబ సభ్యులుగా భావిస్తానని, అందుకే ఈ ప్రాంత అభివృద్ధి కోసం ఎన్ని నిధులనైనా వెచ్చించి అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తానని అరికెపూడి వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న కోట్ల రూపాయల నిధులతో నూతనంగా రోడ్లు, మౌలిక సదుపాయాలు తదితర అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టనున్నామని తెలిపారు. ప్రజల సంక్షేమం, నియోజకవర్గ పరిధిలోని ఆయా కాలనీల అభివృద్ధే ధ్యేయంగా అనేక కార్యక్రమాలను కొనసాగిస్తున్నామని, ప్రజా సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నామని అరికపూడి వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ప్రజల సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేస్తూ ముందుకు సాగుతుందని, తెలంగాణను దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా నిలబెట్టడమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యమని, ఎందుకోసం పక్కా ప్రణాళికలతో ప్రభుత్వం కృషి చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి విభాగం డిజిఎం నారాయణ, మేనేజర్లు సునీత శిరీష, నాయకులు, కార్యకర్తలు, కాలనీవాసులు, కాలనీల అసోసియేషన్ సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## బీసీలకు 42 శాతం రిజర్వేషన్ నిర్వహించడం చారిత్రాత్మకం

- యాచారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మస్కు నరసింహ



**యాచారం, జూలై 12 (జనం సాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలలో బిసి లకు 42 శాతము రిజర్వేషన్లు ఆర్డినెన్స్ ధ్వారా అమలు చేస్తామని రాష్ట్ర మంత్రి వర్గము ప్రకటించిన సందర్భంగా శనివారం యాచారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మస్కు నర్సింహ్మ అధ్యక్షతన మండల కాంగ్రెస్ పార్టీ బిసి సెల్ అధ్యక్షులు వరికుప్పల తిరుమలేష్ ఆధ్వర్యము లో మండల కేంద్రము లోని అంబెద్కర్ చౌరస్తాలో ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ల చిత్ర పటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో మాజీ ఎంపీపీ రాచర్ల వెంకటేశ్వర్లు , మాజీ వైస్ ఎంపీపీ గజ్జి రామకృష్ణ యాదవ్ , ఏఎంసీ డైరెక్టర్ గులాం అక్బర్ , జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికారప్రతినిధి వరికుప్పల సుధాకర్ , జిల్లా కార్యదర్శి ఉప్పల భాస్కర్ , నాయకులూ లిక్కి పాండు రంగారెడ్డి , కొర్ర అరవింద్ నాయక్ , మోటే శ్రీశైలం, చీర శేఖర్ , బట్టు శ్రీను పాశం జయప్రకాశ్ , గిరమోని రవీందర్ , నీలం వెంకటేశ్, నర్రె శ్రీశైలం, బిక్షపతి గౌడ్, మస్కు సిద్దు, తదితరులు పాల్గొన్నారు.

# పేద కుటుంబాలకు అండగా బీజేపీ

- బిజెపి పార్టీ గ్రామ అధ్యక్షుడు ముద్దం మల్లేష్ యాదవ్..

**దోమ, జూలై 12 (జనం సాక్షి) :** పేద కుటుంబాలకు బిజెపి అండగా నిలుస్తుందని బిజెపి గ్రామ అధ్యక్షుడు ముద్ద మల్లేష్ యాదవ్ అన్నారు. శనివారం దోమ మండల పరిధిలోని బొంపల్లి గ్రామంలో గ్రామానికి చెందిన రాగుల శివమ్మ(53) అనే మహిళ అనారోగ్యంతో మృతి చెందింది. ఈ మేరకు విషయం తెలుసుకున్న బిజెపి నేతలు కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఒక్కో కార్యకర్త తన వంతు సహాయంగా ఆర్థిక సహాయం అందించేందుకు ముందుకు వచ్చారు. బాధిత కుటుంబానికి అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం రూ.నాలుగు వేల ఆర్థిక సహాయంగా అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పేదల పక్షాన బిజెపి అనునిత్యం అండగా ఉంటూ భరోసా కల్పిస్తుంది అన్నారు. భారత ప్రధాని నరేంద్ర మోడీ పేదల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ఎన్నో సంక్షేమ పథకాలను తీసుకువచ్చారని గుర్తు చేశారు. ప్రతి ఇంటికి కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకం అందుతుందని చెప్పారు. గ్రామ



గ్రామాన బిజెపి కార్యకర్తలు పేద ప్రజలకు అండగా ఉంటూ భరోసా కల్పించేందుకు ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నేతలు బోయిన నరేష్, ముద్దం నరసింహ యాదవ్, మల్లేష్ యాదవ్ శ్రీనివాస్ యాదవ్ నరసింహులు యాదవ్ బోయిని బాలరాజ్ ముదిరాజ్, కుమ్మరి చిన్నయ్య, వెంకటేష్, పవన్, సాలే శివ, గుడిసె బాబు ముదిరాజ్, వెంకట్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

# సమాజంలో సేవాభావం పెంచాలి

- రామకృష్ణ మిషన్ అధ్యక్షులు వైద్యానంద స్వామి

**తాండూరు, జూలై 12 (జనంసాక్షి) :** ప్రస్తుత సమాజంలో సేవాభావం తగ్గిపోతోందని, దాన్ని పెంచడానికి ప్రతి మనిషి ముందుకు రావాలని రామకృష్ణ మిషన్ అధ్యక్షులు వేద్యానంద స్వామి అన్నారు. శనివారం తాండూరు పట్టణ సాయిపూర్ తులసి గార్డెన్లో రామకృష్ణ వివేకా నంద భావ ప్రచార పరిషత్ అర్ధ వార్షికోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని జిల్లాల రామకృష్ణ సేవాసమితి కమిటీల ప్రతినిధులు హాజరై జిల్లాల వారీగా నివేదికలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా జిల్లాల సేవా కార్యక్ర మాలను అభినందించారు. 19 సమితీలు ఏర్పాటై సేవా కార్యక్రమాలు చేయడం సమాజా నికి అందిస్తున్న భగవత్ ప్రసాదమన్నారు. ప్రతి ఒక్కరిలో భగవంతుడు న్నాడనీ, భగవత్ సాక్షాత్కారమే మానవజన్మ సార్థకం అని ప్రబోధించారు. ఆస్తులు సంపదలు ఎన్ని ఉన్నా సంతృప్తిని లేనిది జీవితం సార్థకం కాలేదన్నారు. సంతృప్తిలోనే ఆనందం ఉంటుందనీ చెప్పారు. మధ్యాహ్నం సెక్షన్ లో ముఖ్య అతిథులు బోధమయానంద మహారాజ్, భోజనానంద మహారాజు మాట్లాడుతూ రామకృష్ణ



వివేకానంద భావ ప్రచార పరిషత్ కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాలన్నారు. కార్యక్రమంలో తాండూరు కొడంగల్ వికారాబాద్ జిల్లా గౌరవ అధ్యక్షులు డాక్టర్ రవీంద్ర యాదవ్ %ఎవశీ% రాంరెడ్డి ప్రతినిధులు, అధ్యక్షులుభాకారం చంద్రశేఖర్ ఆనంద బ్రదర్స్ కన్వీనర్ గౌరారం గోపాల్, కుమ్మరి వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

## బీసీలకు 42% రిజర్వేషన్ చారిత్రాత్మక నిర్ణయం



**ఇబ్రహీంపట్నం, జూలై 12 (జనం సాక్షి) :** కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం లో భాగంగా క్యాబినెట్ లో స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసేందుకు తీసుకున్న నిర్ణయాన్ని హర్షిస్తూ తుర్కయంజాల్ కూడలిలో మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు కొత్తకుర్మ మంగమ్మ శివకుమార్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి టిపిసిసి కార్యదర్శి కొత్తకుర్మ శివకుమార్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ను కల్పించిన కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి బీసీలందరు రుణపడి ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్లాపూర్ మెట్ మాజీ జెడ్పిటిసి సభ్యులు బింగి దాస్ గౌడ్, గడ్డాన్నారం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భాస్కర్ చారి, నాయకులు దాసరి సుధాకర్ రెడ్డి, కుంట గోపాల్ రెడ్డి, పూజారి శంకరయ్య గౌడ్, గుడ్ల అర్జున్, ఎల్మెటి వెంకట్ రెడ్డి, శ్యామల, ఎరుకలి రవి,శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి

**తాండూరు, జూలై 12 (జనంసాక్షి) :** బాధిత కుటుంబానికి తగిన న్యాయం చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు యు రమేష్ కుమార్ పేర్కొన్నారు.గత నాలుగు రోజుల క్రితం తాండూర్ మండలం అంతారం గ్రామంలో ఒక హిందూ యువకుడి పైన దాడి జరిగిన విషయం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు యు రమేష్ కుమార్ తెలుసుకుని వారి కుటుంబ సభ్యులను కలిసి యువకుడి ఆరోగ్య పరిస్థితులని తెలుసుకుని పరామర్శించారు.శనివారం బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాగారం మల్లేశం తొ కలిసి యువకుడి ఇంటి కి వెళ్లారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక మాధ్యమాల్లో పెట్టిన ఒక పోస్టు గురించి ఒక వర్గానికి చెందిన వారు పదుల సంఖ్యలో వచ్చి యువకుడు క్షమాపణ చెప్పినప్పటికీ అతడిపైన దాడి చేయడం అనేది దుర్మార్గమైన చర్య అన్నారు. దాడి జరిగిన తర్వాత పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ వాళ్ళు ఇంకా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం అనేది బాధాకరమైన విషయం అన్నారు. ఈ క్రమంలో భారతీయ జనతా పార్టీ తరఫున యువకుడికి న్యాయం జరిగేలా దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్



చేశారు. లేనిపక్షంలో ఉన్నతాధికారులను అవసరమైతే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని ఆయన పేర్కొన్నారు.అయన తో పాటు అంతారం బీజేపీ నాయకులు వడ్డె సాయిలు, రమేశ్ యువకులు ఉన్నారు.

## కామ్రేడ్ దొడ్డ నారాయణ మృతికి సీపీఐ నివాళి



**అబ్దుల్లాపూర్‌మెట్, జూలై 12 (జనం సాక్షి) :** తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, సీపీఐ నల్గొండ జిల్లా మాజీ కార్యదర్శి కామ్రేడ్ దొడ్డ నారాయణ మృతికి సీపీఐ పార్టీ తరపున ఘన నివాళులు అర్పించారు. ఆయన త్యాగాలు, ఉద్యమాల్లో వహించిన నాయకత్వం ప్రజలకు చిరస్మరణీయమని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారీ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ముత్యాల యాదిరెడ్డి అన్నారు.ఈ సందర్భంగా అబ్దుల్లాపూర్ మెట్టు మండల సీపీఐ ఆధ్వర్యంలో రావినారాయణ రెడ్డి కాలనీ ఫేస్-3 లో ఉన్న భూ పోరాట కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన నివాళుల కార్యక్రమంలో దొడ్డ నారాయణ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా శ్రద్ధాంజలి అర్పించారు.ఈ కార్యక్రమంలో సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యుడు, మాజీ కౌన్సిలర్ పబ్బతి లక్ష్మణ్, జిల్లా పార్టీ కౌన్సిల్ సభ్యులు వట్టి నవనీత, దాసరి ప్రసాద్, మండల పార్టీ సభ్యులు పి. సైదులు, పాండు, అశోక్ కావేరి తదితరులు పాల్గొన్నారు.

## బీసీ రిజర్వేషన్లపై మంత్రివర్గ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం

**కొడంగల్, జూలై 12 (జనం సాక్షి) :** స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ తెచ్చేందుకు మంత్రివర్గంలో నిర్ణయం తీసుకోవడం పట్ల కొడంగల్ తాలూకా జాతీయ బీసీ సంక్షేమ సంఘం సింగల్ విండో వైస్ చైర్మన్ యస్.వేణుగోపాల్ ముదిరాజ్, తాలూకా బీసీ సంఘం అధ్యక్షులు మన్నె బస్వరాజ యాదవ్ హర్షం వ్యక్తం చేస్తూ స్వాగతిస్తున్నామన్నారు.ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీ కుల గణన చేసి దేశంలోనే మొట్టమొదటి రాష్ట్రం తెలంగాణని చరిత్రలో నిలిపారు అన్నారు. అదేవిధంగా కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం హామీలను అమలు చేయాలని బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించిన తర్వాతనే స్థానిక సంస్థల్లో ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.ఇంతకుముందే తెలంగాణ ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని శాసనసభలో ఆమోదించి,తెలంగాణ రాష్ట్ర గవర్నర్ ద్వారా కేంద్ర ప్రభుత్వానికి పంపడం జరిగిందినీ అన్నారు.బీసీల



రిజర్వేషన్ల విషయంలో అన్ని రాజకీయ పార్టీలు ఏకాభిప్రాయానికి వచ్చి బిసి రిజర్వేషన్లు అమలు చేసిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు సహకరించాలని కోరారు. వారితో పాటు లింగానపల్లి మధు యాదవ్ పాల్గొన్నారు.

# గోశాలను ఇతర ప్రదేశాల్లోకి తరలించండి

- చేవెళ్ల పార్లమెంటు సభ్యుడు కొండా విశ్వేశ్వర్ రెడ్డి..
- ఎన్కేపల్లి భూ బాదితులకు అండగా ఉంటామని భరోసానిచ్చిన ఎంపీ

**మొయినాబాద్, జూలై 12 (జనం సాక్షి) :** జిల్లాలో అనేక ప్రభుత్వ భూములు ఉన్నాయని అక్కడికి గోశాలను తరలించాలని.. ఎన్కేపల్లిలోనే ఎందుకు ప్రభుత్వం ఏర్పాటు చేయలనుకుంటుందో అర్థం కావడం లేదని ఇదే విషయంపై త్వరలో సీఎం రేవంత్రెడ్డిని కలిసి విన్నవించడం జరుగుతుందని చేవెళ్ల పార్లమెంటు సభ్యుడు కొండా విశ్వేశ్వర్రెడ్డి పేర్కొన్నారు. ఎన్కేపల్లిలోని సర్వే నంబర్ 180లోని 99 ఎకరాల 14 గుంటల ప్రభుత్వ స్థలంలో గోశాల ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో అక్కడ సాగుచేసుకుంటున్న రైతులు వారం రోజుల నుంచి నిరసనలో కూర్చుకున్నారు. అయితే అప్పటి నుంచి మాజీ ఎమ్మెల్యే రత్నం,



మండల బీజేపీ అధ్యక్షుడు దారెడ్డి చంద్రశేఖర్రెడ్డి అధ్వర్యంలో ఎన్కేపల్లి రైతులకు బీజేపీ పార్టీ తరఫున అండగా నిలుస్తూ మద్దతు ప్రకటిస్తున్నారు. ఇందులో బాగంగా శనివారం సాయంత్రం కొండా విశ్వేశ్వర్రెడ్డి ఎన్కేపల్లి గోశాల స్థలాన్ని పరిశీలించి అక్కడ నిరసన వ్యక్తం చేస్తున్న రైతులకు మద్దతు ప్రకటించారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్కేపల్లిలో గోశాల ఏర్పాటు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. గోశాల ఏర్పాటుకు జిల్లాలో అనేక ప్రభుత్వ స్థలాలు ఉన్నాయని వాటిని కాకుండా ఎన్కేపల్లిలోని సాగు భూములను పేద రైతుల నుంచి లాక్కోవడం సరైనది కాదని అన్నారు. ఎన్కేపల్లి భూ బాదితులకు బీజేపీ పార్టీ అండగా ఉంటుందని న్యాయం జరిగేంత వరకు పోరాటం చేస్తునే ఉంటామని పేర్కొన్నారు. ఇదే విషయంపై త్వరలో ముఖ్యమంత్రి రేవంత్రెడ్డిని కలిసి పూర్తి వివరాలు వెల్లడించి ఎన్కేపల్లి రైతులకు న్యాయం చేసే విధంగా కృషి చేస్తానని రైతులకు భరోసానిచ్చారు. ఎన్కేపల్లిలోని ప్రభుత్వ స్థలం సాగుకు పనికి వచ్చేదని దీనిని ప్రభుత్వం దృష్టిలో ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రత్నం, సీనియర్ నాయకులు ప్రభాకర్రెడ్డి, మండల బీజేపీ పార్టీ అధ్యక్షుడు దారెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, మోర నర్సింహ్మరెడ్డి, ప్రభాకర్ యాదవ్, రైతులు సికిందర్, డప్పు రమేష్, ఈశ్వర్ రైతులు పాల్గొన్నారు.

## కోలీవింగ్ హాస్టల్స్‌పై చర్యలు తీసుకోవాలి



**ఇబ్రహీంపట్నం, జూలై 12 (జనం సాక్షి) :** ఆదిభట్ల పరిధిలో గల హాస్టల్స్ లో విష సంస్కృతిని ప్రోత్సహించే లాగా కోలీవింగ్ పద్ధతి పెట్టడం వలన ఆదిభట్ల ,ఇబ్రహీంపట్నం పరిసర ప్రాంతాలలో అసాంఘిక కార్యకలాపాలు, యువత చెడిపోయే అవకాశం ఉందని, అలాంటి హాస్టల్స్ పై వెంటనే చర్యలు తీసుకోవాలని ఇబ్రహీంపట్నం అసెంబ్లీ కన్వీనర్ వన్నవాడ రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం ఏసిపి కెవిపి రాజు కి ఫిర్యాదు చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో బిజెపి మున్సిపల్ అధ్యక్షులు ముత్యాల మహేందర్ , బీజేపీ ఇబ్రహీంపట్నం మండల అధ్యక్షులు గోదల శేఖర్ రెడ్, రంగారెడ్డి జిల్లా కౌన్సిల్ సభ్యులు ఆడెపు రాఘవేంద్ర, బీజేవైఎం ఆదిభట్ల అధ్యక్షులు వినయ్ తదితరులు పాల్గొన్నారు.

# విపణి

## హైదరాబాద్‌లో ‘ఉత్తరప్రదేశ్’ రోడ్‌షో




**జనంసాక్షి:**పరిశ్రమలు, పెట్టుబడులు ఆకర్షించడానికి ఉత్తర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం త్వరలో నిర్వహించనున్న ‘ఉత్తర ప్రదేశ్ ఇంటర్నేషనల్ ట్రేడ్ షో’ (యూపీఐటీఎస్) 2025 కోసం హైదరాబాద్‌లో తాజాగా రోడ్ షో నిర్వహించింది. ఈ మెగా ఈవెంట్‌పై అవగాహన, ఆకర్షణ పెంచడానికి దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా హైదరాబాద్‌లో రోడ్ షో చేపట్టింది. తొలుత ఢిల్లీతో మొదలు పెట్టిన ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం తర్వాత హైదరాబాద్‌లో ఈ రోడ్ షో నిర్వహించింది. నగరంలో జరిగిన కార్యక్రమంలో 150 మందికి పైగా పారిశ్రామిక దిగ్గజాలు, ఎగుమతిదారులు, సోర్సింగ్ కన్సల్టెంట్లు, వాణిజ్య సంస్థలు పాల్గొన్నాయి. గ్రేటర్ నోయిడాలోని ఇండియా ఎక్స్ పో సెంటర్ అండ్ మార్ట్ లో సెప్టెంబర్ 25 నుంచి 29 వరకు జరగనున్న యూపీఐటీఎస్ 2025కు ఊపును పెంచడమే లక్ష్యంగా ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఈ కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా నగరంలోని టీసీసీఐలో జరిగిన కార్యక్రమంలో యూపీ ఎంఎస్ఎంఈ క్యాబినెట్ మంత్రి రాకేష్ సచన్, ఆ రాష్ట్ర పరిశ్రమల అడిషనల్ కమిషనర్ రాజ్ కమల్ యాదవ్, టీసీసీఐ అధ్యక్షుడు సురేష్ కుమార్ సింఘాల్, ఐఈఎంఎల్ సీఈవో సుదీప్ సర్కార్ తదితరులు ప్రసంగించారు. ఆసియాలోనే అతిపెద్ద ఇంటిగ్రేటెడ్ ఎగ్జిబిషన్ అండ్ కన్వెన్షన్ సెంటర్లలో ఒకటైన ఇండియా ఎక్స్పోజిషన్ మార్ట్ లిమిటెడ్ (ఐఈఎంఎల్) సహకారంతో ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం యూపీఐటీఎస్ 2025ను నిర్వహిస్తోంది. బెంగళూరు, ముంబై, అహ్మదాబాద్ లలో రోడ్ షోలు ప్లాన్ చేస్తున్నారు.

## పుత్తడి ప్రియుల నడ్డి విరిసేలా ధరలు

**ఇటీవల కాలంలో స్థిర ఆదాయం సమకూర్చే కమోడిటీ మార్కెట్లపైపు పెట్టుబడిదారులు మొగ్గు చూపుతున్నారు. అందులో భాగంగా బంగారం ధరల్లో మార్పులు వస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు.గత కొన్ని రోజులుగా బంగారం ధరలు ఊగిసలాడుతున్నాయి. శుక్రవారంతో పోలిస్తే శనివారం పసిడి ధరలు పెరిగాయి. వెండి ఏకంగా కేజీపై రూ.4000 పెరిగి ఆల్‌టైమ్‌హై చేరింది.**

## హైదరాబాద్‌లో సొంతింటి కోసం
# రాజీతప్పదా..!



ఇళ్లకే ప్రాధాన్యమివ్వాలి.

**విషయం ఏదైనా సరే.. కోరుకున్నవన్నీ దొరక్కపోవచ్చు. ఏదో ఒక విషయంలో రాజీ పడక తప్పదు. ఇళ్ల కొనుగోలుకూ ఇదే సూత్రం వర్తిస్తుంది. బడ్జెట్, చిక్కుల్లేని యాజమాన్య హక్కు, ప్రాంతం, వాస్తు, నీరు, విద్యుత్తు సరఫరా అంశాలు ఇంటి కొనుగోలు నిర్ణయాన్ని ప్రభావితం చేస్తాయి. అయితే వీటిలో కొన్ని అంశాలు మనం ఆశించినట్లుగా ఉండకపోవచ్చు. అన్నీ మనకు అనుకూలంగా ఉండాలంటే సొంతింటి స్వప్నం ఓ పెద్ద సవాలే అవుతుంది.**

**జనంసాక్షి:**అలాగనీ ముఖ్యమైన అంశాల్లోనూ రాజీపడాలని కాదు. ప్రాధాన్యత క్రమంలో ఒకటి, రెండు అనుకూలంగా ఉండకపోవచ్చు. కాబట్టి ఏయే విషయాల్లో రాజీ పడొచ్చు. ఎక్కడ పడకూడదో స్పష్టత ఏర్పర్చుకోవాలి. ఇల్లు కొనాలన్న ఆలోచనలో ఉన్నారా? అది కూడా మాదాపూర్, గచ్చిబౌలి వంటి ప్రాంతాల్లో అనుకుంటున్నారా? ఇక్కడ వీలవ్వకపోతే మియాపూర్, మదీనాగూడ, మణికొండ, ఓయూ కాలనీ తదితర ప్రాంతాల్లో.. కొంచెం తక్కువ ధరలో దొరికే ప్రాంతా లపై దృష్టి పెడతారు అవునా? ప్రస్తుత రియల్టీ మార్కె ట్లో సంపన్నులకే కాదు మధ్యతరగతి, సామాన్యులు.. ఇలా వివిధ వర్గాల వారికి స్తోమతకు తగ్గ బడ్జెట్‌లో నగరం చుట్టూ గృహసముదాయాలు వస్తున్నాయి. మీరు కొంచెం కసరత్తు చేసి, చుట్టుపక్కల ప్రాంతాల్ని అన్వేషిస్తే చాలు, మీకు అందుబాటు ధరలో ఇళ్లు ఎక్కడ దొరికేది ఇట్టే తెలిసిపోతుంది. నిర్మాణాల విషయంలో డెవలపర్ల వ్యూహం మారింది. సకల సదుపాయాలు అందుబాటులో ఉండే విధంగా గేటెడ్ కమ్యూనిటీ ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. ఇల్లు కొనాలన్న నిర్ణయానికొచ్చాక సదుపాయాల సంగతి కూడా ఆలోచించాలి. క్లబ్‌హౌజ్, జిమ్ అవసరమా? వినోదాన్ని, ఆహ్లాదాన్ని అందించే ఈ సదుపాయాలు అక్కర్లేదా? అన్నది తేల్చుకోవాలి. జీవనశైలి, బడ్జెట్ తదితర అంశాలు మీ నిర్ణయంపై ప్రభావితం చేస్తాయి. కాబట్టి సదుపాయాల విషయంలో స్పష్టత ఉండాలి. స్థిరాస్తి కొనేటప్పుడు బిల్డర్ గురించి కూడా ఆరా తీయాలి. మార్కెట్లో పేరున్న బిల్డర్లు నిర్మించే గతంలో అతను నిర్మించిన ప్రాజెక్టులు సకాలంలో పూర్తయ్యాయా? నిర్మాణమెలా ఉంది? ఒప్పందం మేరకు కొనుగోలుదారులకు సదుపాయాలు కల్పించాడా? కార్పస్ ఫండ్ బదిలీలో ఇబ్బందులేమైనా సృష్టించాడా? అన్న విషయాల్ని తెలుసుకోవాలి. నిర్మాణాల్లో మంచి చరిత్ర లేని బిల్డర్లకు దూరంగా ఉండటమే మేలు. అలాగనీ మార్కెట్లో పేరున్న బిల్డర్ల ప్రాజెక్టులకే పరిమితం కానక్కర్లేదు. నాణ్యత పాటించే వారిని ఎంచుకోవచ్చు. ఇంటి ముందు పచ్చటి తోటతో ఆహ్లాదభరిత వాతావరణం ఉండాలని కొందరు కోరుకుంటారు. మరికొందరేమో హంగులు లేకున్నా సర్దుకుపోతారు. బాల్కనీని పచ్చగా, అందంగా అలంకరించుకుంటే గార్డెన్‌కు ధీటుగా ఉంటుందని భావిస్తారు. కాబట్టి ఈ విషయంలో మీ దృక్పథం ఏమిటో నిర్ణయించుకోవాలి.

## భవిష్యత్తులో కొదవలేని బిజినెస్ ఇదే..





**జనంసాక్షి:**భారతదేశం కాలుష్యాన్ని తగ్గించేందుకు చర్యలు చేపడుతోంది. అందులో భాగంగా ఎలక్ట్రిక్ వాహనాల తయారీని పెంచుతోంది. ఈవీలో ప్రధానపాత్ర పోషించేది బ్యాటరీలే. వీటిలో లిథియం బ్యాటరీలను ఎక్కువగా వాడుతున్నారు. భవిష్యత్తులో వీటి సామర్థ్యం తగ్గాక తిరిగి రీసైక్లింగ్ చేసే వ్యవస్థను రూపొందించాలి. ప్రస్తుత రీసైక్లింగ్ మౌలిక సదుపాయాలు భవిష్యత్ డిమాండ్‌లను తీర్చలేవని నిపుణులు అంచనా వేస్తున్నారు. అందుకు తగ్గట్టుగా స్థిరమైన వ్యవస్థను ఏర్పరచాలని సూచిస్తున్నారు. ఈమేరకు ప్రభుత్వం మరిన్ని స్టార్టప్‌లను ప్రోత్సహించాలని చెబుతున్నారు. కార్లలో ఉపయోగించే లిథియం అయాన్ బ్యాటరీలు సగటున 7-8 సంవత్సరాలు పనిచేస్తాయి. కస్టమర్ల వినియోగాన్ని బట్టి ఒక దశాబ్దం వరకు మన్నిక రావొచ్చు. అన్ని రకాల లిథియం అయాన్ బ్యాటరీల్లో లిథియం ఫెర్రో ఫాస్ఫేట్, నికెల్ మాంగనీస్ కోబాల్ట్ ఆక్సైడ్ (ఎన్ఎంసీ), లిథియం నికెల్ కోబాల్ట్ అల్యూమినియం ఆక్సైడ్(ఎన్‌సీఏ)లను విరివిగా వాడుతారు. భారత్‌లో ఈవీలు వేగంగా విస్తరిస్తున్నాయి. దాంతో ఈ దాతువుల వినియోగం సైతం పెరుగుతోంది. ఈ బ్యాటరీల తయారీలో రెండు ప్రధాన సమస్యలున్నట్లు నిపుణులు అంచనా వేస్తున్నారు. ఒకటి.. బ్యాటరీల్లో వాడే రసాయన దాతువులను సంగ్రహించడం. రెండు.. ఈ బ్యాటరీలను వాడిన తర్వాత ఆయా దాతువులను భూమిలో వేస్తే కలిగే ప్రమాదాలను నివారించడం. ఈ సమస్యలకు ‘రిసైక్లింగ్’ పరిష్కారమని నిపుణులు సూచిస్తున్నారు. ప్రస్తుతం రీసైక్లింగ్ పద్ధతుల్లో హైడ్రోమెటలర్జీ, పైరోమెటలర్జీ, డైరెక్ట్ రీసైక్లింగ్, ఇంటిగ్రేటెడ్ కార్బోథర్మల్ రిడక్షన్ వంటి మెకానికల్ ప్రక్రియలు అనుసరిస్తున్నారు. ఈ పద్ధతుల్లో బ్యాటరీలను కంప్రెస్ చేయడం, ముక్కలు చేయడం, ప్రత్యేక ద్రావకాలు లేదా వేడితో కరిగించి విలువైన పదార్థాలను వెలికితీస్తారు. ఈ ప్రక్రియనంతటిని ‘బ్లాక్ మాస్’ అని పిలుస్తారు. భారత్‌లో పైరోమెటలర్జీ(అధిక ఉష్ణోగ్రతల వద్ద బ్యాటరీలను కరిగించడం)తో పోలిస్తే తక్కువ ఉద్గారాలతో కూడిన హైడ్రోమెటలర్జికల్(ప్రత్యేక ద్రావణాలతో కరిగించడం) ప్రక్రియను ఎక్కువగా వాడుతున్నారు. ఇందులో దాదాపు 95 శాతం యానోడ్, కేథోడ్‌లను సంగ్రహిస్తున్నారు. దేశీయంగా 80% హైడ్రోమెటలర్జీ ప్రక్రియనే వాడుతున్నారు. అభివృద్ధి చెందుతున్న ఈవీ రంగంలో రి మరిన్ని స్టార్టప్‌లకు అవకాశం ఉంది. ఈవీ తయారీ వైపే కాకుండా బ్యాటరీ రీసైక్లింగ్ విభాగంలోనూ కంపెనీలు పుట్టుకొచ్చే అవకాశం ఉన్నట్లు నిపుణులు చెబుతున్నారు. భవిష్యత్తులో రాబోయే ఈ ట్రెండ్‌ను స్టార్టప్‌లు అందిపుచ్చుకోవాలని చెబుతున్నారు. ఈవీ రంగంలో పెట్టుబడి పెట్టే వెంచర్ కాపిటలిస్టులు ఈ విభాగాన్ని కూడా గమనించాలని సూచిస్తున్నారు.

## షిప్‌రాకెట్ నుంచి ‘శూన్య.ఏఐ’

**జనంసాక్షి:**చిన్న, మధ్య తరహా సంస్థలు (ఎంఎస్ఎంఈ), డీ2సీ వ్యాపార సంస్థల కోసం ఈ-కామర్స్ సేవల సంస్థ షిప్‌రాకెట్ కొత్తగా ‘శూన్య.ఏఐ’ పేరిట ఏఐ ఇంజిన్‌ను ఆవిష్కరించింది. అల్ట్రాసేఫ్ సంస్థ భాగస్వామ్యంతో దీన్ని రూపొందించినట్లు కంపెనీ తెలిపింది. తొమ్మిదికి పైగా భారతీయ భాషల్లో వాయిస్, టెక్ట్స్, ఇమేజ్ ఇంటెలిజెన్స్‌ను ఇది అందిస్తుందని పేర్కొంది. దీన్ని పూర్తిగా భారత్‌లోనే తీర్చిదిద్దినట్లు వివరించింది. తొలి ఏడాదిలో ఇది 1 లక్ష పైచిలుకు ఎంఎస్ఎంఈలను చేరుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు షిప్‌రాకెట్ పేర్కొంది. కేటలాగింగ్, మార్కెటింగ్, ఫుల్‌ఫిల్‌మెంట్ తదితర విభాగాలవ్యాప్తంగా సమయాన్ని, డబ్బును ఆదా చేసుకునేందుకు శూన్య.ఏఐ ఉపయోగపడుతుందని కంపెనీ ఎండీ సాహిల్ గోయల్ చెప్పారు. షిప్‌రాకెట్, కేపీఎంజీ విడుదల చేసిన నివేదిక ప్రకారం 11,000 పైచిలుకు బ్రాండ్లు ఉన్న దేశీ డీ2సీ మార్కెట్ ఈ ఏడాది (2025) 100 బిలియన్ డాలర్ల స్థాయికి చేరనుంది. అలాగే 22 కోట్ల ఆన్‌లైన్ షాపర్లున్న ఈ-రిటైల్ మార్కెట్ 125 బిలియన్ డాలర్లకు చేరనుంది.



## టైమ్ టాప్-100 డిజిటల్ క్రియేటర్ల జాబితాలో ప్రజక్తా కోలికి చోటు

**లండన్:** ప్రతిష్టాత్మక టైమ్ 100 క్రియేటర్స్ జాబితాలో ఒక భారతీయురాలితోపాటు భారత సంతతికి చెందిన నలుగురు కంటెంట్ రైటర్లు చోటు దక్కించుకున్నారు. యూ ట్యూబర్, నటి అయిన ప్రజక్తా కోలి (32)కి భారత్ నుంచి చోటు దక్కడం విశేషం. భారతీయ అమెరికన్లు ధర్ మాన్, మిచెల్ ఖరె, సమీర్ చౌదరి, జే షెట్టి కూడా ఉన్నారు. ప్రసంస్కృతి, చర్చలు, సంఘాలను ప్రభావితం చేసే అత్యంత ప్రభావశీలురైన డిజిటల్ సృష్టికర్తలను టైమ్ ఎంపిక చేసింది. మొట్టమొదటి సారిగా రూ పొందించిన ఈ జాబితాలో టైటా న్స్, ఎంటర్‌టెయినర్స్, లీడర్స్, ఫెనొమ్స్, కేటలిస్ట్స్ అనే ఐదు కేటగి రీల్లో 15 దేశాలకు చెందిన వారు న్నారు. టైటాన్స్ విభాగంలో భారత సంతతికి చెందిన ధర్‌మాన్ (41) సామాజిక, మానవీయ విలువలను కథల మాదిరిగా బోధిస్తూ యూట్యూబ్ వీడియోలను రూపొందించడంలో పేరు తెచ్చుకున్నారు.

# మరో వికెట్ డౌన్..

## ట్రంప్‌కు మరో షాక్..
## ఎఫ్‌బీఐకి రాజీనామా యోచనలో కాష్ పటేల్!

**ట్రంప్ వీరవిధేయుడు, ఎఫ్‌బీఐ డైరెక్టర్ కాష్ పటేల్ తన పదవికి రాజీనామా చేసే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. బిగ్ బ్యూటీఫుల్ బిల్లు విషయంలో విభేదాలతో ఎలాన్ మస్క్ డోజ్‌ను వీడిన సంగతి తెలిసిందే. ఇప్పుడు కాష్ పటేల్ కూడా ఎప్‌స్టీన్ ఫైల్స్ వ్యవహారంలో అదే బాటలో పయనించే అవకాశం కనిపిస్తోంది.**



వాషింగ్టన్: భారత సంతతికి చెందిన కాష్ పటేల్(కశ్యప్ ప్రమోద్ పటేల్) ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ డైరెక్టర్ పదవికి రాజీనామా చేయాలని భావిస్తున్నారు. ఎఫ్‌బీఐ డిప్యూటీ డైరెక్టర్ డాన్ బోంగినో రాజీనామా చేస్తారనే ఊహాగానాల నడుమ.. కాష్ ఈ నిర్ణయం వైపు మొగ్గు చూపిస్తున్నట్లు తెలుస్తోంది. డాన్ రాజీనామా చేసిన వెంటనే తన పదవి నుంచి వైదొలగాలని కాష్ భావిస్తున్నారని స్థానిక మీడియా కథనాలు ఇస్తోంది. ఎప్‌స్టీన్ ఫైల్స్ అనేది అమెరికాలో సంచలనం సృష్టించిన జెఫ్రీ ఎప్‌స్టీన్ సెక్స్ కుంభకోణానికి సంబంధించిన కీలక పత్రాల వ్యవహారం. ఈ ఫైల్స్‌లో ఎప్‌స్టీన్ కాంటాక్ట్ లిస్ట్, ఫ్లైట్ లాగ్‌లు, అతనికి వ్యతిరేకంగా సేకరించిన ఆధారాలు ఉన్నాయి. అయితే ఈ కేసులో ప్రముఖ రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తలు, సెలబ్రిటీలు ఉన్నారని ఆరోపణలూ ఉన్నాయి.
ఎఫ్‌బీఐ డిప్యూటీ డైరెక్టర్ డాన్ బోంగినో ఎప్‌స్టీన్ ఫైల్స్ వ్యవహారాన్ని అమెరికా న్యాయ విభాగం.. ఎఫ్‌బీఐ కలిపి విచారిస్తోంది. అయితే ఈ కేసును అటార్నీ జనరల్ పామ్ బాండీకు అప్పగించినప్పటి నుంచి ఎఫ్‌బీఐ డిప్యూటీ డైరెక్టర్ డాన్ బోంగినో తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఈ క్రమంలోనే తాజాగా ఆయన సెలవులపై వెళ్లారు. అయితే ఆమె ఉండగా తాను తిరిగి విధుల్లోకి రాలేనని బోంగినో ఎఫ్ఐబీకి స్పష్టం చేసినట్లు కథనాలు వెలువడ్డాయి. ఈ తరుణంలోనే కాష్ పటేల్ ఈ వ్యవహారంపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. బోంగినో గనుక రాజీనామా చేస్తే.. కాష్ తాను పదవి నుంచి వైదొలగాలని భావిస్తున్నారని అక్కడి మీడియా కథనాలు ఇచ్చింది.
**పామ్ బాండీ:**"ఈ దర్యాప్తులో పామ్ బాండీ ఉండాలని కాష్ పటేల్ కూడా కోరుకోవడం లేదు. బాండీ మరికొన్ని పత్రాలను విడుదల చేయకపోవడంపైనా ఎఫ్‌బీఐ వర్గాల్లో తీవ్ర అసహనం నెలకొంది. అందుకే బోంగినో గనుక వీడితే ఆయన కూడా ఎఫ్‌బీఐని వీడే అవకాశం ఉంది" అని ఓ ప్రముఖ జర్నలిస్టు తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. ఎఫ్‌బీఐకి, డీవోజే(డిపార్ట్‌మెంట ఆఫ్ జస్టిస్)కు నడుమ పొసగట్లేదన్న విషయాన్ని సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్, ట్రంప్ అనుచరురాలు లారా లూమర్ సైతం ధృవీకరించడం గమనార్హం. పారదర్శకత లోపించిందనేది ప్రధాన ఆరోపణతో ఎఫ్‌బీఐ వర్గాలు బాండీ తీరుపట్ల అసంతృప్తిగా ఉన్నాయంటూ లూమర్ తెలిపారు. ఈ క్రమంలో బాండీని.. బ్లోండీ అంటూ ఆమె ఎద్దేవా చేయడం గమనార్హం. ప్రముఖ ఇన్వెస్టర్ అయిన ఎప్‌స్టీన్ లైంగిక వేధింపుల ఆరోపణలతో మీటూ ఉద్యమ సమయంలో అరెస్ట్ అయ్యాడు. ఆపై 2019లో జైల్లో అనుమానాస్పద స్థితిలో మరణించగా.. ఆత్మహత్య చేసుకున్నాడని అధికారులు ప్రకటించారు. అయితే ఈ ఫైల్స్ ఇప్పటిదాకా బయటకు రాకపోవడంతో అమెరికా రాజకీయాల్లో, మీడియాలో పెద్ద చర్చ నడుస్తోంది. అయితే..ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో.. ప్రముఖుల పేర్లు ఉన్నాయని, వాటిని త్వరలోనే బయటపెడతామని ఫిబ్రవరిలో ఫాక్స్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పామ్ బాండీ ప్రకటించారు. అయితే తాజాగా డీవోజే-ఎఫ్‌బీఐ సంయుక్తంగా విడుదల చేసిన మెమోలో.. ఎలాంటి ఆధారాల్లేవని, కేసును ముగించినట్లు ప్రకటించారు. ఈ నేపథ్యంలో బాండీ మాటమార్చి.. తన గత వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నట్లు ప్రకటించారు. ఒకవైపు ఎలాన్ మస్క్ సైతం ఈ వ్యవహారంపై ట్రంప్ ప్రభుత్వానికి చురకలంటిస్తున్నారు. మరోవైపు ట్రంప్ ఈ వ్యవహారంపై తనకు సంబంధం లేదన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటిదాకా ఎఫ్‌బీఐ వర్సెస్ జ్యూడీషియల్ డిపార్టెమెంట్ వ్యవహారంపై వైట్‌హౌజ్ ఎలాంటి ప్రకటనా చేయలేదు. ఇంకోవైపు మేక్ అమెరికా గ్రేట్ ఎగైన్ ఉద్యమకారులు సైతం ఈ పరిణామాలపై అసంతృప్తితో రగిలిపోతున్నారు. కశ్యప్ పూర్వీకులు భారత్‌లోని గుజరాత్ నుంచి వలస వెళ్లారు. అతడి తల్లిదండ్రులు తూర్పు ఆఫ్రికాలో పెరిగారు. ఉగాండా నుంచి అమెరికాకు వలస వచ్చారు. 1980లో న్యూయార్క్‌లో కశ్యప్ జన్మించారు. యూనివర్సిటీ ఆఫ్ రిచ్‌మాండ్‌లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి యూనివర్సిటీ ఆఫ్ కాలేజ్ లండన్‌లో న్యాయవిద్యను పూర్తి చేశారు. అనంతరం మియామీ కోర్టుల్లో లాయర్‌గా వివిధ హోదాల్లో సేవలందించారు. ఆ సమయంలోనే ట్రంప్‌కు ఆయన దగ్గరయ్యారు. ఫిబ్రవరి 22వ తేదీన ఎఫ్‌బీఐ 9వ డైరెక్టర్‌గా కాష్ పటేల్ బాధ్యతలు స్వీకరించారు. ఆ సమయంలో పామ్ బాండీ కాష్‌తో ప్రమాణం చేయించగా.. భగవద్గీత మీద చేయి ఉంచి ఆయన బాధ్యతలు చేపట్టారు.

## పట్టి పీడించే ‘డార్క్ ప్యాటర్న్స్’

**జనంసాక్షి:**భారతదేశంలోని పలు ఫైనాన్షియల్ సర్వీసెస్ యాప్స్‌ను ‘డార్క్ ప్యాటర్న్స్’గా అభివర్ణిస్తూ జెరోధా సహ వ్యవస్థాపకుడు, కంపెనీ సీఈఓ నితిన్ కామత్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కంపెనీలు ఎక్కువ డబ్బు సంపాదించడానికి, తమ ప్రయోజనాలే ముఖ్యంగా నిబంధనలకు వ్యతిరేకంగా ప్రజలను ఆర్థిక ఇబ్బందుల్లో నెట్టివేసేందుకు కొన్ని ట్రిక్స్ అనుసరిస్తున్నాయని కామత్ చెప్పారు. కామత్ తన ఎక్స్‌లో తెలిపిన వివరాల ప్రకారం.. ‘ఆర్థిక సేవల వ్యాపారాన్ని నిర్మించడంలో ప్రోత్సాహకాలు కీలకంగా మారుతాయి. అయితే ఇవి కస్టమర్ కోసం కాకుండా వ్యాపారానికి మంచి చేసేలా వక్రీకరించబడి ఉంటాయి. తాత్కాలికంగా వినియోగదారులకే పెద్దపీట వేసినట్లు ఉన్నా, నిలకడగా కస్టమర్లకు మొదటి స్థానం కల్పించడం చాలా కష్టం. ఇది కాసినో గేమ్ వంటిది. స్పష్టమైన ఫీచర్లు, స్థిరమైన నోటిఫికేషన్లు, వివరాలు లేకుండా ప్రమాదకరమైన ఆర్థిక ఇబ్బందుల్లోకి నెట్టివేస్తాయి. చాలా ఫైనాన్షియల్ యాప్స్ డిజైనింగ్ ప్రజలు క్రమంగా ఎక్కువ ఖర్చు చేయడానికి, అజాగ్రత్తగా పెట్టుబడి పెట్టడానికి, నిత్యం అదే యాప్‌కు బానిస అయ్యేలా రూపొందించబడ్డాయి. ఈ డార్క్ ప్యాటర్న్స్ యాప్స్, వెబ్‌సైట్‌లో ఉపయోగించే డిజైన్ ట్రిక్స్’ అని చెప్పారు.

### ఐపీవోకు ఇన్‌ఫ్రా పరికరాలు అద్దెకిచ్చే కంపెనీ

**జనంసాక్షి:**ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పరికరాలను అద్దెకిచ్చే అగ్‌కాన్ ఎక్విప్‌మెంట్స్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూకి రానుంది. ఇందుకు అనుగుణంగా క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్ దాఖలు చేసింది. ఐపీవోలో భాగంగా రూ. 332 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటికి జతగా కంపెనీ ప్రమోటర్లు 94 లక్షల షేర్లను విక్రయానికి ఉంచనున్నారు. ఈక్విటీ జారీ నిధుల్లో రూ. 168 కోట్లు రుణ చెల్లింపులకు, రూ. 84 కోట్లు పరికరాల కొనుగోళ్లకు, మరికొన్ని నిధులు సాధారణ కార్పొరేట్ అవసరాలకు వెచ్చించనుంది. 2003లో ఏర్పాటైన హర్యానా కంపెనీ ప్రధానంగా మౌలిక రంగ కంపెనీలకు పరిశ్రమ సంబంధిత పరికరాలను అద్దె ప్రాతిపదికన సమకూర్చుతుంది. గతేడాది(2024-25) ఆదాయం 20 శాతం ఎగసి రూ. 164 కోట్లను తాకగా.. నికర లాభం 36 శాతం జంప్‌చేసి రూ. 31 కోట్లకు చేరింది.


## ఇంధన స్విచ్‌లు ఆగిపోవడం వల్లే దుర్ఘటన

సెకన్ పాటు ఆగిపోయినట్లు వెల్లడించింది. ఈ ప్రమాదం వెనుక ఎలాంటి కుట్ర కోణం లేదని తెలిపింది. పక్షి ఢీకొన్న ఆనవాళ్లు కూడా కన్పించలేదని నివేదికలో తెలిపింది. ’విమానం ప్రయాణించిన మార్గానికి సమీపంలో పక్షులు ఎగరలేదు. పక్షి ఢీ కొన్న ఆనవాళ్లు కూడా గుర్తించలేదు. వాతావరణ సంబంధిత సమస్యలు కూడా లేవు. ఆకాశం కూడా క్లియర్‌గా ఉంది. విజిబిలిటీ బాగుంది. గాలి స్వల్పంగా వీస్తోందని తెలిపింది. అంతేకాదు, ప్రమాదం వెనుక ఎలాంటి కుట్ర కోణం లేదని తెలిపింది. విమానంపై దాడి జరిగినట్లు- చెప్పేందుకు ఎలాంటి ఆధారాలూ కనిపించలేదని వివరించింది. జూన్ 12న మధ్యాహ్నం 1:30 గంటల సమయంలో గుజరాత్‌లోని అహ్మదాబాద్ నుంచి లండన్ బయల్దేరిన ఎయిర్ ఇండియా బోయింగ్ డ్రీమ్‌లైనర్ 787-8 విమానం టేకాఫ్ అయిన కొద్దిసేపటికే కూలిపోయిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో 270 మంది మరణించారు. దుర్ఘటన జరిగి శనివారానికి సరిగ్గా నెల రోజులైంది. దీంతో ఇవాళ తెల్లవారుజామున ఈ ప్రమాద ఘటనపై ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో ప్రాథమిక నివేదిక విడుదల చేసింది.

## బేకారు’ కాదు.. కారే..

**జనంసాక్షి:**డౌట్ అక్కర్లేదు. ఇది కారే. కాకపోతే.. ప్రపంచం లోనే అత్యంత సన్నటి (స్లిమ్) కారు. ట్రాఫిక్ జామ్‌ల ఫికర్ లేదు. పార్కింగ్ సమస్య లేనే లేదు. ఈ అల్ట్రా స్లిమ్ ఫియట్ పాండా ఎలక్ట్రిక్ కారును ఇటలీలో ఆవిష్కరించారు. డ్రైవర్ కాకుండా.. ఇంకొకరు వెనుక సీట్లో కూర్చొని ప్రయాణించవచ్చు. 50 సెంటీమీటర్ల వెడల్పు మాత్రమే ఉన్న ఈ కారును ఇటలీకి చెందిన మెకానిక్ ఆంద్రియా పాత ఫియట్ కారు భాగాలను ఉప యోగించి రూపొందించాడు. 145 సెంటీమీటర్ల ఎత్తు, 340 సెంటీమీటర్ల పొడవున్న ఈ కారు బరువు 264 కిలోలు. దీన్ని చూసినోళ్లంతా గట్టిగా గాలి వస్తే పడిపోతుందేమో అని అనుమానం చేయగా.. అటూ ఇటూ ఊగుతుంది గానీ.. పడిపోదు అని దీన్ని తయారుచేసిన ఆంద్రియా చెప్పాడు. దాన్ని నిరూపించడానికి అక్కడ నడిపి చూపాడు. ఇది స్లిమ్ కారు.. దానికి తగ్గట్లు ఇందులో సన్నగా ఉన్నవాళ్లే పడతారు. ప్రపంచంలోనే అత్యంత సన్నటి కారుగా దీని పేరును త్వరలో గిన్నిస్ బుక్‌లోకి ఎక్కించనున్నట్లు ఆంద్రియా తెలిపాడు.






## ఇద్దరు పిల్లలతో రష్యన్ మహిళ గుహలో నివాసం..

### చివరకు ఏం జరిగిందంటే..

గత రెండు వారాలుగా ఓ రష్యన్ మహిళ తన ఇద్దరు కుమార్తెలతో కలిసి ప్రమాదకరమైన గుహలో నివసిస్తున్న ఘటన కర్ణాటకలో సంచలనం రేపింది. ఉత్తర కన్నడ జిల్లా కుమ్టా తాలూకాలోని రామతీర్థ కొండల్లోని మారుమూల గుహ నుంచి నినా కుటినా అలియాస్ మోహి (40), ఆమె ఇద్దరు పిల్లలను పోలీసులు రక్షించారు. ఈ నెల 9న సాయంత్రం 5 గంటల సమయంలో గోకర్ణ పోలీసులు పర్యాటకుల భద్రత కోసం గోకర్ణ అడవి ప్రాంతంలో గస్తీ నిర్వహిస్తుండగా.. గుహ వద్ద వారి కదలికలు కనిపించాయి. ఆ మహిళ తన ఇద్దరు పిల్లలతో కలిసి గుహలో నివసిస్తున్నట్లు కనుగొన్న పోలీసులు.. వారిని కాపాడారు. కొన్నేళ్ల క్రితం బిజినెస్ వీసాపై భారత్‌కు వచ్చిన మోహి.. గోవా నుంచి ఆధ్యాత్మిక తీర ప్రాంతమైన గోకర్ణకు చేరుకుంది. ఆమె వీసా గడువు కూడా ముగిసింది. భారతీయ ఆధ్యాత్మిక సంప్రదాయాలకు ఆకర్షితురాలైన ఆమె తన ఇద్దరు పిల్లలు ప్రయా (6), అమా (4)లతో కలిసి రెండు వారాల క్రితం గోకర్ణలోని దట్టమైన అటవీప్రాంతంలోకి వెళ్లింది. అక్కడ ఒక గుహలో తన ఇద్దరు పిల్లలతో కలిసి నివసించడం ప్రారంభించింది. ఆ గుహను ఆధ్యాత్మిక కేంద్రంగా మార్చేసిన ఆ మహిళ.. రుద్ర విగ్రహాన్ని ప్రతిష్ఠించడంతో పాటు పూజలు నిర్వహించేంది. నిత్యం ధ్యానం చేస్తూ రోజులు గడిపింది. అయితే ఆ మహిళ, ఆమె పిల్లలు అడవిలో ఉన్న సమయంలో ఆహారాన్ని ఎలా సంపాదించారనే దానిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. 2024 జూలైలో గుహ ఉన్న రామతీర్థ కొండ ప్రాంతం నుంచి పెద్ద పెద్ద కొండచరియలు విరిగిపడ్డాయి. విష పూరిత పాములు సహా ప్రమాదకరమైన వన్య ప్రాణులకు నిలయమైన ఆ ప్రాంతం. చాలా ప్రమాదకరమైన ప్రదేశంగా పోలీసులు తెలిపారు. ఆ రష్యన్ మహిళకు కౌన్సెలింగ్ ఇచ్చిన పోలీసుల బృందం.. కొండ కిందకు తీసుకెళ్లింది. ఆమె అభ్యర్థన మేరకు కుంటా తాలూకాలోని బంకికోడ్ల గ్రామంలో 80 ఏళ్ల మహిళా సన్యాసిని యోగరత్న సరస్వతి నిర్వహిస్తున్న ఆశ్రమానికి తరలించారు. మోహి వీసా గడువు 2017లోనే ముగిసిందని అధికారులు తెలిపారు. ఆమె భారత్‌లో ఎంత కాలం నుంచి ఉంటుందో తెలుసుకునే పనిలో అధికారులు పడ్డారు. స్థానిక స్వచ్ఛంద సంస్థ సాయంతో రష్యా రాయబార కార్యాలయాన్ని అధికారులు సంప్రదించారు.



## పారదర్శకంగా లబ్ధిదారులకు

# ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపు



- ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఇసుక, మట్టి సమస్య తలెత్తకుండా చర్యలు
- జిల్లెల్లలో 26 మంది ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు పత్రాల పంపిణీ
- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**తంగళ్ళపల్లి జులై 12 (జనం సాక్షి) :**
తంగళ్ళపల్లి మండల కేంద్రంలోని జిల్లెల్ల గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపు కార్యక్రమం పారదర్శకంగా జరిగింది. జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇంచార్జ్ కేకే మహేందర్ రెడ్డి సమక్షంలో లాటరీ పద్ధతిలో 26 మంది లబ్ధిదారులకు ఇండ్లు కేటాయిం చారు. ఈ సందర్భంగా, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ, నిరుపేదలకు సొంత ఇంటి కలను నెరవేర్చేందుకు ఈ కార్యక్రమం నిర్వహించామని, లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు.
ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో ఇసుక మరియు మట్టి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. లబ్ధిదారులు తమ ప్రాంతంలోని చెరువులు లేదా పంట పొలాల నుండి మట్టిని వినియోగించుకునేందుకు గ్రామ పంచాయతీ కార్యదర్శి ద్వారా తహసీల్దార్ అనుమతి తీసుకోవాలని సూచించారు. ఇసుక సరఫరాకు సంబంధించి, రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఉచితంగా ఇసుక అందించేందుకు ఆదేశాలు జారీ చేశారు. అక్రమ ఇసుక తరలింపును నియంత్రించేందుకు టోకెన్ విధానాన్ని అమలు చేయాలని, అవసరమైతే ట్రాక్టర్లను సీజ్ చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.
జిల్లెల్ల గ్రామంలో 26 మంది లబ్ధిదారులను లాటరీ పద్ధతిలో ఎంపిక చేసి, వారికి మంజూరు పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్పర్సన్ వెలుముల స్వరూప తిరుపతిరెడ్డి, వైస్ చైర్మన్ నేరెళ్ల నర్సింగం గౌడ్, పిడి హౌసింగ్ శంకర్, డిపిఓ షర్ఫుద్దీన్, ఎంపీడీవో లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు. రాళ్ళపేట గ్రామంలో పైలట్ ప్రాజెక్టుగా నిర్మిస్తున్న ఇండ్ల పనులను కలెక్టర్ పరిశీలించి, అధికారులను అభినందించారు. ఇండ్ల నిర్మాణ పురోగతిని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, లబ్ధిదారులకు ప్రభుత్వ సహాయం సకాలంలో అందేలా చూడాలని ఆదేశించారు.

### లబ్ధిదారుల ఆవేదన :



**బర్ల లక్ష్మి :** ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల లిస్టులో నిన్నటి రోజు వరకు తన పేరు ఉందని ఈరోజు అధికారులు తన పేరును తొలగించాలని తెలుసుకొని ఇందిరమ్మ ఇండ్ల పంపిణీ వద్దకు వచ్చి నాకు న్యాయం చేయాలంటూ కోరింది.



**కడమంచి అనూష :** ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల లిస్టులో తన పేరు ఉందని తెలిపింది. తన కుమారుని ఆపరేషన్ నిమిత్తం శుక్రవారం రోజున ఆసుపత్రికి వెళ్లడం జరిగిందని ఈరోజు ఉదయం తన పేరును లిస్టులో నుండి తొలగించడం జరిగిందని నిరుపేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని కోరింది.



**దుబ్బాక మల్లవ్వ :** జిల్లల గ్రామంలో గత 30 సంవత్సరాలుగా అద్దెకు ఉంటున్నాడని తన పేరు ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల లిస్టులో పేరు ఉందని తనకు ముగ్గురు కూతుళ్లు ఉన్నారని మరి ఏ ఆధారం లేదని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేసింది.



# డెంగ్యూతో... మంచం పట్టిన పల్లె

- ఒకే గ్రామంలో 20 పాజిటివ్ కేసులు
- ఆస్పత్రులలో వణికిపోతున్న రోగులు

**నిజామాబాద్ జిల్లా బ్యూరో జులై 12 (జనం సాక్షి) :**
ఉమ్మడి నిజామాబాద్ జిల్లా విష జ్వరాలతో అతలాకుతలమౌతోంది. దీనికి కారణం కామారెడ్డి జిల్లాలో డెంగ్యూ విజృంభించి, ఆజ్యం పోస్తోంది. గత కొన్ని రోజులుగా పలు కేసులు నమోదవు తునే ఉన్నాయి. విష జ్వరాలతో బాధపడుతున్న రోగులతో ఆస్పత్రులన్నీ కిటకిట లాడు తున్నాయంటే నమ్మండి. ప్రధానంగా కామారెడ్డి జిల్లాలోని పాల్వంచ మండలంలో డెంగీ వ్యాధి కలకలం సృష్టిస్తోంది. ఒకే గ్రామంలో 20 మందికి పాజిటివ్ రావడం తీవ్రమైన ఆందోళనను కలిగిస్తోంది. పాల్వంచ మండలం లోని భవానీపేట గ్రామ పంచాయతీ పరిధిలో గల కిసాన్నగర్ లో డెంగ్యూ కలకలం రేపింది. దాదాపు ఇంటికొకరు చొప్పున డెంగీ బారిన పడ్డారు. గత 15 రోజులుగా పలువురు జ్వరంతో ఇబ్బందులు పడుతున్నారు. దీంతో వైద్యులు కాలనీలో రెండు మూడు రోజులుగా వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ వైద్య పరీక్షల్లో సుమారు 20 మందికి డెంగీ పాజిటివ్ నిర్ధారణ అయ్యిందని తెలిసింది. అందులో చిన్నారులు, వృద్ధులు సైతం ఉండడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. డెంగీ సోకిన వారు కొందరు జీజీహెచ్, మరికొందరు ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. డెంగీ లక్షణాలు ఉన్నవారికి గ్రామంలోనే వైద్యులు మందులు అందజేస్తున్నారు. దోమల వ్యాప్తి వల్లనే డెంగ్యూ సోకినట్టుగా ప్రజలు చెబుతున్నారు. దాంతో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో సిబ్బంది డ్రెయినేజీలు, రోడ్లను శుభ్రం చేస్తున్నారు. వైద్య సిబ్బంది కాలనీలోనే ఉంటూ డెంగీ బాధితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. కాలనీలో ప్రత్యేకంగా హెల్త్ క్యాంపు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

**ఇంత జరిగినా పట్టించుకోరేం :**
ప్రమాదకరమైన విష జ్వరాలు ఇంతగా సోకినప్పటికీ జిల్లా వైద్య శాఖ ఉన్నతాధికారులు కిమ్మనకపోవడం ఏమిటని కిసాన్ నగర్ గ్రామస్తులు అగ్గిమీద గుగ్గిలం అవుతున్నారు. తమ గ్రామంలో ఇంటికొకరు మంచం పట్టినా కేవలం నామమాత్రపు వైద్యం అందించి చేతులు దులుపుకుంటున్నారని ఆరోపించారు. అదేవిధంగా గ్రామం అపరిశుభ్రంగా ఉండడంతోనే మాకు ఈ గతి పట్టిందని, ఇప్పుడు తామంతా రోగాల బారిన పడ్డ తరువాత గ్రామంలో పారిశుధ్యం పనులు చేపడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికా రులు స్పందించి గ్రామాన్ని సందర్శించి తమను పట్టించుకొని ఈ పరిస్థితి రావడానికి కారకులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# అట్టహాసంగా ఆల్ ఇండియా చెస్ పోటీలు ప్రారంభం





- 600 మందికి పైగా క్రీడాకారులు హాజరు.
- పోటీలను ప్రారంభించిన డివైఎస్ఓ, ఒలంపిక్, ఉద్యోగుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు
- తొలిరోజు ముగిసిన నాలుగు రౌండ్ల పోటీలు

**కరీంనగర్ జిల్లా బ్యూరో, జులై 12 (జనంసాక్షి) :**
కరీంనగర్ వేదికగా జీనియస్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో డెమొక్రటిక్ చెస్ ఫెడరేషన్ సహకారంతో కరీంనగర్ లోని వీ కన్వెన్షన్ లో శనివారం 3వ ఆల్ ఇండియా జూనియర్, ఓపెన్ చెస్ చాంపియన్షిప్ 2025 పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలకు వివిధ ప్రాంతాల నుంచి సుమారు 600 మందికి పైగా క్రీడాకారులు హాజరయ్యారు. హాజరైన క్రీడాకారులకు స్విస్ లీగ్ పద్ధతిలో 8 రౌండ్ల వరకు పోటీలను నిర్వాహకులు ఏర్పాటు చేయగా తొలి రోజున నాలుగు రౌండ్ల వరకు పోటీలను నిర్వహించారు. అంతకుముందు ఈ పోటీలను జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి బి. శ్రీనివాస్ గౌడ్, ఉద్యోగుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు దారం శ్రీనివాస్ రెడ్డి, సంగం లక్ష్మణ్ , తెలంగాణ ఒలంపిక్ సంఘం సంయుక్త కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్ రెడ్డి లు హాజరై జ్యోతి ప్రద్యులను చేసి తొలి ఎత్తును వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కరీంనగర్ అంటేనే క్రీడా పోటీల నిర్వహణకు, క్రీడాకారులకు నిలయం అని అన్నారు. జాతీయస్థాయి చెస్ పోటీలకు ఆతిథ్యం ఇవ్వడం గర్వంగా ఉందని పోటీలను ఘనంగా నిర్వహిస్తున్న నిర్వాహకులను ఈ సందర్భంగా వారు అభినందించారు. చదరంగం క్రీడ విద్యార్థుల మెదస్సుకు పదను పెడుతుందన్నారు. చెస్ లో రాణించిన విద్యార్థులు అన్ని రంగాల్లో రాణిస్తారు అన్నారు. ప్రస్తుత కాలంలో విద్యార్థులందరూ విశ్వనాథన్ ఆనంద్, గుకేష్, ప్రజ్ఞానంద్, అర్జున్ ఎరిగేసి, కోనేరు హంపి లాంటి మహోన్నత వ్యక్తులను స్ఫూర్తిగా తీసుకొని ఎదగాలని సూచించారు. పోటీల నిర్వాహకులు జీనియస్ అకాడమీ డైరెక్టర్ కోచ్ కంకటి అనూప్ కుమార్ మాట్లాడుతూ అందరి సహకారంతో కరీంనగర్ లో మూడవసారి ఆల్ ఇండియా స్థాయిలో పోటీలను నిర్వహించినట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లాలో చెస్ క్రీడకు క్రేజీ తెచ్చేందుకే ప్రతి సంవత్సరం పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు సుమారు లక్ష రూపాయల పైగా నగదు పురస్కారాలను అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీనియస్ చెస్ అకాడమీ వ్యవస్థాపకులు కంకటి కనకయ్య, కోఆర్డినేటర్ సృజన్ కుమార్, చీఫ్ ఆర్బిటర్ బొల్లం సంపత్, ఉష టేబుల్ టెన్నిస్ క్రీడా సంఘాల కార్యదర్శులు భార విద్యాసాగర్, దారం గౌతమ్ రెడ్డి, జిల్లా ప్రైవేట్ వ్యాయామ విద్య ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షులు శ్రీధర్ గౌడ్ లతోపాటు నూనె సాయి కృష్ణ, తాటిపల్లి సతీష్ బాబు, క్రీడాకారులు, తల్లిదండ్రులు , పీ ఈ టీ లు తదితరులు పాల్గొన్నారు.



## ఆదర్శ దంపతులకు ప్రభుత్వం నుండి ఆర్థిక సహాయం

**ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి**

**తాండూరు జులై 12(జనంసాక్షి) :**
వికారాబాద్ జిల్లా తాండూరు నియోజకవర్గం పెద్దేముల్ మండలంలోని నాగులపల్లి గ్రామానికి చెందిన హరిజన్ తుల్జరాం, చెంగోల్ గాయత్రి గత రెండు సంవత్సరాల క్రితం కులాంతర వివాహం చేసుకున్నారు. ఇందుకు గాను ప్రభుత్వం నుంచి అందే ఆర్థిక సహాయం రూ. 2,50,000 చెక్కును ఎమ్మెల్యే క్యాంపు కార్యాల యంలో వారి దంపతులకు ఎమ్మెల్యే బుయ్యని మనో హర్ రెడ్డి, మరియు నారాయణ పేట్ ఎమ్మెల్యే పర్ణిక రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

# బీసీల రిజర్వేషన్‌పై బిజెపి ఎందుకు జాప్యం

- స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరవేస్తాం, బీసీలు కాంగ్రెస్ పార్టీకి రుణపడి ఉంటారు
- డిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్, కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, నగర కాంగ్రెస్ బీసీ సెల్ అధ్యక్షులు, బోనాల శ్రీనివాస్




**కరీంనగర్ జిల్లా బ్యూరో, జులై 12 (జనంసాక్షి) :**
స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని తెలంగాణ రాష్ట్ర సర్కార్ తీసుకున్న నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ శనివారం రోజు నగర కాంగ్రెస్ బీసీ సెల్ అధ్యక్షులు బోనాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో నగరంలోని ఇందిరా చౌక్ వద్ద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చిత్రపటాలకు పాలాభిషేకం చేయడంతో పాటు బాణాసంచా కాల్చి మిఠాయిలు పంచి సంబరాలు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా కార్యక్రమానికి విచ్చేసిన పీసీసీ కార్యదర్శి వైద్యుల అంజన్ కుమార్, డిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి మాట్లాడుతూ... కామారెడ్డి డిక్లరేషన్ లో భాగంగా జాతీయ కాంగ్రెస్ అఖిల పక్ష నాయకులు రాహుల్ గాంధ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడితే బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇస్తామని ఇచ్చిన హామీని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలో రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ నాయకత్వంలో తెలంగాణ శాసనసభ , శాసనమండలిలో బిల్లును ప్రవేశపెట్టి తీర్మానం చేయడమే కాక ఆ బిల్లును గవర్నర్ ద్వారా కేంద్ర ప్రభుత్వానికి పంపడం జరిగింది, కానీ కేంద్రంలోని నరేంద్ర మోడీ సర్కార్ గత 8 నెలలుగా ఈ విషయంలో కాలయాపన చేస్తుంది, ఇందులో భాగంగా తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గం బీసీలకు రేపు రాబోయే స్థానిక సంస్థలు ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కి రాష్ట్ర మంత్రివర్గ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేస్తామని ధీమా వ్యక్తం చేస్తూ, కేంద్ర మంత్రి బండి సంజయ్ , బిజెపి పార్టీ ప్రతినిధులు దేశవ్యాప్తంగా కులగనన జరిపే విధంగా ప్రధాని నరేంద్ర మోడీ పై ఒత్తిడి తీసుకురావాలని, బీసీల పట్ల తమ వైఖరియంతో స్పష్టం చేయాలని డిమాండ్ చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎండి తాజ్,గడ్డం విలాస్ రెడ్డి, ఎస్ఎస్ మోసిన్, అహమ్మద్ అలీ, పొన్నం శ్రీనివాస్ గౌడ్, రాచకొండ చక్రధర్ రావు, వంగల విద్యాసాగర్, నాగుల సతీష్, నిహాల్, చింతల కిషన్, తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, బోనాల మురళి, బొమ్మ ఈశ్వర్ గౌడ్, ముద్దసాని క్రాంతి, రాచర్ల పద్మ, జిఎస్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



## ఇంజనీర్ల దినోత్సవాన్ని విస్మరించి ప్రభుత్వం మైనార్టీల పట్ల చిన్నచూపు చూస్తుంది

**తెలంగాణ స్టేట్ మైనార్టీ హక్కుల పోరాట సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ మహమ్మద్ వసీం**

**బొంరాస్ పేట,జూలై 12 (జనం సాక్షి):**
ఈనెల 11న ఇంజనీర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రముఖ ఇంజనీర్ నవాబు అలీ నవాజ్ జంగ్ బహదూర్ జయంతి కార్యక్రమాన్ని ప్రభుత్వం విస్మరించిందని తెలంగాణ స్టేట్ మైనార్టీ హక్కుల పోరాట సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ మహమ్మద్ వసీం అన్నారు. నవాబు అలీ నవాజ్ శంకు బహదూర్ నిజాం పాలనలో చీఫ్ ఇంజనీర్ గా ఉన్న సమయంలో తెలంగాణ రాష్ట్రానికి ప్రాణవాయువుగా నిలిచిన నీటిపారుదల నిర్మాణాలు నిజాంసాగర్ ,పోచారం,వైరా, పాలేరు,ఎగువ మానేరు,డిండి, హిమాయత్ సాగర్, ఉస్మాన్ సాగర్, నాగార్జునసాగర్ వంటి మొదలగు నిర్మాణాలకు ఆయన చేసిన సేవలు నిలువెత్తు నిదర్శనం అన్నారు. మైనార్టీల పట్ల ప్రభుత్వం చిన్న చూపు చూసే ధోరణి కనిపిస్తుందన్నారు.



# అధికారుల కాంట్రాక్టర్ల చేతి వాటం?

## *సీసీ రోడ్ నాణ్యత లోపం.. మూడేళ్లకే పగుళ్లు*

- డివైడర్ పేరు చెప్పి మరచిపోయిన వైనం
- ఇబ్బందులు పడుతున్నారు వాహన దారులు

**జనంసాక్షి జులై 12 (జనంసాక్షి) :** ప్రభుత్వ నిధులను ప్రజా అవసరాల కోసం వాడాల్సిన అధికారులు కాంట్రాక్టర్లతో చేతులు కలిపి నాణ్యత లేకున్నా బిల్లులు మంజూరు చేస్తున్నారు. రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండల కేంద్రంలో భారత్ పెట్రోలియం పంపు నుండి గాడిబాయ్ వరకు ఎన్ఆర్ఈజీఎస్ నిధుల నుండి సుమారు 60 లక్షల వ్యాయంతో సిసి రోడ్డు పనులు నిర్మించారు. కానీ డివైడర్ పేరుతో రోడ్డుకు మధ్యలో ఖాళీ స్థలాన్ని వదిలేసారు. వర్షాకాలం గుంతలు పడే అనేకమంది వాహనదారులు కింద పడే పరిస్థితి నెలకొంది. అధికారులు నాణ్యతను పరీక్షించకుండానే నిధులు మంజూరు చేస్తున్నారని గ్రామస్తులు మండిపడుతున్నారు. కాంట్రాక్టర్ లబ్దికోసం వాళ్లతో చేతులు కలిపి రోడ్లు నాణ్యత లేకున్నా నిధులు మంజూరు చేయడం సబబు కాదని అధికారులు రోడ్డును పరీక్షించి నిర్లక్ష్యం వహించిన కాంట్రాక్టర్ల బిల్లులు రద్దుచేసి ప్రభుత్వ నిధులను రికవరీ చేయాలని ప్రజలు కోరుతున్నారు.





## కృష్ణనగర్ లో14 లక్షల అంచనా వ్యయంతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు

**నాచారం (జనంసాక్షి) :** మీర్పేట్ హెచ్‌బి కాలనీ డివిజన్‌లోని కృష్ణనగర్‌లో 14 లక్షల అంచనా వ్యయంతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం పనులన ప్రారంభించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, స్థానిక కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్ రెడ్డి. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అభివృద్ధి విషయంలో అవసరమైన సహకారం అందిస్తూ ఎల్లవేళలా మీకు అందుబాటులో ఉంటానని, ఉప్పల్ నియోజకవర్గం యొక్క అభివృద్ధికి పూర్తి స్థాయిలో కృషి చేస్తానని తెలిపారు. అలాగే ఎమ్మెల్యే కాలనీవాసుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్ మాట్లాడుతూ ఎల్లవేళలా డివిజన్ ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కార దిశగా కృషి చేస్తామని అలాగే డివిజన్ అభివృద్ధి విషయంలో సహకారం అందిస్తున్న ఎమ్మెల్యేకి, డివిజన్ నాయకులకు కార్పొరేటర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## భారతీయ విద్యార్థులను ఆహ్వానించిన బ్రిటీష్ కౌన్సిల్

**ఖైరతాబాద్ , జూలై 12 (జనం సాక్షి) :** యుకెలో అంతర్జాతీయంగా విద్యా అవకాశాలు, కల్చరల్ ఎక్స్చేంజ్ సంస్థ బ్రిటిష్ కౌన్సిల్ భారతదేశం నుండి విద్యార్థులను భారత కాలమానం ప్రకారం జూలై 29 మ.3 నుంచి సా.5 వరకు జరిగే స్టడీ యుకె ప్రీ-డిపార్చర్ బ్రీఫింగ్ లో పాల్గొనడానికి ఆహ్వానిస్తోందని బ్రిటీష్ కౌన్సిల్ ప్రతినిధులు శనివారం నగ రంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నా రు. వారు మాట్లాడుతూ ఈ వర్చువల్ ఈవెంట్ యూకే ఉన్నత విద్యా సంస్థలో చదువుకోవడానికి ఆఫర్ పొందిన విద్యార్థుల కోసం రూపొందించ బడిందని తెలిపారు.

## ప్రైవేట్ పాఠశాలల స్కూల్ లీడర్ షిప్ 2025 సమావేశం



**కరీంనగర్ జిల్లా బ్యూరో, జులై 12 (జనంసాక్షి) :**
కరీంనగర్ పట్టణంలోని మహాలక్ష్మి కళ్యాణ మండపంలో ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్స్ స్కూల్ లీడర్షిప్ కాన్ఫరెన్స్ 2025 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాలానుగుణంగా విద్యా విధానంలో తీసుకు రావలసిన నూతన విధానాల గురించి విపులంగా చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ... మౌ పద్ధతిలో ప్రభుత్వ పాఠశాలలోని 6 గురు విద్యార్థులను దత్తత తీసుకుని దాదాపు 6 నెలల పాటు శిక్షణ ఇచ్చి అంతర్జాతీయ వేదిక పైన మాట్లాడేలా సిద్ధం చేసిన పారమిత యాజమాన్యానికి డా. ఇనుగంటి ప్రసాదరావుకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.
అలాగే ఈ కార్య క్రమానికి విచ్చేసిన ప్రముఖ విద్యా వేత్త మాజీ సిఐఈటి ఎన్సి ఈఆర్టి డైరెక్టర్ ప్రొఫెసర్ రాజారామ్ మాట్లాడుతూ మారుతున్న కాలానుగుణంగా పాఠశాలల పరిపూర్ణ విద్యా భివృద్ధి కొరకు మెళకువలను వివరించారు. పారమిత పాఠశాలల అధినేత పాఠశాలల పనితనాన్ని మెరుగు పరచడానికి అడ్వాన్స్ టీచర్ ట్రైనింగ్ ప్రోగ్రాంను పారమి త పాఠశాలలో ప్రారంభించామని ఇట్టి అవకాశాన్ని అందరూ వినియోగించు కోగలరు అని దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమలో కరీంనగర్ పట్టణంలోని పారమిత పాఠశాల విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, కరీంనగర్ పట్టణంలోని బధిర పాఠశాల విద్యార్థులు పాడిన గీతాలు ఆద్యంతం ఆహుతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో తెలంగాణరాష్ట్రంలోని 100 ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు పాల్గొన్నాయి.

# గోదావరిఖని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో అవగాహన కార్యక్రమం

- అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే..పోలీసులకు సమాచారం ఇవ్వాలి
- ప్రతి ఒక్కరూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి
- వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి



**గోదావరిఖని, జనంసాక్షి:**
రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధి లోని పెద్దపల్లి జోన్ గోదావరిఖని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గంగా నగర్‌లో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో ప్రతి ఇంటిని తనిఖీ చేసి, నివాసితుల వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా దొంగతనాలు, గంజాయి, డ్రగ్స్, సైబర్ క్రైమ్స్, రోడ్ భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీఐ ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ, కిరాయిదారుల వివరాలైన ఆధార్, గత నివాస స్థలం, కుటుంబం, ఉద్యోగ వివరాలు తప్పనిసరిగా సేకరించాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులను గమనిస్తే పోలీసులకు సమాచారం అందించాలని, పగటి సమయంలో బట్టలు, బెడ్‌షీట్‌లు, ఇతర సామాగ్రి కొంటామని చెప్పే వారు రాత్రిపూట దొంగతనాలకు పాల్పడుతున్నారని హెచ్చరించారు. ప్రతి ఇంటికి రెండు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సలహా ఇచ్చారు. గంజాయి, మత్తు పదార్థాల వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేస్తుందని, చెడు వ్యసనాల వల్ల నేరాలకు పాల్పడుతు న్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో గంజాయి అక్రమ రవాణాపై కేసులు నమోదైనట్లు తెలిపారు.
గంజాయి విక్రయం, రవాణా, వినియోగంపై సమాచారం అందిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. సైబర్ నేరాలపై రామగుండం సైబర్ క్రైమ్స్ పోలీసులు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. ట్రాఫిక్ నిబంధనలు, రోడ్ భద్రత పాటించాలని, వాహన ధ్రువీకరణ పత్రాలు ఉంచుకోవాలని సూచించారు. రాష్ డ్రైవింగ్, ట్రిపుల్ డ్రైవింగ్, లైసెన్స్ లేని డ్రైవింగ్, మైనర్ డ్రైవింగ్ వల్ల ప్రమాదాలు సంభవిస్తున్నాయని, తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని హెచ్చరించారు. ప్రమాదాలకు కారణమైతే వాహన యజమానులపై కేసులు నమోదవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ భూమేష్, అనూష, స్పెషల్ పార్టీ సిబ్బంది, స్థానిక ప్రజలు, యువత, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## టీ20 ప్రపంచ కప్ టోర్నీకి ఇటలీ మొదటిసారిగా అర్హత



టీ20 క్రికెట్ పరిచయం తర్వాత ప్రపంచవ్యాప్తంగా క్రికెట్ ప్రజాదరణ పొందుతోంది. మూడు గంటల్లోనే మ్యాచ్ ఉత్సాహంగా ముగుస్తుంది. కాబట్టి అనేక యూరోపియన్ దేశాలు క్రికెట్ ఆడేందుకు ఆసక్తిని చూపుతున్నాయి. వచ్చే ఏడాది భారత్, శ్రీలంక దేశాలు సంయుక్తంగా ఆతిథ్యం ఇవ్వనున్న టీ20 ప్రపంచ కప్ టోర్నీకి ఇటలీ మొదటిసారిగా అర్హత సాధించింది. దీని ద్వారా ఇప్పటివరకు క్రికెట్ వైపు చూడని యూరోపియన్ దేశాలలో ఇటలీ అర్హత సాధించడం ఒక ప్రత్యేకత. టీ20 ప్రపంచ కప్ టోర్నమెంట్ కోసం యూరోపియన్ ప్రాంతీయ క్వాలిఫయర్ మ్యాచ్‌లు జరిగాయి. ఇందులో ఇటలీ, నెదర్లాండ్స్ జట్లు తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో ఇటలీ నిర్దేశించిన 135 పరుగుల లక్ష్యాన్ని నెదర్లాండ్స్ జట్టు 16.2 ఓవర్లలో ఛేదించింది. దీని ద్వారా నెదర్లాండ్స్ జట్టు టీ20 ప్రపంచ కప్ టోర్నీకి నేరుగా అర్హత సాధించింది. నెదర్లాండ్స్ జట్టుపై ఇటలీ ఓడినప్పటికీ.. గ్రూప్‌లో 4 మ్యాచ్ లు ఆడిన ఇటలీ 2 విజయాలు, ఒక పరాజయం, ఒక ఫలితం తేలని మ్యాచ్‌తో 5 పాయింట్లు ఖాతాలో వేసుకుని పాయింట్ల పట్టికలో రెండో స్థానంలో నిలవడం ద్వారా ముందంజ వేసింది.పాయింట్ల పట్టికలో స్కాట్లాండ్ జట్టుతో పోలిస్తే అధిక రన్ రేట్ సాధించిన ఇటలీ జట్టు ప్రస్తుతం టీ20 ప్రపంచ కప్ టోర్నీకి అర్హత సాధించింది. ఇదిలా ఉండగా.. గత 4 టీ20 ప్రపంచ కప్ టోర్నమెంట్లలో స్థానం సంపాదించిన స్కాట్లాండ్ జట్టు ప్రస్తుతం టీ20 ప్రపంచ కప్ టోర్నీకి అర్హత సాధించకుండానే నిష్క్రమించింది. మొత్తం 20 జట్లు 2026 టీ20 ప్రపంచ కప్ టోర్నమెంట్‌లో ఆడనున్నాయి. ప్రస్తుతం వరకు 15 జట్లు అర్హత సాధించాయి. ఇంకా ఈస్ట్ ఆసియా పసిఫిక్ క్వాలిఫయర్ టోర్నమెంట్ నుంచి 3 జట్లు, ఆఫ్రికా క్వాలిఫయర్ ద్వారా రెండు జట్లు ప్రపంచ కప్ టోర్నమెంట్‌కు అర్హత సాధించనున్నాయి. ఈ నేపథ్యంలో మాజీ ఆస్ట్రేలియా టెస్ట్ క్రికెట్ ఆటగాడు జో బర్న్స్ ప్రస్తుతం ఇటలీ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నాడు. గత టీ20 ప్రపంచ కప్ టోర్నమెంట్ సమయంలో పాకిస్థాన్ అమెరికా జట్టుతో ఓడిపోయిన నేపథ్యంలో.. ప్రస్తుతం ఇటలీ జట్టు ప్రపంచ కప్ టీ20 టోర్నమెంట్‌లో ఆడనున్నందున పాకిస్తాన్ జట్టు జాగ్రత్తగా ఉండాలని భారత అభిమానులు సరదాగా కామెంట్లు చేస్తున్నారు.

# రసవత్తరంగా మూడో టెస్ట్

### జడేజా హాఫ్ సెంచరీతో ఆదుకున్న భారత్



లండన్‌లోని ప్రతిష్ఠాత్మక లార్డ్స్ స్టేడియంలో ఇంగ్లండ్‌తో జరుగుతున్న మూడో టెస్ట్ మ్యాచ్‌లో భారత సీనియర్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా (53 నాటౌట్) అద్భుత ప్రదర్శనతో జట్టును ఆదుకున్నాడు. ఈ సిరీస్‌లో వరుసగా మూడో హాఫ్ సెంచరీ సాధించిన జడేజా, టెస్ట్ క్రికెట్‌లో తొలిసారిగా హ్యాట్రిక్ ఫిఫ్టీలు నమోదు చేశాడు. టీ సెషన్ తర్వాత జో రూట్ బౌలింగ్‌లో మిడ్-ఆఫ్‌పై బౌండరీతో 87 బంతుల్లో తన 25వ టెస్ట్ ఫిఫ్టీని పూర్తి చేసుకున్న జడేజా, తన సిగ్నేచర్ 'బ్యాటుసాము' సెలబ్రేషన్‌తో అభిమానులను అలరించాడు.

అయితే, బ్రేక్ తర్వాత నితీశ్ కుమార్ రెడ్డి (30)ని బెన్ స్టోక్స్ ఔట్ చేయడంతో భారత్ ఆరో వికెట్ కోల్పోయింది. జడేజా, నితీశ్‌తో కలిసి 72 పరుగుల కీలక భాగస్వామ్యం నెలకొల్పి జట్టును 254/5 నుంచి ఆదుకున్నాడు. ప్రస్తుతం వాషింగ్టన్ సుందర్ (5 నాటౌట్)తో కలిసి జడేజా మరో కీలక భాగస్వామ్యం నిర్మిస్తున్నాడు. మూడో రోజు ఆట ముగిసే సమయానికి భారత్ స్కోరు 376/6 వద్ద ఉండగా, ఇంగ్లండ్ మొదటి ఇన్నింగ్స్ స్కోరు (387) కంటే 11 పరుగులు మాత్రమే వెనుకబడి ఉంది. జడేజా, సుందర్‌తో పాటు టెయిలెండర్లు అకాశ్ దీప్, ప్రసిద్ధ్ కృష్ణలు నిలకడగా ఆడితే భారత్ ఆధిక్యం సాధించే అవకాశం ఉంది. ఇంగ్లండ్ బౌలర్లు బెన్ స్టోక్స్, జో రూట్‌లు ఒత్తిడి పెంచుతుండగా, గాయం నుంచి కోలుకున్న షోయబ్ బషీర్ తిరిగి బౌలింగ్‌కు సిద్ధమవుతున్నాడు, ఇది భారత బ్యాట్స్‌మెన్‌కు మరింత సవాలుగా మారనుంది.

మరోవైపు, ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 387 పరుగులు చేసింది, ఇందులో జో రూట్ (104) సెంచరీతో రాణించగా, జస్ప్రీత్ బుమ్రా 5/74 తీసి భారత బౌలింగ్‌ను నడిపించాడు. ప్రస్తుతం సిరీస్ 1-1తో సమంగా ఉండగా, ఈ టెస్ట్ ఫలితం రెండు జట్లకూ కీలకం. మూడో రోజు ఆట రసవత్తరంగా సాగుతోంది, భారత్ ఆధిక్యం కోసం పోరాడుతుండగా, ఇంగ్లండ్ బౌలర్లు వికెట్ల కోసం ఒత్తిడి పెంచుతున్నారు. సెంచరీతో చరిత్ర సృష్టించిన కేఎల్ రాహుల్

టీమిండియా స్టార్ ఓపెనర్ కేఎల్ రాహుల్ దుమ్మురేపుతున్నాడు. ఐదు టెస్ట్‌ల అండర్సన్-సచిన్ ట్రోఫీలో రెండో సెంచరీ నమోదు చేశాడు. లార్డ్స్ వేదికగా జరుగుతున్న మూడో టెస్ట్ తొలి ఇన్నింగ్స్‌లో జోఫ్రా ఆర్చర్ బౌలింగ్‌లో సింగిల్ తీసిన రాహుల్.. 176 బంతుల్లో శతకాన్ని పూర్తి చేసుకున్నాడు. అద్భుతమైన బ్యాటింగ్‌తో కీలక భాగస్వామ్యాలతో రాహుల్ జట్టును ఆదుకున్నాడు. అయితే సెంచరీ పూర్తయిన వెంటనే షోయబ్ బషీర్ బౌలింగ్‌లో ఔటయ్యాడు. కరుణ్ నాయర్‌తో కలిసి రెండో వికెట్‌కు 61 పరుగులు జోడించిన రాహుల్.. రిషభ్ పంత్‌తో నాలుగో వికెట్‌కు 141 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. క్రికెట్ పుట్టిల్లు లార్డ్స్‌లో రాహుల్‌కు ఇది రెండో సెంచరీ. దాంతో ఓ అరుదైన రికార్డ్‌ను కేఎల్ రాహుల్ తన ఖాతాలో వేసుకున్నాడు. టెస్ట్‌ల్లో లార్డ్స్ వేదికగా రెండు శతకాలు నమోదు చేసిన తొలి ఆసియా ఓపెనర్‌గా నిలిచాడు. ఈ ఘనతను అందుకున్న రెండో బ్యాటర్‌గా చరిత్రకెక్కాడు.

### కపిల్ దేవ్‌ను దాటేసిన బుమ్రా

లార్డ్స్ టెస్ట్‌లో జస్ప్రీత్ బుమ్రా భారత ఫాస్ట్ బౌలర్లకు ఇప్పటివరకు కలలో కూడా సాధ్యం కాని దాన్ని నిజం చేశాడు. వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్ కారణంగా రెండో టెస్ట్‌కు దూరంగా ఉన్న బుమ్రా, మూడో టెస్ట్ రెండో రోజు ఉదయం బంతి పట్టుకోగానే ఇంగ్లాండ్ బ్యాట్స్‌మెన్‌లపై సునామీలా విరుచుకుపడ్డాడు. అతను ఈ ఇన్నింగ్స్లో 5 వికెట్లు తీయడమే కాకుండా దిగ్గజ బౌలర్ కపిల్ దేవ్ రికార్డును కూడా బద్దలు కొట్టాడు. లార్డ్స్ టెస్ట్ మొదటి ఇన్నింగ్స్‌లో 5 వికెట్లు పడగొట్టి, జస్ప్రీత్ బుమ్రా తన కెరీర్‌లో 15వ ఐదు వికెట్ల ఘనతను పూర్తి చేసుకున్నాడు. దీనిలో స్పెషాలిటీ ఏంటంటే.. ఇది విదేశీ గడ్డపై బుమ్రా 13సార్లు ఐదు వికెట్లు తీసిన ఘనతను సాధించాడు. దీంతో అతను కపిల్ దేవ్‌ను వెనక్కి నెట్టాడు. కపిల్ దేవ్ పేరు మీద 12 సార్లు ఐదు వికెట్లను తీసిన ఘనత సాధించిన రికార్డు ఉంది. ఇప్పుడు బుమ్రా విదేశీ గడ్డపై అత్యధిక సార్లు ఐదు వికెట్లు తీసిన భారత బౌలర్‌గా నిలిచాడు.

# జో రూట్ ప్రపంచ రికార్డ్

### అత్యధిక క్యాచ్‌లు తీసుకున్న జో రూట్

టెస్ట్ క్రికెట్ చరిత్రలో కేవలం నలుగురు ఆటగాళ్ళు మాత్రమే 200ం క్యాచ్‌లు తీసుకున్నారు. ఇంగ్లాండ్‌కు చెందిన జో రూట్ ఇప్పుడు ఈ జాబితాలో అగ్రస్థానంలో నిలిచాడు. అది కూడా రాహుల్ ద్రవిడ్ పేరిట ఉన్న ప్రపంచ రికార్డును బద్దలు కొట్టి.. నంబర్ వన్‌గా నిలిచాడు.లార్డ్స్ వేదికగా భారత్ తో జరిగిన 3వ టెస్ట్ మ్యాచ్ లో జో రూట్ టీమిండియా బ్యాట్స్ మన్ కరుణ్ నాయర్ ను క్యాచ్ తో పట్టుకున్నాడు. ఈ క్యాచ్ తో టెస్ట్ క్రికెట్ చరిత్రలో అత్యధిక క్యాచ్ లు పట్టిన ఫీల్డర్ గా జో రూట్ ప్రపంచ రికార్డు సృష్టించాడు. గతంలో ఈ రికార్డు భారత మాజీ కెప్టెన్ రాహుల్ ద్రవిడ్ పేరిట ఉండేది. 301 టెస్ట్ ఇన్నింగ్స్‌లలో ఫీల్డింగ్ చేసిన ద్రవిడ్ మొత్తం 210 క్యాచ్‌లు పట్టి ప్రపంచ రికార్డు సృష్టించాడు. ఇప్పుడు జో రూట్ ఈ రికార్డును బద్దలు కొట్టడంలో విజయం సాధించాడు. జో రూట్ ఇప్పటివరకు 156 టెస్ట్ మ్యాచ్‌లు ఆడి, 296 ఇన్నింగ్స్‌లలో ఫీల్డింగ్ చేశాడు. ఈ సమయంలో, అతను తీసుకున్న క్యాచ్‌ల సంఖ్య సరిగ్గా 211లి. దీనితో, టెస్ట్ క్రికెట్ చరిత్రలో అత్యధిక క్యాచ్‌లు తీసుకున్న ఫీల్డర్‌గా జో రూట్ ప్రపంచ రికార్డు సృష్టించాడు. అంతర్జాతీయ క్రికెట్ చరిత్రలో అత్యధిక క్యాచ్‌లు పట్టిన ప్రపంచ రికార్డు శ్రీలంక మాజీ కెప్టెన్ మహేల జయవర్ధనే పేరిట ఉంది. అంతర్జాతీయ క్రికెట్‌లో 768 ఇన్నింగ్స్‌లలో (టీ20ంటెస్ట్ంవన్డే) ఫీల్డింగ్ చేసిన జయవర్ధనే మొత్తం 440 క్యాచ్‌లు పట్టడం ద్వారా ఈ ప్రపంచ రికార్డును నెలకొల్పాడు.

# ఇగా.. మురిపెం

### వింబుల్డన్ క్వీన్ స్వియాటెక్..

### పోలాండ్ తొలి ఛాంపియన్‌గా రికార్డు..!

**వింబుల్డన్ 2025 మహిళల సింగిల్స్ టైటిల్‌ను పోలాండ్‌కు చెందిన ఇగా స్వియాటెక్ సొంతం చేసుకుంది, తద్వారా పోలాండ్‌కు తొలి వింబుల్డన్ ఛాంపియన్‌గా చరిత్ర సృష్టించింది. శనివారం జరిగిన ఫైనల్‌లో అమెరికా ఆటగాడు అమందా అనిసిమోవాను 6-0, 6-0తో ఏకపక్షంగా ఓడించి, కేవలం 57 నిమిషాల్లో తన మొదటి వింబుల్డన్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. ఈ విజయంతో ఆమె తన ఆరో గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను అందుకుంది, ఇందులో నాలుగు ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్స్ (2020, 2022, 2023, 2024) మరియు ఒక యూఎస్ ఓపెన్ టైటిల్ (2022) ఉన్నాయి. 24 ఏళ్ల స్వియాటెక్, గడ్డి మైదానంపై తన తొలి గ్రాండ్‌స్లామ్ విజయాన్ని సాధించి, మూడు రకాల ఉపరితలాలపై (క్లే, హార్డ్, గ్రాస్) గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ గెలిచిన అరుదైన క్రీడాకారుల జాబితాలో చేరింది.**

వింబుల్డన్‌లో మరో కొత్త ఛాంపియన్. పోలాండ్‌కు చెందిన ఇగా స్వియాటెక్ ఈ మెగా టోర్నీలో విజేతగా అవతరించింది. మహిళల సింగిల్స్ ఫైనల్లో అద్భుత విజయంతో టైటిల్ కైవసం చేసుకుంది. శనివారం ఏకపక్షంగా సాగిన రెండు సెట్లలో జోరు చూపించిన పోలాండ్ భామ అమెరికా సంచలనం అమందా అనిస్మోవాకు చెక్ పెట్టింది. రెండో సెట్ గెలుపొందిన తర్వాత సంతోషం పట్టలేకపోయిన స్వియాటెక్ కోర్టులోనే గెంతులు వేస్తూ సంబురాలు చేసుకుంది. ఆ తర్వాత గ్యాలరీలోని తనటీమ్, కుటుంబ సభ్యులతో తన విజయానందాన్ని పంచుకుంది. మొత్తంగా ఆమెకిది ఆరో గ్రాండ్‌స్లామ్ టైటిల్. ఇక తొలిసారి గ్రాండ్‌స్లామ్ ఫైనల్ చేరిన అమెరికా ప్లేయర్ అమందా రన్నరప్‌తో సరిపెట్టుకుంది. ఫేవరెట్‌గా వింబుల్డన్ టోర్నీలో అడుగుపెట్టిన స్వియాటెక్ తన కలను సాకారం చేసుకుంది. సెంటర్ కోర్టులో తొలి నిమిషం నుంచి ధాటిగా ఆడిన పోలాండ్ బ్యూటీ 6-0తో తొలి సెట్‌ను అలవోకగా గెలుచుకుంది. అయితే.. అమందా ఎంత ప్రయత్నించినా ఒక్క పాయింట్ కూడా సాధించలేకపోయింది. అదే జోరును చూపించిన స్వియాటెక్ రెండో సెట్‌ను కూడా 6-0తో ముగించి విజేతగా అవతరించింది. దాంతో, వింబుల్డన్ 114 ఏళ్ల చరిత్రలో ఒక్క పాయింట్ కూడా గెలవకుండా ఫైనల్లో ఓడిన క్రీడాకారిణిగా అమందా రికార్డు నెలకొల్పింది.

వింబుల్డన్ 2025 మహిళల సింగిల్స్ టైటిల్‌ను పోలాండ్‌కు చెందిన ఇగా స్వియాటెక్ సొంతం చేసుకుంది, తద్వారా పోలాండ్‌కు తొలి వింబుల్డన్ ఛాంపియన్‌గా చరిత్ర సృష్టించింది. శనివారం జరిగిన ఫైనల్‌లో అమెరికా ఆటగాడు అమందా అనిసిమోవాను 6-0, 6-0తో ఏకపక్షంగా ఓడించి, కేవలం 57 నిమిషాల్లో తన మొదటి వింబుల్డన్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. ఈ విజయంతో ఆమె తన ఆరో గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను అందుకుంది, ఇందులో నాలుగు ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్స్ (2020, 2022, 2023, 2024) మరియు ఒక యూఎస్ ఓపెన్ టైటిల్ (2022) ఉన్నాయి. 24 ఏళ్ల స్వియాటెక్, గడ్డి మైదానంపై తన తొలి గ్రాండ్‌స్లామ్ విజయాన్ని సాధించి, మూడు రకాల ఉపరితలాలపై (క్లే, హార్డ్, గ్రాస్) గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ గెలిచిన అరుదైన క్రీడాకారుల జాబితాలో చేరింది.

సెంటర్ కోర్టులో జరిగిన ఈ మ్యాచ్‌లో స్వియాటెక్ తొలి నిమిషం నుంచి ఆధిపత్యం చెలాయించింది. తొలి సెట్‌ను 25 నిమిషాల్లో 6-0తో కైవసం చేసుకుంది, ఈ సమయంలో అనిసిమోవా 14 అనవసర తప్పిదాలు చేసింది, స్వియాటెక్ కేవలం రెండు తప్పిదాలతో ఆడింది. రెండో సెట్‌లో కూడా అదే జోరును కొనసాగించిన స్వియాటెక్, మరో 6-0 విజయంతో మ్యాచ్‌ను ముగించి, వింబుల్డన్ చరిత్రలో 114 ఏళ్ల తర్వాత (1911లో డొరోథియా లాంబర్ట్ ఛాంబర్స్ తర్వాత) 6-0, 6-0 స్కోర్‌లైన్‌తో ఫైనల్ గెలిచిన తొలి క్రీడాకారిణిగా రికార్డు సృష్టించింది. ఈ విజయం ఓపెన్ ఎరాలో వింబుల్డన్ సింగిల్స్ ఫైనల్‌లో ఒక్క గేమ్ కూడా గెలవని ఆటగాడిగా అనిసిమోవాను నిలిపింది.

23 ఏళ్ల అమందా అనిసిమోవా, తన తొలి గ్రాండ్‌స్లామ్ ఫైనల్‌లో ఆడుతూ, స్వియాటెక్ యొక్క నిరంతర ఒత్తిడి ముందు నిలబడలేకపోయింది. గత ఏడాది వింబుల్డన్ క్వాలిఫైయర్‌లో ఓడిన అనిసిమోవా, 2019 ఫ్రెంచ్ ఓపెన్ సెమీఫైనలిస్ట్‌గా గుర్తింపు పొందినప్పటికీ, ఈ ఫైనల్‌లో 28 అనవసర తప్పిదాలతో రన్నరప్‌గా నిలిచింది. ఆమె తన సర్వ్‌లో 33% మాత్రమే ఫస్ట్ సర్వ్‌లు వేయగలిగింది, ఇది స్వియాటెక్ ఆధిపత్యానికి మరింత దోహదపడింది. అయినప్పటికీ, అనిసిమోవా ఈ టోర్నమెంట్‌లో అర్యనా సబలెంకాను ఓడించి ఫైనల్ చేరడం ఆమె పునరాగమనానికి సూచికగా నిలిచింది. వింబుల్డన్ 2025 ఈ విజయంతో వరుసగా ఎనిమిదో సంవత్సరం కొత్త మహిళా ఛాంపియన్‌ను చూసింది, ఇది మహిళల టెన్నిస్‌లో పెరుగుతున్న పోటీతత్వాన్ని సూచిస్తుంది. స్వియాటెక్‌ను 4/11 ఫేవరెట్‌గా భావించిన స్కై బెట్, ఆమె విజయం ఆశ్చర్యం కలిగించలేదని తెలిపింది. ఈ ఫైనల్‌లో ప్రిన్సెస్ ఆఫ్ వేల్స్ సమక్షంలో వీనస్ రోజ్‌వాటర్ డిష్‌ను స్వియాటెక్ అందుకుంది, ఈ కార్యక్రమంలో మాజీ ఛాంపియన్లు కొంచిటా మార్టినెజ్, మార్టినా నవ్రతిలోవా, బిల్లీ జీన్ కింగ్ కూడా హాజరయ్యారు.

**వింబుల్డన్ 2025 ఈ విజయంతో వరుసగా ఎనిమిదో సంవత్సరం కొత్త మహిళా ఛాంపియన్‌ను చూసింది, ఇది మహిళల టెన్నిస్‌లో పెరుగుతున్న పోటీతత్వాన్ని సూచిస్తుంది. స్వియాటెక్‌ను 4/11 ఫేవరెట్‌గా భావించిన స్కై బెట్, ఆమె విజయం ఆశ్చర్యం కలిగించలేదని తెలిపింది. ఈ ఫైనల్‌లో ప్రిన్సెస్ ఆఫ్ వేల్స్ సమక్షంలో వీనస్ రోజ్‌వాటర్ డిష్‌ను స్వియాటెక్ అందుకుంది, ఈ కార్యక్రమంలో మాజీ ఛాంపియన్లు కొంచిటా మార్టినెజ్, మార్టినా నవ్రతిలోవా, బిల్లీ జీన్ కింగ్ కూడా హాజరయ్యారు.**



స్వియాటెక్ మ్యాచ్ ముగిసిన తర్వాత కోర్టులో ఆనందంతో గెంతులు వేస్తూ, తన టీమ్ మరియు కుటుంబ సభ్యులతో విజయాన్ని సంబరాలు చేసుకుంది. ఈ విజయం ఆమె 100వ గ్రాండ్‌స్లామ్ మ్యాచ్ విజయంగా నిలిచింది, ఇది సెరెనా విలియమ్స్ తర్వాత అతి తక్కువ మ్యాచ్‌లలో (120 మ్యాచ్‌లు) ఈ ఘనత సాధించిన రికార్డుగా నమోదైంది. ఆమె ఈ టోర్నమెంట్‌లో కేవలం ఒక్క సెట్ మాత్రమే కోల్పోయి, చివరి రెండు మ్యాచ్‌లలో రెండు గేమ్‌లు మాత్రమే సమర్పించింది, తన అద్భుత ఫామ్‌ను ప్రదర్శించింది.

## ... కరుణ్ నాయర్ తన స్థానాన్ని నిలబెట్టుకోవాల్సిందే.

ఎనిమిదేళ్ల తర్వాత టీమిండియాలోకి తిరిగి వచ్చిన కరుణ్ నాయర్ ఇప్పటివరకు ఇంగ్లాండ్ పర్యటనలో తన బ్యాటింగ్‌తో ఆకట్టుకోలేకపోయాడు. అతనిపై అభిమానులకు చాలా అంచనాలు పెట్టుకున్నారు. కానీ కరుణ్ నాయర్ వాళ్ల ఆశల మీద నీళ్లు చల్లాడు. కరుణ్ నాయర్ ఐదు ఇన్నింగ్స్‌లలో ఒక్క హాఫ్ సెంచరీ కూడా చేయలేకపోయాడు. ఈ టెస్ట్ సిరీస్‌లో మొత్తం 13 సెంచరీలు నమోదయ్యాయి. అందులో శుభ్‌మన్ గిల్ ఒక డబుల్ సెంచరీ కూడా ఉంది. కానీ కరుణ్ నాయర్ బెస్ట్ స్కోరు కేవలం 40 పరుగులు మాత్రమే. ఈ టెస్ట్ సిరీస్‌లో భారత ఆటగాడు ఐదు ఇన్నింగ్స్‌లలో కేవలం 23.40 సగటుతో 117 పరుగులు మాత్రమే చేశాడు. ఈ రెండు జట్ల మధ్య జరిగిన మొదటి టెస్ట్ మ్యాచ్ మొదటి ఇన్నింగ్స్‌లో కరుణ్ నాయర్ ఖాతా కూడా ఓపెన్ చేయలేకపోయాడు రెండో ఇన్నింగ్స్‌లో 20 పరుగులు చేశాడు. ఎడ్జ్‌బాస్టన్ టెస్ట్‌లో కూడా కరుణ్ నాయర్ నుంచి పెద్ద ఇన్నింగ్స్ ఆశించారు. కానీ తను టీమిండియా అభిమానులను నిరాశపరిచాడు. టీమిండియా ఈ మ్యాచ్‌ను 336 పరుగుల తేడాతో గెలిచినప్పటికీ, నాయర్ మొదటి ఇన్నింగ్స్‌లో 31 పరుగులు, రెండో ఇన్నింగ్స్‌లో 26 పరుగులు మాత్రమే చేశాడు.మూడో టెస్ట్ మొదటి ఇన్నింగ్స్‌లో అతను 40 పరుగులు చేశాడు.. ఇది ఈ సిరీస్‌లో అతని బెస్ట్ స్కోరు. కరుణ్ నాయర్‌కు వరుసగా ఛాన్సులు వస్తున్నాయి కానీ అతను వాటిని సద్వినియోగం చేసుకోలేకపోతున్నాడు. ఈ సిరీస్‌లో భారత ఆటగాళ్లు యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్ కూడా సెంచరీలు సాధించారు. ఈ నేపథ్యంలో కరుణ్ నాయర్ టీమిండియాలో తన స్థానాన్ని నిలబెట్టుకోవాలంటే ఈ మ్యాచ్ రెండో ఇన్నింగ్స్‌లో పెద్ద స్కోరు చేయడం తనకు చాలా ముఖ్యం.

# కీరన్ పొలార్డ్ సూపర్ ఇన్నింగ్స్

మేజర్ లీగ్ క్రికెట్ 2025 టోర్నమెంట్‌లో ఎంఐ న్యూయార్క్ జట్టు ఫైనల్‌కు చేరుకుంది. ఛాలెంజర్ మ్యాచ్‌లో టెక్సాస్ సూపర్ కింగ్స్ జట్టును 7 వికెట్ల తేడాతో ఓడించి ఎంఐ న్యూయార్క్ రెండో సారి టైటిల్ మ్యాచ్‌కు అర్హత సాధించింది. డల్లాస్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో ఎంఐ న్యూయార్క్ టాస్ గెలిచి తొలుత బౌలింగ్ ఎంచుకోగా.. ముందుగా టెక్సాస్ సూపర్ కింగ్స్ జట్టు బ్యాటింగ్ చేసింది. టెక్సాస్ సూపర్ కింగ్స్ నిర్ణీత 20 ఓవర్లలో 166 పరుగులు చేసింది. సూపర్ కింగ్స్ బ్యాటర్లలో కెప్టెన్ ఫాఫ్ డుప్లెసిస్(42 బంతుల్లో 59 పరుగులు), అకీల్ హుస్సేన్(32 బంతుల్లో 55 పరుగులు), డొనొవాన్ ఫెరీరా(20 బంతుల్లో 32 పరుగులు) రాణించారు. ఈ ముగ్గురి ఇన్నింగ్స్ కారణంగా టెక్సాస్ సూపర్ కింగ్స్ 5 వికెట్ల నష్టానికి 166 పరుగులు చేయగలిగింది. ఎంఐ న్యూయార్క్ బౌలర్లలో ట్రిస్టన్ లస్ 3 వికెట్లు పడగొట్టగా.. రిషిల్ ఉగార్కర్ 2 వికెట్లు తీశాడు. అనంతరం 167 పరుగుల లక్ష్యంలో న్యూయార్క్ జట్టు బరిలోకి దిగగా.. ఆరంభంలోనే క్వింటన్ డికాక్(6) రూపంలో కీలక వికెట్ ను కోల్పోయింది. వన్ డౌన్ బ్యాటర్ మైఖేల్ బ్రేస్ వెల్(8) కూడా పూర్తిగా విఫలమయ్యాడు. ఓపెనర్ మోనాంక్ పటేల్ 39 బంతుల్లో 49 పరుగులు చేశాడు. దీనితో పాటు నికోలస్ పూరన్ 36 బంతుల్లో అజేయంగా 52 పరుగులు చేశాడు. ఎంఐ న్యూయార్క్ స్టార్ బ్యాటర్ కీరన్ పొలార్డ్ దంచి కొట్టడంతో విజయం సొంతమైంది. పొలార్డ్ 22 బంతుల్లోనే 213.64 స్ట్రైక్ రేట్‌తో 47 పరుగులు చేశాడు. ఐపీఎల్ లాగే ఇప్పుడు మేజర్ లీగ్ క్రికెట్ టోర్నీలో కూడా కీరన్ పొలార్డ్ సూపర్ కింగ్స్ ను ఓడించి జట్టుకు భారీ విజయాన్ని అందించి ఫైనల్‌కు చేర్చాడు. నికోలస్ పూరన్, కీరన్ పొలార్డ్ రెచ్చిపోవడంతో 19 ఓవర్లలో కేవలం మూడు వికెట్లు మాత్రమే కోల్పోయి ఎంఐ న్యూయార్క్ లక్ష్యాన్ని ఛేదించింది. టెక్సాస్ సూపర్ కింగ్స్ బౌలర్లలో అకీల్, జియా ఉల్ హక్, నూర్ అహ్మద్ తలో వికెట్ పడగొట్టారు.లీగ్ దశలో ఎంఐ న్యూయార్క్ ప్రదర్శన అంతగా ఆకట్టుకోనప్పటికీ.. వారు ఏదో విధంగా ప్లేఆఫ్స్‌కు చేరుకున్నారు. ఇప్పుడు వారు టెక్సాస్ సూపర్ కింగ్స్ జట్టును ఓడించి ఫైనల్‌కు చేరుకున్నారు. జులై 13న(సోమవారం) వేకువ జామున 5.30 గంటలకు వాషింగ్టన్ ఫ్రీడమ్ జట్టుతో ఎంఐ న్యూయార్క్ జట్టు తలపడనుంది. వాషింగ్టన్ ప్రదర్శన మొదటి నుంచి బాగుంది. అందుకే ఫైనల్‌లో వారు గెలుపొందేందుకు ఫేవరేట్‌గా ఉన్నారు.

# నీరజ్ వర్సెస్ నదీమ్




భారత్, పాకిస్థాన్ జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్‌కు ఉండే క్రేజ్ తెలిసిందే. ఈమధ్య ఇరుదేశాల అథ్లెట్ల మధ్య జావెలిన్ త్రో పోటీ కూడా అంతే ఉత్కంఠ రేపుతోంది. అంతర్జాతీయ వేదికలపై నీరజ్ చోప్రా, అర్షద్ నదీమ్ తగ్గేదేలే అన్నట్టు పోటీ పడుతుం డడమే అందుకు కారణం. ఒకప్పుడు స్నేహితుల్లా మెలిగిన వీళ్లు ఈసారి ప్రత్యర్థులు గానే బరిలోకి దిగబోతున్నారు. పారిస్ ఒలింపిక్స్ తర్వాత తొలిసారి నువ్వానేనా అన్నట్టు ఈటెను విసిరేందుకు సిద్ధమవుతున్నారు ఇద్దరు. పోలాండ్‌లోని సెలేసియాలో ఆగస్ట్ 16న జరుగబోయే డైమండ్ లీగ్‌లో దాయాది అథ్లెట్లు తమ తడాఖా చూపించనున్నారు. జావెలిన్ త్రోలో దిగ్గజ ఆటగాడిగా ఎదిగిన నీరజ్ టోక్యో ఒలింపిక్స్‌లో స్వర్ణంతో చరిత్ర సృష్టించాడు. పారిస్ విశ్వ క్రీడ్లలోనూ అతడు గోల్డ్ మెడల్ సాధిస్తాడనుకున్నారంతా. కానీ, నదీమ్ 92.97 మీటర్ల దూరంతో నీరజ్(89.45 మీటర్లు)కు షాకిచ్చాడు. అయితే.. నిరుడు ఆగస్టు 8న చివరిసారి పోటీపడిన ఈ ఇద్దరూ త్వరలోనే పోలాండ్ డైమండ్ లీగ్‌లో ఎదురుపడనున్నారు. హల్గాం ఉగ్రదాడి, 'ఆపరేషన్ సిందూర్' తదనంతర పరిణామాలతో ఇరుదేశాల మధ్య వైరం మరింత పెరిగిన నేపథ్యంలో నీరజ్, నదీమ్‌ల జావెలిన్ ఫైట్ అందరిలో ఆసక్తి రేపుతోంది. ఈమధ్యే దోహా డైమండ్ లీగ్‌లో 90 మీటర్ల మార్క్ అందుకున్న భారత బడిసె వీరుడు ఈసారి పాకిస్థాన్ అథ్లెట్‌కు ఝలక్ ఇవ్వాలనుకుంటున్నాడు. ఈ టోర్నీ తర్వాత సెప్టెంబర్‌లో వరల్డ్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్స్‌లో నీరజ్ పోటీపడనున్నాడు.


**CHENGE OF NAME AND DATE OF BIRTH**

I, KODI VINAY KUMAR, DOB: 01/01/2008 R/OH.NO:1-69, CHOWDARPALLE(POST),V) M)BOMRASPET,D)VIKARABAD, TELANGANA STATE , PIN: 509350, CHENGED MY NAME AND DATE OF BIRTH AS FOR BIRTH CERTIFICATE KODI VISHNU KUMAR S/O KODI NARSIMULU ,D.O.B:13/04/2011.

### రెండో రోజు బంతి మార్పుపై వివాదం..

భారత్, ఇంగ్లాండ్ జట్ల మధ్య లార్డ్స్ వేదికగా జరుగుతున్న మూడో టెస్ట్ మ్యాచ్ చాలా చర్చనీయాంశంగా మారింది. రెండో రోజు బంతి మార్పుపై పెద్ద వివాదం చెలరేగింది. ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 80 ఓవర్ల తర్వాత రూల్స్ ప్రకారం భారత్ కొత్త బంతిని అందుకుంది. అయితే 10 ఓవర్లు పూర్తయ్యేసరికే బంతి ఆకారం దెబ్బతిన్నది. భారత ఆటగాళ్ల ఫిర్యాదులో బంతిని పరిశీలించిన అంపైర్ మరో బాల్‌ను తెప్పించాడు. 10 ఓవర్లు మాత్రమే ఆడిన బాల్ తీసుకొచ్చాడు. అయితే ఈ బంతి పాతదానికి కంటే మరి ఘోరంగా ఉండటంతో భారత ఆటగాళ్లు తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు. ఇదే విషయాన్ని అంపైర్‌కు చెప్పే ప్రయత్నం చేయగా.. అతను వినిపించుకోలేదు.

## రామంతాపూర్ అప్పుడే పుట్టిన పసికందును పడేసి వెళ్లిన తల్లి



**ఉప్పల్ జూలై 12 ( జనం సాక్షి):**
ఉప్పల్ పరిధి రామంతాపూర్ పరిధిలోని వివేక్ నగర్ సమీపంలో శనివారం దారుణ ఘటన చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరా లు. గుర్తు తెలియని ఓ మహిళ తనకు పుట్టిన ఓ పసికందును రోడ్డు పక్కన పడేసి వెళ్ళిపో యింది. శిశువు ఏడుపు విన్న స్థానికులు వెళ్లి చూసి నాగోల్‌లోని 108 అంబులెన్స్‌కు సమా చారం అందించారు. టెక్నీషియన్ యాదగిరి, పైలట్ ప్రణయ్ శిశువుకు ప్రథమ చికిత్స అందించి ఉప్పల్ పోలీసుల సాయంతో నిలోఫర్ ఆసుపత్రికి తరలించారు.

# నేడు ఉజ్జయిని మహంకాళి బోనాలు

**భారీగా ఏర్పాట్లు చేసిన అధికారులు**

**నేడు పట్టువస్త్రాలు సమర్పించనున్న సీఎం రేవంత్**



**హైదరాబాద్,జులై 12 (జనంసాక్షి) :** తెలంగాణలో బోనాల జాతర అంగరంగ వైభవంగా కొనసాగుతోంది. ఇప్పటికే గోల్కొండ బోనాలు ముగియగా సికింద్రాబాద్ లష్కర్ బోనాల జాతర నిర్వహించేందుకు అధికారులు అన్ని రకాల ఏర్పాట్లు- పూర్తి చేశారు. ఆదివారం సికింద్రాబాద్ ఉజ్జయిన మహంకాళి బోనాలు జరగనున్నాయి. ప్రభుత్వం తరఫున సీఎం రేవంత్ రెడ్డి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. లక్షలాదిమంది భక్తులు తరలి వచ్చే అవకాశంతో అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు చేస్తోంది ప్రభుత్వం. భక్తులకు ఇబ్బందులు కలగకుండా అధికారులు చర్యలు తీసుకుంటోంది. ఆదివారం మహంకాళి బోనాలకు ఉదయం 4.10 బ్రహ్మ ముహూర్తంలో అమ్మవారికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు జరుగుతాయి. ఆలయ ధర్మకర్త కుటుంబం నుంచి అమ్మవారికి తొలి బోనం సమర్పించనున్నారు. సోమవారం రోజు రంగం భవిష్యవాణితో పాటు- అమ్మవారి అంబారి ఊరేగింపు, ఆదివారంరాత్రి, సోమవారం రాత్రి అమ్మవారి ఫలహార బండ్ల ఊరేగింపు ఉంటుంది. అమ్మవారి దర్శనం కోసం వచ్చే భక్తుల కోసం 6 క్యూలైన్ లు ఏర్పాటు- చేశారు భక్తులు. బాట షోరూం నుంచి 2 , రాంగోపాల్ పేట్ పోలీస్ స్టేషన్ నుంచి 2, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి 2 క్యూలైన్లు ఉన్నాయి. క్యూ లైన్ లో 16 మీటర్లకు ఒక ఎమర్జెన్సీ గేట్ ఏర్పాటు- చేశారు. భారీ పోలీస్ బందోబస్తుతో పాటు 70 సీసీటీ-వి కెమెరాల నడుమ బోనాల జాతర జరగనుంది. భక్తులకు ఇబ్బంది కలగకుండా, మొబైల్ వాష్ రూమ్స్ ఏర్పాటు చేశారు. ఉదయం వేళల్లో రద్దీ ఉంటుంది కాబట్టి జోగినిలు, శివశక్తులకు దర్శనం చేసుకునేందుకు స్పెషల్ టైం కేటాయించారు. శివ శక్తులు, జోగినిల కోసం మధ్యాహ్నం 2గంటల నుంచి 4 గంటల వరకు సమయం కేటాయించారు.

# శ్రీశైలం దారిలో భారీగా ట్రాఫిక్ జామ్



**హైదరాబాద్,జులై 12 (జనంసాక్షి) :** వారాంతపు వరుస సెలవులు రావడం.. దానికి తోడు శ్రీశైలం డ్యాం గేట్లు- ఎత్తడంతో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు, సందర్శకుల తాకిడి ఎక్కువైంది. దీంతో హైదరాబాద్, శ్రీశైలం రహదారిపై భారీ ట్రాఫిక్ జామ్ అయ్యింది. వాహనాలు చీమల బారులు తీరినట్లుగా రోడ్డుపై నిలిచిపోయాయి. శనివారం శ్రీశైలం వెళ్లే దారిలో దోమలపెంట నుంచి సున్నిపెంట వరకు 12 కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. 3 గంటలకు పైగా వాహనాలన్నీ రోడ్లపై నిలిచిపోయాయి. దీంతో ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. నల్లమల అడవి మార్గంలో రోడ్లపై కిలోమీటర్ల మేర వేల వాహనాలు నిలిచిపోవడంతో పోలీస్ సిబ్బంది ట్రాఫిక్ క్లియర్ చేస్తున్నారు. ఎగువన కురుస్తున్న వర్షాలతో శ్రీశైలానికి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో గేట్లను ఎత్తడంతో డ్యాం సందర్శకులకు ఆకర్షనీయంగా కనువిందు చేస్తోంది. నల్లమల ప్రకృతి అందాలు, డ్యాంను చూడటంతో పాటు- శ్రీశైల ఆలయ దర్శనం కోసం భక్తులు వేల సంఖ్యలో తరలివచ్చారు. దీంతో భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. వేల వాహనాలు రోడ్లపైన బారులు తీరాయి. ట్రాఫిక్ క్లియర్ చేసేందుకు మరింత సమయం పట్టనుందని పోలీసులు తెలిపారు. శ్రీశైలం జలాశయానికి ఇన్ ఫ్లో తగ్గడంతో శనివారం మూడు గేట్లను మూసేశారు అధికారులు. ప్రస్తుతం ఒక గేటు- ద్వారా 4,497 క్యూసెక్కుల నీరు నాగార్జున సాగర్ కు చేరుతోంది. సుంకేసుల, జూరాల నుంచి 1,37,635 క్యూసెక్కుల ఇనో వస్తుంది. జూలై నెలలోని శ్రీశైలం జలాశయానికి వరద వచ్చి.. డ్యామ్ పూర్తి స్థాయిలో నిండింది.

## 23మంది మావోయిస్టుల లొంగుబాటు

**రాయపూర్,జూలై12 (జనంసాక్షి) :** ఛత్తీస్‌గఢ్‌లో వరుస లొంగుబాట్లతో మావోయిస్టు పార్టీకి భారీ ఎదురుదెబ్బ తగిలింది. భారీగా మావోలు లొంగిపోయారు సుక్మా జిల్లా ఎస్పీ కిరణ్ చవాన్ ఎదుట శనివారం 23 మంది మావోయిస్టులు లొంగిపోయారు. శుక్రవారం నారాయణపూర్ జిల్లాలో ఎస్పీ రాబిన్‌సన్ ఎదుట 22 మంది మావోయిస్టులు లొంగిపోయిన విషయం తెలిసిందే. సుక్మా జిల్లాలో లొంగిపోయిన 23 మందిపై రూ.1.18 కోట్ల రివార్డ్ ఉన్నట్లు ఎస్పీ వెల్లడించారు. లొంగిపోయిన వారిలో 9మంది మహిళా మావోయిస్టులు ఉన్నారు. లొంగిపోయిన మావోయిస్టులకు రాష్ట్ర ప్రభుత్వం గృహాలను నిర్మిస్తుందని ఆ రాష్ట్ర హోంమంత్రి విజయ శర్మ ప్రకటించారు. నక్సలిజం.. చాలామందిని వారి కుటు-ంబాలకు దూరం చేయడమే కాకుండా తండ్రి అయ్యే ఆనందం కూడా కోల్పోయేలా చేస్తుందని హోంమంత్రి ఆక్షేపించారు. ఉద్యమంలో ఉండి స్టెరిలైజేషన్ చేయించుకున్న వారు జనజీవన స్రవంతిలోకి వస్తే.. ఐవీఎఫ్ ద్వారా తల్లిదండ్రులు అయ్యే అవకాశం కల్పిస్తామన్నారు. పునరావాస కేంద్రాల్లో ఉంటు-న్న యువతి, యువకులకు అవసరమైతే సామూహిక వివాహాలు జరిపిస్తామని మంత్రి వెల్లడించారు. సుక్మా జిల్లా మాజీ కలెక్టర్ అలెక్స్ పాల్ మీనన్‌ను కిడ్నాప్ చేసిన ఘటనలో కీలక పాత్ర వహించిన మావోయిస్టు నేత లోకేష్ కూడా లొంగిపోయిన వారిలో ఉన్నారు.

## రాష్ట్రపతి వద్ద బిల్లు పెండింగ్‌లో ఉండగా ఆర్డినెన్స్ చెల్లదు

**ఎన్నికలు త్వరగా ముగించాలనే ఆర్డినెన్స్ ప్రతిపాదన**

**బిజెపి ఎంపి లక్ష్మణ్ విమర్శలు**

**న్యూఢిల్లీ,జూలై12 (జనంసాక్షి) :** బీసీలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మరోసారి మోసం చేస్తున్నారని బీజేపీ రాజ్యసభ సభ్యులు డాక్టర్ కే. లక్ష్మణ్ ఆరోపించారు. బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చేందుకు రేవంత్‌రెడ్డి మంత్రివర్గంలో తీర్మానం చేయడం అంటే బీసీలను మరోసారి మోసగించడమేనని విమర్శించారు. శనివారం ఢిల్లీలో లక్ష్మణ్ మీడియాతో మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం పంపించిన బిల్లు రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉన్నప్పటికీ ఆ బిల్లుపై ఏమి తేల్చకుండా ఆర్డినెన్స్ తీసుకురావడంలో ఉన్న మతలబు ఏంటని ప్రశ్నించారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో ఇచ్చిన వాగ్దానాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు నిలపెట్టుకోవడం లేదని ప్రశ్నించారు. ఇప్పటి వరకు నిర్వహించిన అసెంబ్లీ సమావేశాల్లో బీసీ డిక్లరేషన్‌కు సంబంధించిన కనీస ప్రస్తావన ఎందుకు చేయలేదని నిలదీశారు. సెప్టెంబర్‌లోపు బీసీ రిజర్వేషన్లను తేల్చాలని తెలంగాణ హై కోర్టు ఆదేశించిందని.. కాబట్టే ఎన్నికలు త్వరగా నిర్వహించి మరోసారి బీసీలని మోసం చేయడానికే రేవంత్‌రెడ్డి సర్కార్ సిద్ధమవుతోందని విమర్శించారు. రాష్ట్రపతి దగ్గర 42శాతం రిజర్వేషన్‌లకు సంబంధించిన బిల్లు పెండింగ్‌లో ఉన్నప్పుడు ఆర్డినెన్స్ తీసుకువస్తే.. ఆ బిల్లుకి గవర్నర్ ఎలా ఆమోదం తెలుపుతారని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి సర్కార్‌కి కనీస ఇంగిత జ్ఞానం లేదని, బీసీల జీవితాలతో చెలగాటం ఆడుతూ వారిని రాజకీయ అస్త్రాలుగా మార్చుకునే ప్రయత్నం చేస్తోందని లక్ష్మణ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసి పూర్తి స్వేచ్ఛ ఆయా రాష్ట్రాలకు ఉందని నొక్కిచెప్పారు.

రిజర్వేషన్లు కల్పించేందుకు ఒక ప్రత్యేక కమిషన్ ఏర్పాటు- చేసి రాష్ట్రంలో ఏ కులానికి సంబంధించిన జనాభా ఎంత ఉందో లెక్కలు తేలిస్తే న్యాయస్థానాల్లో వాదన నిలబడే అవకాశం ఉందని చెప్పుకొచ్చారు. రిజర్వేషన్లలో వివిధ కులాలకు సంబంధించిన గణాంకాలను రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు బయట పెట్టడం లేదని నిలదీశారు. కులాలకు సంబంధించిన జనాభా ప్రామాణిక గణాంకాలను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేస్తే కోర్టులో రాష్ట్ర ప్రభుత్వ వాదన నిలబడే అవకాశం ఉందని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు- చేసిన బుర్ర వెంకటేశం ఆధ్వర్యంలో కమిషన్ బాధ్యతలను ఎందుకు సరిగ్గా నిర్వర్తించలేదని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వివిధ కులాలకు సంబంధించిన ప్రామాణిక గణాంకాలు వెంటనే విడుదల చేయాలని లక్ష్మణ్ డిమాండ్ చేశారు. 2021లో వికాస్ కిషన్‌రావు వర్సెస్ మహారాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన కేసులో స్థానిక సంస్థల రిజర్వేషన్లకు సంబంధించి సుప్రీంకోర్టు మార్గదర్శకాలు స్పష్టంగా ఉన్నాయని చెప్పుకొచ్చారు. ఎస్సీ, ఎస్టీలతో పాటు- బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కేటాయించినప్పుడు 50 శాతానికి మించకూడదనే నిబంధనను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పాటించిందా అని నిలదీశారు. బీఆర్ఎస్, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలు రిజర్వేషన్ల పేరుతో బీసీలను గతంలో వంచించాయని మండిపడ్డారు. ఇప్పుడు ఇదేవిధంగా రేవంత్‌రెడ్డి బీసీలను దగా చేసి ఓట్లు- దండుకొనే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు.

## బోనాల చెక్కుల పంపిణీలో ఉద్రిక్తత

**కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తల మధ్య తోపులాట**



**హైదరాబాద్,జులై 12 (జనంసాక్షి) :** సికింద్రాబాద్‌లో బోనాల చెక్కుల పంపిణీలో ఉద్రిక్తత చోటు- చేసుకుంది. ప్రోటోకాల్ పాటించడం లేదంటూ బీఆర్ఎస్ నేతలు ఆందోళనకు దిగారు. ఈ క్రమంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తల మధ్య తోపులాట చోటు- చేసుకుంది. సీఎం సలహాదారుడు వేం నరేందర్ రెడ్డి, సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు ముందే కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు పోటా పోటీ నినాదాలు చేశారు. చెక్కులు పంపిణీ చేస్తుండగా బీఆర్ఎస్ నేతలు స్టేజ్‌పై కరెంట్ కట్ చేశారు . బీఆర్ఎస్ నేతల తీరుపై వేం నరేందర్ రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. తప్రోటోకాల్ పాటించడం లేదంటూ బీఆర్ఎస్ కార్పొరేటర్లు ఆందోళనకు దిగారు. ప్రోటోకాల్ పేరుతో ఎమ్మెల్యే పద్మారావు వివాదం సృష్టిస్తున్నారంటూ డిప్యూటీ- మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే పద్మారావు, కాంగ్రెస్ ఇంఛార్జ్ సంతోష్ అనుచరుల మధ్య వాగ్వాదం చోటు- చేసుకుంది. పరస్పరం నినాదాలు చేసుకున్నారు. దీంతో సికింద్రాబాద్ కట్టమైసమ్మకు సంబంధించిన బోనాలు వేడుక చెక్కుల పంపిణీ వివాదాస్పదంగా మారింది. ప్రోటోకాల్ ప్రకారం అన్నీ జరిగాయని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. ప్రోటోకాల్ కోసమే తప్ప ఎమ్మెల్యే అసలు తమకు అందుబాటు-లో ఉండటం లేదంటూ హస్తం నేతలు ఆందోళనకు దిగారు. తీవ్ర గందరగోళం నెలకొనడంతో వెంటనే పోలీసులు కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తలను చెదరగొట్టారు.

## నీటిసంపులో పడి నాలుగేళ్ల బాలుడు మృతి



**హైదరాబాద్,జులై 12 (జనంసాక్షి) :** హైదరాబాద్ మియాపూర్‌లో విషాదం చోటుచేసుకుంది. ప్రమాదవశాత్తు నాలుగేళ్ల బాలుడు నీటి సంపులో పడి మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. మియాపూర్ లోని హాఫీజ్‌పేట్ మార్తాండ నగర్ కాలనీలో శ్రీను, నీల దంపతుల నాలుగేళ్ల కుమారుడు అభి ఇంటి పరిసరాల్లో ఆడుకుంటూ ప్రమాదవశాత్తు జులై 12న నీటి సంపులో పడి మృతి చెందాడు. కూలి పనుల కోసం ఉదయాన్నే ఇంటి నుంచి వెళ్లిన తల్లిదండ్రులు తమ కుమారుడి మరణ వార్త విని కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఇంటి యజమాన్యం నిర్లక్ష్యం వల్లే తమ కుమారుడు ప్రాణాలు కోల్పోయాడని కుటు-ంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఘటనా స్థలానికి చేరుకున్న మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. చిన్నపిల్లలు ఇంటి దగ్గర ఉన్నప్పుడు తల్లిదండ్రులు వారిని నిత్యం గమనిస్తూ ఉండండి. లేదంటే ఇలాంటి అనుకోని సంఘటనల తర్వాత బాధపడాల్సి వస్తుందని హెచ్చరించారు.

## కాశ్మీర్‌లో లోయలో పడ్డ వాహనం.. ఐదుగురు వ్యక్తుల దుర్మరణం

**శ్రీనగర్,జులై 12 (జనంసాక్షి) :** జమ్ము కశ్మీర్ రాష్ట్రం రాంబన్ జిల్లాలో శనివారం ఉదయం వాహనం లోయలో పడింది. ఈ ఘటనలో ఐదుగురు మృతి చెందారు. గాయపడిన ఐదుగురిని ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రులలో యావర్ అహ్మద్ పరిస్థితి విషమంగా ఉన్నట్టు- సమాచారం. యుక్రల్ పోగల పరిస్తాన్ ప్రాంతంలోని సేనాబాతిలో రోడ్డుపక్కన ఉన్న 600 అడుగుల లోయలో పర్యాటకుల వాహనం పడింది. రెస్క్యూ సిబ్బంది, అధికారులు అక్కడికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ప్రమాదంపై జమ్ము కశ్మీర్ ముఖ్యమంత్రి ఓమర్ అబ్దుల్లా, కేంద్ర మంత్రి జీతేంద్ర సింగ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతులు కుటు-ంబాలకు లక్ష రూపాయలు, గాయపడిన 25 వేల రూపాయలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు.

## సిట్ విచారణకు విజయసాయి డుమ్మా

**అమరావతి,జూలై12 :** మద్యం కుంభకోణం కేసులో మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి శనివారం సిట్ విచారణకు హాజరుకాలేదు. అయితే తాను విచారణకు రాలేనని సిట్ అధికారులకు ముందే సమాచారం ఇచ్చారు. తనకు ముందుగా నిర్ణయించిన కార్యక్రమాలు ఉండటం వలన రాలేకపోతున్నట్లు- విజయసాయి సమాచారం పంపారు. తాను రేపో మాపో విచారణకు వచ్చే తేదీని తెలియజేస్తానని చెప్పారు. కాగా.. ఈ కేసుకు సంబంధించి ఇప్పటికే ఒకసారి సిట్ ముందు విజయసాయి విచారణకు హాజరయ్యారు. అయితే ఈరోజు సిట్ ముందుకు విజయసాయి రావాల్సి ఉండగా.. అంతుముందే సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ఆయన ఆసక్తికరమైన పోస్ట్ చేశారు.

## పంటలు ఎండిపోకుండా కాపాడండి : మంత్రికి రైతుల వినతి



**హైదరాబాద్,జూలై12 (జనంసాక్షి) :** సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయని రైతులు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లారు. రైతుల విజ్ఞప్తి మేరకు సీతారామ ప్రాజెక్టు నుంచి నీటి విడుదలపై నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కలెక్టర్లతో తుమ్మల మాట్లాడారు. నాగార్జునసాగర్ నుంచి నీటి విడుదల ఆలస్యమవుతోందని, సీతారామ ప్రాజెక్టు నుంచి విడుదల చేయాలని కోరారు. ఖమ్మం, భద్రాద్రి జిల్లా కలెక్టర్లతోనూ మంత్రి తుమ్మల మాట్లాడారు. ఇవాళ సమీక్ష తర్వాత నిర్ణయం తీసుకుంటామని మంత్రి ఉత్తమ్ తెలిపారు.

## అనురాగ్ వర్సిటీలో స్లాబ్ కూలి నలుగురికి గాయాలు

**మేడ్చల్,జులై 12 (జనంసాక్షి) :** బీఆర్ఎస్ జనగాం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డికి చెందిన అనురాగ్ యూనివర్సిటీలో శనివారం ప్రమాదం జరిగింది. పోచారం పోలీస్ స్టేషన్ పరిధిలోని వెంకటాపూర్ సమీపంలో ఈ ఘటన చోటు-చేసుకుంది. స్లాబ్ కూలి నలుగురు కూలీలకు గాయాలయ్యాయి. వెంటనే వారిని స్థానిక ఆస్పత్రికి తరలించారు. ఇద్దరి కూలీల పరిస్థితి విషమంగా ఉండటంతో ఎమర్జెన్సీ వార్డులో చికిత్స పొందుతున్నారు. ఎఫ్‌టీఎల్‌లో నూతనంగా నిర్మాణాలు చేపడుతున్నారని గతంలో అనురాగ్ యూనివర్సిటీపై పలువురు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో మీడియాను కూడా యూనివర్సిటీ- సిబ్బంది లోపలికి అనుమతించలేదు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కూలీల కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో వారు ఆస్పత్రికి చేరుకున్నారు. ఈ ఘటనకి సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## రవాణా శాఖలో విప్లవాత్మక మార్పులు

**వాహనాల ఫిట్‌నెస్, డ్రైవింగ్‌పై అవగాహన : మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి**



**నల్లగొండ,జులై 12 (జనంసాక్షి) :** తెలంగాణలో రవాణా శాఖలో విప్లవాత్మక మార్పులు తెచ్చామని మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యానించారు. వాహనాల ఫిట్‌నెస్, డ్రైవింగ్‌పై అవగాహన లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పుకొచ్చారు. శనివారం నల్లగొండలో మంత్రులు పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకటరెడ్డి పర్యటించారు. పలు అభివృద్ధి కార్యక్రమాల్లో మంత్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడారు. తెలంగాణలో 17 ఆటోమేటిక్ టెస్టింగ్ స్టేషన్‌లు నిర్మిస్తున్నామని చెప్పుకొచ్చారు. 15 సంవత్సరాలు దాటిన వాహనాలు స్క్రాప్‌కి వెళ్తున్నాయని మంత్రి పొన్నం ప్రభాకర్ వివరించారు. రాష్ట్రం వాహన సారథిలోకి ఎంట్రీ- అయిందని చెప్పారు. వాహనాల ఫిట్‌నెస్, పొల్యూషన్ అన్నీ వాహన సారథిలో చూసుకోవచ్చని తెలిపారు. ఏఐ ద్వారా డ్రైవింగ్ లైసెన్స్‌లు ఇచ్చేలా చేస్తున్నామని అన్నారు. యాక్సిడెంట్‌లు చేస్తే లైసెన్స్‌లు వెంటనే రద్దు చేస్తున్నామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఆటోమేటిక్ -టె-స్టింగ్ స్టేషన్, స్క్రాప్ పాలసీ, ఈవీ పాలసీ తీసుకువచ్చామని నొక్కిచెప్పారు. డ్రైవింగ్ -ట్రైనింగ్ సెంటర్లు వస్తున్నాయని...అక్కడ -ట్రైనింగ్ తీసుకున్న తర్వాతనే లైసెన్స్‌లు వస్తాయని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. నల్గొండ జిల్లాలో రూ.8 కోట్లతో ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. ఇది తెలంగాణలోనే రెండవ ఆఃూ సెంటర్ అని ఉద్ఘాటించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయడంలో పొన్నం ప్రభాకర్ కేబినెట్‌లో కొట్లాడారని గుర్తుచేశారు. నిజాం కాలంలో మొదటి డిపో నార్కెట్‌పల్లి అని ఇప్పుడు 60 బస్సులు ఉన్నాయని.. ఇంకో 20 బస్సులు కావాలని సూచించారు. నల్లగొండ డిపోను నూతనంగా నిర్మించాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌కి మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

## విశ్వనగరం అంటే హైటెక్ సిటీ కాదు : ఎంపీ ఈటల రాజేందర్



**హైదరాబాద్, జూలై 12 (జనంసాక్షి) :** విశ్వనగరం అంటే హైటెక్ సిటీ కాదు.. శివారు ప్రాంతాల కాలనీల్లో కూడా మౌలిక వసతులు కల్పించడమే అభివృద్ధి సాధించడమని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ స్పష్టంచేశారు. శనివారం హయత్ నగర్ డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఎంపీ ఈటల మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్ విశ్వనగరమని హైటెక్ సిటీని చూపుతూ అభివృద్ధి సాధించామని గొప్పలు చెబుతుందే తప్ప నగర శివారు ప్రాంతాల కాలనీల్లో కూడా మౌలిక వసతులైన రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి సదుపాయాలు కల్పించాలని సూచించారు. హైదరాబాద్ శివారులో కొత్తగా విస్తరించిన కాలనీల్లో గానీ, బస్తీల్లో గానీ సమస్యలు చూస్తే గుండె తరుక్కుపోతుందన్నారు.

## బిసి రిజర్వేషన్లపై అసెంబ్లీలో చర్చించాలి

**భాజపా ఎమ్మెల్యే పాయల్ శంకర్ డిమాండ్**



**హైదరాబాద్,జులై 12(జనంసాక్షి) :** బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వం హడావుడి చూస్తుంటే బీసీలను మోసం చేస్తున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని భాజపా ఎమ్మెల్యే పాయల్ శంకర్ పేర్కొన్నారు. ఆర్డినెన్సు తీసుకురాకుండానే బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేసినట్లు కాంగ్రెస్ నేతలు మాట్లాడుతున్నారని వ్యాఖ్యానించారు. ఇందులో సాధ్యాసాధ్యాలను పరిశీలించడం లేదని అన్నారు. భాజపా రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ఎప్పుడూ ఇచ్చిన మాట మీద నిలబడలేదన్నారు. బీసీ రిజర్వేషన్లకు మతపరమైన అంశాన్ని జోడించారు. మతపరమైన రిజర్వేషన్లను రాజ్యాంగం, సుప్రీం కోర్టు అంగీకరించవు. శాసనసభ సమావేశాలు ఏర్పాటు- చేసి.. బీసీ రిజర్వేషన్ ఏ విధంగా అమలుచేస్తారో చర్చించాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంలో న్యాయపరమైన ఇబ్బందులు రాకుండా.. బీసీలకు అన్యాయం జరగకుండా.. ఇచ్చిన మాటకు కట్టు-బడి ఉండాలని పాయల్ శంకర్ డిమాండ్ చేశారు.

## ఐదు మున్సిపాలిటీలకు స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులు




**న్యూఢిల్లీ,జులై 12 (జనంసాక్షి) :** కేంద్ర ప్రభుత్వం పలు రాష్ట్రాల్లోని నగరాలకు వివిధ కేటగిరీల్లో స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులు ప్రకటించింది. అందులో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లోని అయిదు మున్సిపల్ కార్పొరేషన్లకు అవార్డులు దక్కాయి. విశాఖపట్నం, రాజమండ్రి, విజయవాడ, తిరుపతి, గుంటూరు నగరాలు ఆ పురస్కారాలు దక్కించుకున్నాయి. జాతీయ స్థాయిలో స్పెషల్ కేటగిరీ మినిస్టీరియల్ అవార్డును విశాఖ నగరం సొంతం చేసుకుంది. రాష్ట్ర స్థాయిలో మినిస్టీరియల్ అవార్డుకు రాజమండ్రి ఎంపికైంది. స్వచ్ఛ సూపర్‌లీగ్ సిటీస్ విభాగంలో విజయవాడ, గుంటూరు, తిరుపతి నగరాలు ఎంపికయ్యాయి. రాష్ట్రంలోని ప్రధాన నగరాలు స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులకు ఎంపిక కావడంపై ఏపీ స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభిరామ్ హర్షం వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు చేపట్టిన స్వచ్ఛాంధ్ర కార్యక్రమాల కారణంగానే ఈ అవార్డులు దక్కాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కృషి చేసిన అధికారులు, పారిశుద్ధ సిబ్బంది, సహకరించిన ప్రజలకు పట్టాభి అభినందనలు తెలిపారు.

## ఐఐఎ విద్యార్థినిపై అత్యాచారం

**కోల్‌కతాలో మరో దారుణం**

**కోల్‌కతా,జులై 12 (జనంసాక్షి) :** పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో మహిళలపై అత్యాచారాలు పెరిగిపోతున్నాయి. రోజుకో ఘటన వెలుగులోకి వస్తుంది. కోల్‌కతాలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెనేజ్‌మెంట్ చదువుతున్న విద్యార్థినిపై మరో విద్యార్థి అత్యాచారం చేశాడు. ఓ విద్యార్థిని మానసికంగా కృంగిపోవడంతో ఆమె స్నేహితుడు కౌన్సిలింగ్ ఇస్తానని రమ్మని కబురు పంపాడు. విద్యార్థిని బాయ్స్ హాస్టల్‌కు వెళ్లిన తరువాత మత్తు మందు కలిపిన కూల్ డ్రింక్ ఆమెకు స్నేహితుడు ఇచ్చాడు. ఆమె స్పృహ కోల్పోయిన తరువాత ఆమెపై అతడు అత్యాచారం చేశారు. ఆమెకు స్పృహ వచ్చిన తరువాత తనపై అఘాయిత్యం జరిగిందని తెలుసుకొని అతడిని ప్రశ్నించింది. ఈ విషయం బయట చెబితే చంపేస్తానని బెదిరించాడు. వెంటనే ఆమె స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకొని అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కోల్‌కతాలోని ఓ జూనియర్ వైద్యురాలిపై హత్యాచార ఘటన దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. నెల రోజుల క్రితం న్యాయ విద్యార్థినిపై సామూహిక అత్యాచారం జరిగిన విషయం విదితమే.




Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16614, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana-500077, Published at #119 & 120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor: M.M.RAHMAN RNI NO. APTEL/2013/50370